ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-5-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 93 పేజీలు: 12 వెల: 6.50

**భారత్ నౌకలను అనుమతించబోం**

**తెరుచుకున్న బద్రీనాథ్ దేవాలయం**

9లో

# మూడేళ్లలో 'అమరావతి'

## • పర్యవేక్షణ బాధ్యత మంత్రులదే • త్వరలోనే నామినేటెడ్ భర్తీ
## • కడపలో 3 రోజులు మహానాడు • టెలి కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు



**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** మూడేళ్లలో అమరావతి రాజధాని నిర్మాణ పనులను పూర్తి చేసి, ఘనంగా ప్రారంభోత్సవాలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.ఈ విషయంలో ఆకుంఠిత దీక్ష,సంకల్పంతో అందరు కలిసి పనిచేద్దాన్నారు. వాగ్దానం చేసాం, ఇక పనైయిపోయిందనే దిశలో కాకుండా పరిపూర్ణ కార్యచరణతో పని చేయాలన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులకు ఆకర్షించడంలో అన్ని ప్రభుత్వ యంత్రాంగాలు ఒక స్థిర లక్ష్యంతో శ్రమించాలన్నారు. ప్రధాని సభ విజయవంతమైన నేపథ్యంలో కూటమి మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు, ముఖ్య నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇక అంతా మీ చేతుల్లోనే ఉందంటూ పురపాలక శాఖ మంత్రి నారాయణకు లక్ష్యాన్ని నిర్దేశించారు. నిర్దేశిత లక్ష్యం మేరకు పనులు పూర్తి చేస్తామని ఈ సందర్భంగా సిఎంకు నారాయణ తెలిపారు. రాజధాని పున:ప్రారంభానికి ప్రధాని మోడీ అంకురార్పణ చేయడంతో ఇక పనులపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఇప్పటికే రూ.49వేల కోట్ల విలువైన 74 పనులకు అధికారులు ఏజెన్సీలను ఖరారు చేసి, ఎల్‌ఓఏలను అందచేశామన్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టరులను త్వరగా ప్రారంభించేలా చూడటంతో పాటు సకాలంలో పూర్తి చేయించడంపై దృష్టి సారించారు.ఐకానిక్ టవర్లు,హైకోర్టు,అసెంబ్లీ భవనాల లోపలి భాగాల నిర్మాణంపై చర్చిం చారు. త్వరలో ఐఐటి నిపుణుల క్షేత్ర పరిశీలన చేస్తామని తెలిపారు.నమూనాల పరిశీలన,ఖరారుకు సీఆర్డీఏ, ఐఐటి మద్రాసు మధ్య ఒప్పందం ఉంది. భవనాల డిజైన్లను ఐఐటి నిపుణులు పరిశీలించి ఆమోద ముద్ర వేస్తారు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల నీటిలో నానిన ఐకానిక్ టవర్లు,హైకోర్టు పునాదుల పటిష్టతను ఐఐటీ నిపుణులు మరోసారి పరిశీలించనున్నారు. గతేడాది ఆగస్టులో నీరున్నప్పుడు ఒసారి పరిశీలించారు. నీరు తోడాక మరోసారి పరీక్షించాలని ఐఐటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి 2 నెలల క్రిందటే సిఆర్‌డిఎ లేఖ రాసింది. ఇప్పటికే హైకోర్టు నిర్మాణానికి టెండరు ఖరారైంది. ఐకానిక్ టవర్ల టెండర్లూ ఖరారైతే నిపుణులను అమరావతికి రప్పించాలన్న ఆలోచనలో సిఆర్‌డిఎ అధికారులు ఉన్నారు. నమూనాలు ఖరారైనందున,ఆ భవనాల్లో అధికారులు,సిబ్బంది ఛాంబర్లు ఎలా డిజైన్ చేయాలనే అంశంపై నమూనాలను పరిశీలించారు. హైకోర్టు భవనం టవర్ పైకి సందర్శకులు వెళ్తే అమరావతి నగరం మొత్తం కనిపించేలా డిజైన్‌లో స్వల్ప మార్పులు చేయాలని సూచించినట్లు మంత్రి సిఎం చంద్రబాబు నాయుడుకు వివరించారు. సచివాలయం,విభాగాధిపతుల కార్యాలయాల టవర్ల టెండర్ల గడువును 5వ తేదీ వరకు సిఆర్‌డిఎ అధికారులు పొడిగించిన విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకుని వచ్చారు. గత నెలలో 3 ప్యాకేజీల క్రింద రూ.4,689.82 కోట్ల అంచనాలతో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. ప్రస్తుతం మొదటి ప్యాకేజీ క్రింద రూ.1,126.51 కోట్లతో జిఎడి టవర్ నిర్మాణం, రెండో ప్యాకేజీలో రూ.1,897.86 కోట్లతో 1.2 టవర్లు కలిపి,మూడో ప్యాకేజీ కింద రూ.1,684.45 కోట్లతో 3.4 టవర్లు కలిపి నిర్మించనున్నారు. తొలుత ఈ నెల 1 వరకే బిడ్లుదాఖలు చేసేందుకు >>2



# పాక్‌కు భారత్ మరో ఝలక్

## బాగ్‌లిహార్ డ్యామ్ గేట్లు మూసివేత

### పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్స్‌కు నీరు లేనట్లే

**న్యూఢిల్లీ, మే 4:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌ను అన్ని వైపుల నుంచి భారత్ దిగ్బంధిస్తోంది. ఇప్పటికే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపేసిన కేంద్ర ప్రభుత్వం, తాజాగా బాగ్‌లిహార్ ఆనకట్ట నుంచి దాయాది దేశానికి నీటి సరఫరాను నిలిపివేసింది. పొరుగు దేశాన్ని ఎండగట్టే చర్యల్లో ఇది రెండోదిగా చెప్పాలి. ఓ క్షిపణిని పరీక్షించిన నేపథ్యంలో ఆ విషయం బయటకు వచ్చింది. నీటి ప్రవాహాన్ని ఆపేందుకు బాగ్‌లిహార్ డ్యామ్ స్లూయిస్ స్పిల్‌వేపై ఉన్న గేట్లను కిందకు >>2



# కడపలో మహానాడు

## 26, 27, 28 తేదీల్లో నిర్వహణ

### మహానాడు వేదిక ముస్తాబు షురూ

**కడప (పెండ్లిమర్రి) మే 4, ప్రభాత వార్త:** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడుకు వేదిక ఖరారు అయ్యింది. మొదటిసారిగా కడపలో ఈనెల 26, 27, 28 తేదీలలో తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మహానాడును కడప నగర శివారులోని పబ్బాపురంలోని ఉపాధ్యాయులకు సంబంధించిన స్థలంలో నిర్వహిస్తున్నారు. మహానాడు వేదిక ఖరారు కావడంతో ఆదివారం కమలాపురం ఎమ్మెల్యే పుత్త చైతన్య రెడ్డి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డితో పాటు >>2

# పిడుగుపాటుకు ఇద్దరు మృతి

**నాయుడుపేట, మే 4 ప్రభాతవార్త :** తిరుపతి జిల్లా నాయుడుపేట, ఓజిలి మండలాల్లో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. నాయుడుపేట మండలం వద్దిగుంట కండ్రిగలో అల్లం భాస్కర్(45), ఓజిలి మండలం గొల్లపాళెంలో కార్తీక్ (13)అనే బాలుడు పిడుగుపాటుకు మృతిచెందారు. బాలుడు కార్తీక్ పంటపొలాల్లో వ్యవసాయ పనులు చేస్తుండగా పిడుగుపాటుకు గురై అపస్మారకస్థితిలో పడిఉండటంతో పక్కనే ఉన్న స్థానికులు గుర్తించి 108సహాయంతో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి తల్లిదండ్రుల రోదన పలువురిని కంటతడి పెట్టిం చింది. ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం..

## ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట, మే 4, ప్రభాతవార్త :** నేడు ప్రపంచమంతా భారతీయ యోగాను అభ్యసిస్తూ, సాధనకు ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో యోగా ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహన విస్తరిస్తోందని, యోగసాధనతో అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చునని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని లయన్స్‌క్లబ్ సమావేశ మందిరంలో గాయత్రి మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జరిగిన అభినందన, సన్మాన సభకు రాజగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇటీవల



ఆదివారం విజయవాడ సమీపంలో బందరు రోడ్డులో చెట్టుకూలిన దృశ్యం

# రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

## దెబ్బతిన్న ఉద్యాన పంటలు

### వరి, మొక్కజొన్నకు తీరని నష్టం

### విజయవాడలో ఈదురుగాలులతో వర్షం

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం ఉదయం నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడుతోంది. ఈదురు గాలుల దాటికి చెట్లనుంచి మామిడికాయలు రాలిపోయాయి. దీంతో మామిడి రైతులు లబోదిబోమంటున్నారు. పలుచోట్ల రహదారుల వెంట వృక్షాలు నేలకొరిగాయి. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తిప్పలు పడుతున్నారు. వర్షం ప్రభావంతో లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించింది. విజయవాడ నగరంలో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. పలుచోట్ల రహదారులపై నీరు నిల్చింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. చాలా రోజులుగా వేసవి ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న విజయవాడ వాసులకు ఈ వర్షం కొంత ఉపశమనంకల్గించింది. విజయవాడలోని మొగల్రాజపురం, పటమట ప్రాంతాల్లో భారీ వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. చిట్టినగర్ పరిసర ప్రాంతాల్లో నీరు నిల్చింది.పండిట్ నెహ్రూ బస్టాండ్ సమీపం లోకి వర్షపు నీరు చేరింది. భారీ వర్షాల వల్ల ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డును మూసివేశారు. శ్రీ కనకదుర్గానగర గుండా భక్తులు రాకపోకలు కొనసాగించేలా ఏర్పాట్లు చేశారు. పెనమలూరు,గన్నవరం నియోజక వర్గాల్లోనూ భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు కొన్ని చోట్ల చెట్లు రోడ్లపై పడ్డాయి. ఉయ్యూరు-కాటూరు రోడ్డుపై చెట్లు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం కల్గింది. ఎన్టీఆర్,కృష్ణాజిల్లాలో భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. వరి, మొక్కజొన్న, అరటి పంటలకు తీవ్ర నష్టం కల్గింది.ఎన్టీఆర్ జిల్లాలో భారీ వర్షం పడుతోంది. చెట్లు, హోర్డింగ్‌లు నేలకొరిగాయి. రోడ్లపై మోకాళ్ల లోతులో నీరు నిలిచింది. స్వయంగా కలెక్టర్ లక్ష్మీశా రంగంలోకి దిగారు. మోటార్లు పెట్టి నీటిని తోడించే చర్యలను కలెక్టర్ చేపట్టారు. రోడ్లపై పడిన చెట్లను యుద్ధ ప్రాతిపదికన తొలగించేలా దగ్గరుండి కలెక్టర్ లక్ష్మీశా పర్యవేక్షించారు. ఈరోజు ఈదురు గాలులతో కూడిన వర్షం పడిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ తెలిపారు. ట్రాఫిక్‌కు అంత >>2



## టెలికమ్యూనికేషన్ బ్యూరో డైరెక్టర్‌గా రేవతి

### అంతర్జాతీయ పదవికి శ్రీకాళహస్తి మహిళ

**తొట్టంబేడు,మే 4 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన ఓ మహిళకు అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ బ్యూరో డైరెక్టర్‌గా భారత దేశం తరఫున నామినేట్ చేసారు.ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. ఆదివారం ఈ సమాచారం అందటంతో పలువురు ప్రముఖులు ఆమెను అభినందించారు. గతంలో రేవతి ఇండియా తరఫున ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్‌లో రేడియో రెగ్యులైజేషన్ బోర్డులో అడ్వకేటింగ్ సేవలో పని చేస్తున్నారు.ఆదినుంచి శ్రీకాళహస్తికి చెందిన మహిళలకు అరుదైన అవకాశం లభిస్తుంది.జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన మహిళల్లో >>2

# క్రియేటివ్ ల్యాండ్ ఆసియాతో 25 వేల ఉద్యోగాలు

## భారీ స్థాయిలో విదేశీ పెట్టుబడులు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశపు తొలి ట్రాన్స్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీ అయిన క్రియేటర్ ల్యాండ్‌ను ప్రజా రాజధాని అమరావతిలో ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఈ శుభపరిణామాన్ని ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందని 'ఎక్స్' వేదికగా ఆయన పేర్కొన్నారు. 25,000 ఉద్యోగాలను సృష్టించే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్ రూపొందిందని వివరించారు. విదేశీ పెట్టుబడుల్ని ఆకర్షించడానికి పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడానికి ఇది దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో స్థానికుల ప్రతిభను ప్రపంచానికి అందించే శక్తివంతమైన సాధనమిదని చెప్పారు. ఈ ప్రపంచస్థాయి సృజనాత్మక టౌన్‌షిప్ చలనచిత్రం, గేమింగ్, సంగీతం, వర్చువల్ ప్రొడక్షన్,కథల తయారీతో పాటు ఏఐ ఆధారిత కంటెంట్‌కు కేంద్రంగా ఉంటుందని వెల్లడించారు. అత్యాధునిక మౌలిక సదుపాయాలు,ప్రపంచ భాగస్వామ్యాలు మన యువతకు నైపుణ్యం కల్పించడానికి క్రియేటర్ ల్యాండ్ అకాడమీ వేదిక కానుందని తెలిపారు. సృజనాత్మక,డిజిటల్ పరిశ్రమలకు ప్రపంచ గమ్యస్థానంగా ఇది మారుతుందన్నారు. పరిపాలనా విధానాల్లో తాము తీసుకుని వస్తున్న మార్పులకు ప్రజలనుంచి అనుహ్య స్పందన లభిస్తోందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 'ఎక్స్' ఖాతాలోనే ఒకప్పుడు పాలనను ప్రజల వద్దకు తీసుకుని వెళ్లామని చంద్రబాబు అన్నారు..ఇప్పుడు ఏకంగా ప్రజల చేతుల్లోకే పరిపాలన వెళ్లిందన్నారు.పాలన సంస్కరణల్లో మనం తీసుకున్న ప్రతి రంగం విజయవంతమైందన్నారు. వాట్సప్ గవర్నెన్స్‌తో ప్రజలు ప్రభుత్వం నుంచి >>2



ప్రమాదంలో ధ్వంసమైన వాహనాలు

# ఒక్కచోటే మూడు ప్రమాదాలు

## ఐదుగురు మృతి

**ఒంగోలు, ప్రభాతవార్త :** ప్రకాశం జిల్లాలో దాదాపు ఒకే సమయంలో మూడు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. ఆదివారం తెల్లవారుజామున ఒంగోలు మండలం కొప్పోలు సమీపంలో కోడిగుడ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడి ముగ్గురు మృతి చెందారు. నెల్లూరు నగరానికి చెందిన లారీ డ్రైవర్ రమణయ్య(60), నెల్లూరు జిల్లా గుడిపల్లిపాడుకు చెందిన ఆర్.బాబు(45), అదే గ్రామానికి చెందిన నాగేంద్ర (25) అక్కడికక్కడే మృతి చెందారు. బోల్తా పడిన లారీని మరో లారీ ఢీకొనడంతో పలువురికి గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆ ట్రాఫిక్‌లో ఆగి ఉన్న కారును వెనుక నుంచి మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు లారీల మధ్య ఇన్నోవా కారు నుజ్జు నుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న టి.పావని(25), కౌషిక్(14) మృతి చెందారు. వీరు గుంటూరు జిల్లా కాకాణి నుంచి తిరుమలకు దైవదర్శనం కోసం వెళ్తున్నట్లుగా గుర్తించారు. ఈ కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు.

**సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్న ఎస్పీ:** ఒంగోలు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదస్థలాన్ని స్వయంగా పరిశీలించిన >>2

# ప్రపంచస్థాయి డిజైన్లతో 'అమరావతి'

## - మంత్రి నారాయణ



**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి నగరంలో నిర్మించే భవనాలు ప్రపంచ ప్రఖ్యాత డిజైన్లతో ఉండేరీతిలో చర్యలు తీసుకుంటున్నట్లు పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఆయన 'ఎక్స్' వేదికలో ఆ విషయంలో రాజీపడొద్దని రాజధానికి డిజైన్లు అందిస్తున్న నార్మన్ ఫోస్టర్స్, హాఫీజ్ కాంట్రాక్టర్, ఎల్అండ్‌టి సంస్థల ప్రతినిధులకు స్పష్టం చేసారు.వారితో కీలకంగా జరిపిన సమావేశంలో అసెంబ్లీ, సెక్రటేరియట్, ఇతర నిర్మాణాల్లో ఆధునికత ఉట్టిపడేలా ఉండాలని సూచించినట్లు వివరించారు. గ్రీన్ బిల్డింగ్ తరహాలో నిర్మిస్తున్న భవనాలకు తగిన విధంగా రూపకల్పన ఉండాలని సూచించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుది నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా డిజైన్లు సిద్ధం చేయాలన్నారు. దీనిపై ఆయా సంస్థల ప్రతినిధులు వారు >>2

# కుప్పం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి భూసేకరణ సర్వే

**కుప్పం, మే 4 ప్రభాతవార్త :** కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలం,శాంతిపురం మండలాల మధ్యలో ఎయిర్‌పోర్ట్ నిర్మించాలని సిఎం చంద్రబాబునాయుడు నిర్ణయించిన విషయం విదితమే. 2019లో సిఎం చంద్రబాబునాయుడు ఎయిర్‌పోర్టు నిర్మాణంకు శంకుస్థాపన చేసి 100 కోట్ల నిధులు కూడా మంజూరు చేశారు. అప్పట్లో దాదాపు 483 ఎకరాల మేర భూములను కార్గో ఎయిర్‌స్ట్రిప్ నిర్మాణం కోసం సేకరించి పలువురు రైతులకు భూపరిహారం సైతం అందించారు. అయితే అదే ఏడాది వైఎస్సార్సీ ప్రభుత్వం రావడంతో కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది జరిగిన ఎన్నికల్లో సిఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించి మరలా అధికారంలో వచ్చింది. దీంతో కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణ ఆశలు రెక్కలు తొడిగాయి. శాంతిపురం మండలం అమ్మవారిపేట, రామకుప్పం మండలం కిలాక్ పోడు, విజలాపురం ప్రాంతాల మధ్య >>2



ఆదివారం న్యూఢిల్లీలోని సుబ్రహ్మణ్యం ఆడిటోరియంలో కొత్తగా రూపొందించిన వరివంగడాలను ఆవిష్కరిస్తున్న కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

# మూడేళ్లలో 'అమరావతి'

>> గడువిచ్చామన్నారు. కాంట్రాక్టర్లు విజ్ఞప్తిపై మరో 4 రోజులు పొడిగించారు.ఈ సందర్భంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ అమరావతి ఒక నగరం కాదు,ఆధునాతన శక్తిగా మారుతుంది అంటూ అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రసంగం స్ఫూర్తి నింపిందని తెలిపారు.ప్రధాని ఇలా ఆనందం గర్వకారణమని చెప్పారు. ప్రజలందరి భాగస్వామ్యం, మూడు పార్టీల నాయకులు,కార్యకర్తల కృషితో సభ విజయవంతమైందని వెల్లడించారు. మంత్రులు,ఎంఎల్ఏలు సమన్వయంతో పనిచేశారని,ప్రభుత్వ యంత్రాంగం సమర్థంగా విధులు నిర్వర్తించిందంటూ సీఎం అభినందించారు. రాష్ట్ర వృద్ధిరేటుకు అమరావతి కేంద్రంగా ఉంటుందని ప్రధాని వ్యాఖ్యలు భవిష్యత్ రాజధాని ఆవిష్కరించాయని పేర్కొన్నారు. ప్రజా రాజధానికి ఆయన భరోసా ఇచ్చారని, దేశానికే అమరావతి మార్గదర్శిగా రూపొందుతుందన్నారు. ప్రజలందరి భాగస్వామ్యంతోనే సభ విజయవంతమైందని చెప్పారు. అమరావతి ఆవశ్యకతను వివరించేందుకే ప్రధాని చేతుల మీదుగా పనులు పునఃప్రారంభించామని వివరించారు. అమరావతి నగరం కాదు, ఒక శక్తిగా మారుతుందన్న ప్రధాని మాటలు స్ఫూర్తిని నింపాయని తెలిపారు. రాష్ట్ర వృద్ధి రేటుకు అమరావతి కేంద్రంగా ఉంటుందని ఆయన చేసిన వ్యాఖ్యలు భవిష్యత్ రాజధాని ఆవిష్కరించాయని చెప్పారు. మోదీ ప్రసంగం ప్రజల పట్ల ఉన్న అభిమానానికి, రాష్ట్రాభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలిచిందని తెలిపారు.మంత్రులు, నేతలకు అప్పగించిన పనులను బాధ్యతగా వ్యవహరించి బ్రహ్మాండంగా పని చేశారని అభినందించారు. లక్షల మంది ప్రజలు పోటెత్తినా ఎక్కడా ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. అన్ని ప్రాంతాల ప్రజల భాగస్వామ్యంతో ఉత్సాహంగా కార్యక్రమం జరిగిందన్నారు. సభ నిర్వహణకు సమస్త ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేసిందని వివరించారు. ఈ కార్యక్రమంపై అన్ని వర్గాల ప్రజల్లో సానుకూలత వ్యక్తమైందని మంత్రులు పార్థసారథి, సత్యకుమార్, నాదెండ్ల మనోహర్,తమ అభిప్రాయాలు చెప్పారు. మూడేళ్లలో నిర్మాణాలు పూర్తిచేసేలా ప్రణాళికల్లో వాలు కూడా జరపాలని చంద్రబాబు ఆదేశించారని అన్నారు. మూతపడే స్థితిలో ఉన్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు ఊపిరిపోసి రూ.11,400 కోట్లు కేంద్రం నిధులు కేటాయించేలా చేసుకున్నాం. ఉత్తరాంధ్ర వాసుల కల అయిన రైల్వేజోన్ సాధించాం.

మూతపడే స్థితిలో ఉన్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు ఊపిరిపోసి రూ.11,400 కోట్లు కేంద్రం నిధులు కేటాయించేలా చేసుకున్నాం. ఉత్తరాంధ్ర వాసుల కల అయిన రైల్వేజోన్ సాధించాం. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నాం. బీపీసీఎల్, ఆర్సెలార్ మిట్టల్, సీమలో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్స్, ఓర్వకల్లు, కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేసుకుంటున్నాం. లేపాక్షికొప్పర్తి కారిడార్ తీసుకొస్తాం. ఇటీవల 11 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు ప్రారంభించాం. త్వరలో అన్ని నియోజకవర్గాల్లో పార్కులు ఏర్పాటు చేస్తాం. కడపలో 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు మహానాడు..

**మిగిలిన నామినేటెడ్ పదవులు త్వరలోనే భర్తీ చేస్తామన్న సీఎం చంద్రబాబు..**

రాజధాని పనుల పునఃప్రారంభ కార్యక్రమం విజయవంతంలో కార్యకర్తల కృషి అభినందనీయమని ముఖ్యమంత్రి అన్నారు.ప్రభుత్వం ఏ మంచి కార్యక్రమం చేసినా వైఎస్సార్సీ చౌకబారు విమర్శలు చేస్తోంది..తిప్పికొట్టండని శ్రేణులకు సూచించారు.

# పాక్‌కు భారత్ మరో ఝలక్

>> దించేశారు. దీంతో పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు ఇక్కడ నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. ఇది స్వల్పకాల చర్యగా అక్కడి అధికారి ఒకరు వెల్లడించారు. దీంతో అవసరమైతే భారత్ కఠిన చర్యలు తీసుకోగలదని పాక్‌కు తెలియజేసినట్లైందని చెప్పారు. బాగ్ లిహార్ డ్యామ్‌ను 900 మెగావాట్ల జలవిద్యుత్తు ఉత్పత్తి నిమిత్తం చినాబ్ నదిపై 2008లో నిర్మించారు. డ్యామ్ పొడవు దాదాపు 145 మీటర్లు కాగా, సింధు జలాల ఒప్పందం కింద పాక్‌కు అత్యధిక వాటా నీళ్లు లభించిన నదుల్లో చినాబ్ కూడా ఒకటి. పంజాబ్ ప్రావిన్స్‌లో ఎక్కువగా పంటపొలాలు దీనిపై ఆధారపడి ఉన్నాయి. ఉగ్రదాడి జరిగిన తర్వాత ఏప్రిల్ 26న సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపేసింది. ఆ తర్వాత 29 నాటికే ఈ డ్యామ్ నుంచి పాకిస్థాన్‌కు వెళుతున్న జలాలు నిలిచిపోయినట్లు ఉపగ్రహ చిత్రాలు బయటకు వచ్చాయి. పాక్‌లోని సియాల్ కోట్ వద్దకు వచ్చేసరికి చినాబ్ పూర్తిగా ఎండిపోయింది. పాక్‌లోని పంజాబ్‌లో పత్తి, వరి సాగుకు ఈ నీరు చాలా ముఖ్యం. గత వారం జీలం నది వరద ప్రవాహం పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భయపెట్టింది. అక్కడి ముజఫరాబాద్ సమీపంలో గత వారం జీలం నదిలో నీటి మట్టం ఒక్కసారిగా కొన్ని అడుగులు పెరిగిపోయింది. దీంతో స్థానిక అధికారులు హట్టియాన్ బాలా అనే ప్రాంతంలో ఎమర్జెన్సీ ప్రకటించాల్సి వచ్చింది.

**ఎయిర్‌చీఫ్‌తో ప్రధానిమోడీ ఎమర్జెన్సీ మీట్**

పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న తరుణంలో ప్రధాని నరేంద్ర మోడీ సైనికాధికారులతో వరుస భేటీలు నిర్వహిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజాగా ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ తో ప్రధాని భేటీ అయ్యారు. ఢిల్లీలోని ప్రధాని నరేంద్రమోదీ నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఉగ్రదాడికి ప్రతిగా భారత సైన్యం తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే ముందురోజు భారత నౌకాదళాధిపతి, అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠీ కూడా ప్రధానితో సమావేశమయ్యారు. ప్రధాని నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ కూడా రెండుసార్లు సమావేశమైంది. తొలి భేటీలో భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు సింధూ జలాల పంపిణీని నిలిపివేయాలని, ఉగ్రదాడికి ప్రతిగా ధీటైన జవాబు చెప్పాలని నిర్ణయించారు. రెండో భేటీలో ఉగ్రవాదులపై చర్యలు తీసుకునేందుకు త్రివిధ దళాలకు పూర్తి స్వేచ్ఛను ఇస్తున్నట్లు ప్రకటించారు. దాడి చేయాల్సిన లక్ష్యాలు, దాడి సమయం త్రివిధ దళాలే నిర్ణయిస్తాయని తెలిపారు. గతవారం యుద్ధ సన్నద్ధతలో భాగంగా ఉత్తరప్రదేశ్‌లోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాయుసేన యుద్ధ విమానాల ల్యాండిగ్, టేకాఫ్ విన్యాసాలను నిర్వహించింది. 2019లో పుల్వామా దాడికి ప్రతీకారంగా భారత వాయుసేన పాకిస్థాన్‌లోకి ప్రవేశించి దాడి చేసింది. నాటితో పోల్చుకొంటే రఫేల్ యుద్ధ విమానాలు, ఎస్400 ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలతో ఐఏఎఫ్ శక్తి గణనీయంగా పెరిగింది.

# 25 వేల ఉద్యోగాలు

>> అవసరమైన సేవలు అందుకుంటున్నారన్నారు. గతంలో నేను ప్రజల వద్దకు పాలన ప్రవేశపెట్టాను. ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చి ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచం వేగంగా మారుతోంది. ఈ పోటీ ప్రపంచంలో నూతన ఆవిష్కరణలు జరుగుతూనే ఉండాలి. ప్రతి ఒక్కరూ హార్డ్ వర్క్ కాకుండా స్మార్ట్ వర్క్ చేయాలి. కేవలం 25 ఏళ్లలోనే అమెరికన్ల కంటే రెండింతలు ఆదాయం సంపాదించింది మన తెలుగువారే అయినందుకు నాకు గర్వంగా ఉంది. నేనూ, ప్రధాని మోడీ, మిత్రులు పవన్ కల్యాణ్ ఆలోచించేంది ఒకటే. మన రాష్ట్రం, దేశం బాగుండాలని. ప్రపంచంలో మనదేశం అగ్రస్థానంలో ఉంటే, దేశాన్ని నడిపించే శక్తి తెలుగుజాతికి ఇవ్వాలని ఆ భగవంతుణ్ని కోరకుంటున్నాను.గత ప్రభుత్వ పాలనతో రాష్ట్రం కళ తప్పిందన్నారుజ. గత ప్రభుత్వ పాలనలో ఆ ఐదేళ్లూ రాష్ట్రం కళ తప్పింది. అందరం కూర్చుని సంతోషంగా మాట్లాడుకునే పరిస్థితి లేదు. గడిచిన ప్రభుత్వం సృష్టించిన సమస్యలు నా సుధీర్ఘ రాజకీయ అనుభవంలో ఏనాడు చూడలేదు. అన్నీ చిక్కుముడులే. ఒక్కో చిక్కుముడిని విడదీస్తూ వ్యవస్థను సరిచేస్తున్నాం. ఈ ఏడాది రూ. 3.22 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టాం. ప్రజల ఆదాయం పెరగాలి. తద్వారా జీవన ప్రమాణాలు పెరిగి అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలి. మనం విశాలతతో ఆలోచించాలి. టెక్నాలజీని యువత అందిపుచ్చుకోవాలన్నారు. ఆనాడు నేను హైటెక్ సిటీ నిర్మించాను. ఐటీని ప్రమోట్ చేశాను. దీంతో వేలాది మంది ఐటీ నిపుణులు పుట్టుకొచ్చారు. వారంతా దేశ, విదేశాల్లో ఆర్థికంగా స్థిరపడ్డారు. వారి తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారు. అప్పుడు ఐటీ ప్రమోట్ చేశాను. ఇప్పుడు ఎఐ, క్వాంటమ్ వ్యాలీ గురించి మాట్లాడుతున్నాను. అలాగే ఆనాడు నేను సెల్ ఫోన్లను ప్రమోట్ చేస్తే దాన్ని కూడా కొందరు ఎగతాళి చేశారు. ఈరోజు సెల్ ఫోన్ లేకపోతే మనం ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. అయితే సెల్ ఫోన్‌ను సక్రమంగా వినియోగించుకుంటే జీవితంలో అనూహ్య మార్పులు వస్తాయి. వ్యసనంగా మారితే మాత్రం సమస్యలు వస్తాయి.పేదరిక లేని రాష్ట్రమే గమ్యం.అందుకే పీ4ను తీసుకుని వచ్చాను.ప్రపంచం మొత్తం అధ్యయనం చేసి పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సిఎం చంద్రబాబు తెలిపారు. ఇది డబ్బుతో పరిష్కారమయ్యేది కాదని మనస్సు పెట్టి పనిచేసి సమస్యను పరిష్కరించేదని చెప్పారు. సాయాజీరావు చేసిన సాయం అంబేద్కర్ ఎదుగుదలకు ఎలా ఉపయోగపడిందో మార్గదర్శిలు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

ఇలా కొందరు గొప్ప వ్యక్తులుగా ఎదగడానికి వెనుకుండి దోహదపడిన వారు ఉన్నారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ లేకుంటే తానూ సాధారణ వ్యక్తిగానే ఉండేవాడినని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన వద్ద నేర్చుకున్న క్రమశిక్షణ, పట్టుదలే తన ఎదుగుదలకు ఆదర్శమని వెల్లడించారు. పీ4 విధానం సరికొత్త చరిత్రకు శ్రీకారం అవుతుందన్నారు. రాష్ట్రాన్ని పేదరికం లేని ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకే ఉగాది నాడు ఈ విధానానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. గత ఐదు దశాబ్దాలుగా రాజకీయరంగంలో తనను ఆదరిస్తున్న తెలుగు ప్రజలకే ఈ జీవితం అంకితం తప్ప వేరే ఆలోచనలు లేవని సీఎం స్పష్టంచేశారు. జనసంపద కొందరికే పరిమితం కాకూడదు. ప్రతి ఒక్కరికీ మెరుగైన జీవన ప్రమాణాలు అందినప్పుడు సమసమాజ స్థాపన సాధ్యమవుతుంది.

ఈ 9 నెలల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా పీపుల్స్ ఫస్ట్ నినాదంతోనే పాలన సాగిస్తున్నాం. ఓవైపు సంక్షేమం, అభివృద్ధి అందిస్తూనే మరోవైపు రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్నాం. ఇప్పటి వరకూ అనుకున్న ఏ ప్రణాళిక విఫలం కాలేదు. అలాగే పీ4 కూడా విజయవంతమవుతుందనే నమ్మకం ఉంది. సమాజంలో ఉన్నతస్థాయిలో ఉన్న 10 శాతం మంది నిరుపేదలుగా ఉన్న 20 శాతం మందితో కలిసి పనిచేయడమే ఈ విధానం. ప్రజల్ని ఆస్తిగా తీసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత కావాలి. మట్టిలో మాణిక్యాల్ని అబ్దుల్ కలాంల్లా తయారు చేద్దాం. బంగారు కుటుంబాల జీవితాల్లో మార్పు తెచ్చే వరకూ నా ప్రయత్నాన్ని వదిలిపెట్టనుఅని చంద్రబాబు స్పష్టంచేశారు.

## రావిగుంటపల్లిలో పిడుగుపాటుకు వ్యక్తి మృతి

**రాపూరు (నెల్లూరు), మే 4, ప్రభాతవార్త :** రాపూరు మండలంలోని రావిగుంటపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై తాటిబోయిన చిన్నయ్య(51),మృతి చెందాడు. మృతుడు గ్రామానికి సమీపంలోని అడవులలో గొర్రెలు మోపుతుండగా ఒక్కసారిగా వచ్చిన ఈదురుగాలులు, ఉరుములు,మేరుపులతో కూడిన గాలికి పిడుగుపడటంతో పిడుగు పాటుకు గురైనాడు.సహచర గొర్రెల కాపరుల సమాచారంతో చిన్నయ్య కుటుంబ సభ్యులు, సహచరులు అక్కడికి వెళ్లి చూడగా చిన్నయ్య మృతి చెంది వున్నాడు. మృతునికి బార్య,కుమారుడు,కుమార్తె వున్నారు. నీరుపేద కుటుంబం అయిన మృతుని కటుంబాన్ని అదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కడపలో మహానాడు

>> పలువురు నాయకులు పరిసరాలను పరిశుభ్రం చేసే కార్యక్రమానికి పూజ చేశారు. సుమారు 10 జేసీబీలను, ప్రొక్లైన్లను ఏర్పాటు చేసి స్థలాన్ని చదును చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 9వ తేదీన భూమి పూజ కార్యక్రమాన్ని ప్రారంభించి పనులను మొదలు పెట్టనున్నారు. నాలుగు లైన్ల రింగురోడ్డు కావడంతో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు పేర్కొన్నారు. సుమారు నగరానికి పది కిలోమీటర్ల దూరంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు గానీ మరే ఇతర సమస్యలు తలెత్తకుండా ఉండేందుకే ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు.

## ప్రపంచస్థాయి డిజైన్లతో 'అమరావతి'

>> రూపొందించిన డిజైన్లకు సంబంధించిన పద్ధతి, అలా ఎందుకు ఏర్పాటు చేశామనే అంశాలను మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి మాట్లాడు తూ.. వీలైనంత త్వరగా వాటిని ఖరారు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గతంలో రాజధాని నిర్మాణానికి సంబంధించి మాకీ అసోసియేట్స్, నార్మన్ ఫోస్టర్స్, వాస్తుశిల్పి సంస్థలు ప్రణాళికలు రూపొందించాయి. వీటిల్లో తొలుత మాకీ అసోసియేట్స్ ప్లాను ఎంపిక చేశారు. అనంతరం వాటిని వద్దనుకున్నారు. తరువాత నార్మన్ ఫోస్టర్స్ రూపొందించిన ప్లానును ఆమోదించారు. ప్రస్తుతం అదే ప్లానును అమలు చేయాలని నిర్ణయించారు.రాజధాని .పునఃప్రారంభ పనులు మొదలైన నేపథ్యంలో ఆలస్యం చేయడానికి వీల్లేదని సూచించారు. అయితే ప్రస్తుతం ఉన్న ప్లాను నార్మన్ ఫోస్టర్స్ సంస్థ ఇచ్చిన నేపథ్యంలో వాటిని మెరుగుదల చేయడం, మరింత అధునాతనంగా రూపొందించే అంశంపై మంత్రి నారాయణ పలు సూచనలు చేశారు.

### వారం - వర్జ్యం

తేది : 05-05-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
అష్టమి ఉ.7.37
ఆశ్లేష మ.2.05
వర్జ్యం రా.3.00-తె.4.43
దు.మ.12.31-మ.1.22, 2) మ.3.04-3.55
రాహుకాలం - ఉ.7.30-9.00

### వార్తాఫలం

**మేషం:** ఉద్యోగాలు నిదానిస్తాయి. ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**వృషభం :** కొత్త ఋణ యత్నాలు చేస్తారు. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం:** ఉద్యోగాలలో పనిభారం పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**సింహం:** కొత్త వ్యక్తుల పరిచయాలు పెరుగుతాయి. పాతబాకీలు వసూలవుతాయి. వస్తువులు సేకరణ.

**కన్య :** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.ఉద్యోగాలలో హోదాలు పొందుతారు. ఇంటా బయటా అనుకూలం.

**తుల :** దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. ఆప్తుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృశ్చికం:** నూతన పరిచయాలు విస్తరిస్తాయి. జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు. వాహనయోగం.

**ధనుస్సు:** వ్యాపారాలలో లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో మరింత ఉత్సాహంగా సాగుతారు. వస్తులాభం.

**మకరం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**కుంభం:** ఋబాధలు ఎదురై చికాకులు పెడతాయి. పనులలో జాప్యం జరిగినా నిదానంగా సాగుతాయి.

**మీనం:** గృహనిర్మాణ ఆలోచనలు నిదానంగా కార్యరూపం దాలుస్తాయి. వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు

>> రాయం లేకుండా చర్యలు చేపట్టామని అన్నారు. కూలిన చెట్లను వెంటనే తొలగించామని చెప్పారు. రేపు, ఎల్లుండి కూడా ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడతాయని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెట్ల కింద నిల్చోవద్దని, వాహనాలు రక్షణగా ఉండే ప్రదేశాల్లో పార్కింగ్ చేయాలని చెప్పారు. వర్షాలు పడే సమయంలో తప్పని సరైతేనే ప్రజలు బయటకు రావాలని అప్రమత్తం చేశారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా కాల్ చేయాలని కలెక్టర్ లక్ష్మీశా సూచించారు.

ఇక అల్లూరి, అనకాపల్లి, శ్రీసత్యసాయి జిల్లాల్లో శనివారం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. వర్ష బీభత్సవానికి పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శ్రీసత్యసాయి జిల్లాలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో రెండు గంటలపాటు ఏకధాటిగా కుండపోత వర్షం పడింది. ఉరుములు, మెరుపులతో పలుచోట్ల పిడుగులు పడ్డాయి. అరకులోయ సహా పలు ప్రాంతాల్లో వానకు గాలి తోడైంది. రాజవొమ్మంగిలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎంపిడిఒ కార్యాలయం సమీపంలోని భారీ మామిడి చెట్టు పడి వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం దెబ్బతింది. కొయ్యూరు మండలం కొమ్మిక పంచాయతీ కొత్త బొర్రంపేటలో ఈదురుగాలులకు ఇంటి పైకప్పులు ఎగిరిపోయాయి. అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలంలో భారీ వర్షానికి పలు గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. నక్కపల్లిలో మోటమర్రి సత్రం వద్ద చెట్టు విరిగి షాపులపై పడింది. వైసిపి కార్యాలయంతోపాటు అక్కడ ఉన్న పలు దుకాణాలు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. రాజయ్యపేటలో విద్యుత్ స్తంభం, కొబ్బరి చెట్టు విరిగిపోయాయి. మాడుగుల మండలం ఘాట్‌రోడ్డు, పాడేరు వెళ్లే ప్రధాన రహదారిలో చెట్లు పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శ్రీ సత్యసాయి జిల్లాలో వర్షం కన్నా విపరీతమైన ఈదురు గాలుల వల్ల ఎక్కువ నష్టం జరిగింది. బుక్కపట్నం, నల్లమాడ, ధర్మవరం, కదిరి మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. 22 ఎకరాల్లో అరటి చెట్లు నేలకు ఒరిగినట్లు అధికారులు తెలిపారు. భీమవరంలో ఉదయం నుంచి కుండపోతగా వర్షం కురుస్తోంది. భారీ ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో వృక్షాలు నేలకూలాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పట్టణంలోని రహదారులు జలమయమయ్యాయి. ఉండి, భీమవరం, ఆకివీడు, కాళ్ల మండలాల్లో ఆరబెట్టిన ధాన్యం రాసులు వర్షానికి తడిసి ముద్దమడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏలూరు జిల్లా పోలవరం, జంగారెడ్డిగూడెం నియోజకవర్గాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపిలేని వర్షంతో జనజీవనం స్తంభించింది. రహదారులన్నీ జలమయమయ్యాయి. పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, జంగారెడ్డి టగూడెం మండలాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. వర్షాలతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ప్రజలు వేసవితాపం నుంచి ఉపశమనం పొందారు. కోనసీమజిల్లాలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అమలాపురం, అంబాజీపేట, అయినవల్లి, మామిడికుదురు, కొత్తపేట, పి.గన్నవరం మండలాల్లో జోరు వాన కురిసింది. వర్షం కురవడంపై కొబ్బరిరైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. అకాల వర్షానికి ధాన్యం తడవడంతో వరి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిప్రాంతాల్లో పొలాల్లో కోతకోసి ఆరబెట్టిన ధాన్యం తడవకుండా రైతులు పట్టలు కప్పుతున్నారు.



ఆదివారం ఎమ్మెల్యే బాలకృష్ణను సత్కరిస్తున్న అనిల్, నాగరాజు దంపతులు

# ఎమ్మెల్యే బాలకృష్ణకు సన్మానం

**హిందూపురం మే 4 ప్రభాతవార్త :** తెలుగు సినీ పరిశ్రమ దిగ్గజం, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకున్న శుభ సందర్భంగా ఏర్పాటు చేసిన పౌర సన్మాన సభ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఆదివారం స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో సాయంత్రం ఆహ్లాదకరమైన వాతావరణంలో భారీ ఎత్తున ఏర్పాటు చేసిన వేడుకలను వీక్షించేందుకు నియోజకవర్గం నుంచి కాకుండా జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది నందమూరి అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. సాయంత్రం 7:40 గంటలకు వేదిక వద్దకు బాలయ్య, వసుంధర దేవి దంపతులు రాగానే ప్రాంగణమంతా జై బాలయ్య నినాదాలతో హోరెత్తించింది. బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, శ్రీనివాస్ రావు, పిఏలు వీరయ్య, బాలాజీ లతోపాటు మున్సిపల్ చైర్మన్ రమేష్, మాజీ చైర్మన్ అనిల్ కుమార్, సీనియర్ నాయకులు గ్రీన్ పార్క్ నాగరాజు కార్యక్రమం నిర్వాహకులుగా సక్సెస్ అయ్యారు. ముఖ్య అతిథులుగా మంత్రి సవితమ్మ ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి, కందికుంట వెంకటప్రసాద్, ఎంపీ పార్థసారథి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు వడ్డే అంజనప్ప, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న మొదలగు నాయకులు హాజరయ్యారు. మంత్రి సవితమ్మ మాట్లాడుతూ హిందూపురం ప్రజల దాహార్తి తీర్చిన బాలయ్య దేవుడు అని పొగడ్తలతో ముంచెత్తారు. బాలకృష్ణ సినిమాల్లో పంచ్ డైలాగులను పల్లె రఘునాథ్ రెడ్డి వేదికపై చెప్పడంతో బాలయ్య అభిమానులు కేరింతలు కొట్టారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ తండ్రి ఎన్టీఆర్ మంచి స్ఫూర్తి పొంది సినీ, రాజకీయ రంగాల్లో ప్రజల ఆశీస్సులను పొందాలని అన్నారు. పద్మభూషణ్ అవార్డు తనకు రావడం తల్లితండ్రుల ఆశీర్వాదం అన్నారు. హిందూపురం అభివృద్ధికి తన వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని వివరించారు. తనపై అభిమానంతో నాయకులు ఇంత పెద్ద ఎత్తున పౌర సన్మాన సభ చేయడం పై అభినందనలు తెలియజేశారు. అనంతరం బాలయ్యను పెద్ద ఎత్తున పార్టీ నాయకులు కార్యకర్తలు సన్మానం చేశారు. హైదరాబాద్ శ్రేయ సంస్థ నేతృతంలో ఏర్పాటు చేసిన భారీ వేదికపై డాన్సర్లు బాలయ్య పాటలకు స్టెప్పులేసి అదరహో అనిపించారు. పలువురు సంగీత కళాకారులు అద్భుతమైన రీతిలో పాటలు ఆలపించి శభాష్ అనిపించుకున్నారు.

## టెలికమ్యూనికేషన్ బ్యూరో డైరెక్టర్‌గా రేవతి

>> మొదటి మహిళ శ్రీకాళహస్తికి చెందిన ఉపాధ్యాయురాలు కావటం విశేషం. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో రేవతికి గుర్తింపు రావటం శ్రీకాళహస్తికి గర్వకారణం అని పలువురు అభినందించారు. వివరాలు ఇలా ఉన్నాయి.తొట్టంబేడు మండలం చిన్నకనపర్తికి చెందిన కోడలు ఎం.రేవతి. భారత ప్రభుత్వం సారథ్యంలో రేడియో కమ్యూనికేషన్ శాఖలో అత్యున్నత స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. తన ప్రతిభా పాటవాలతో అంచెలంచెలుగా ఎదిగిన రేవతి రెండేళ్ల క్రితం ఇండియా తరపున ఇంటర్నేషనల్ రేడియో కమ్యూనికేషన్ సలహా కమిటి సభ్యురాలుగా ఎంపికయ్యారు. 136 దేశాలు మద్దతుతో రెండేళ్ల క్రితం ఎంపికైన రేవతి ప్రస్తుతం అరుదైన బ్యూరో డైరెక్టర్‌గా ఎంపికయ్యారు.

అంతర్జాతీయ స్థాయిలో మొట్టమొదటి సారిగా టెలికమ్యూనికేషన్ రంగంలో ఓ మహిళ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. ఈ గొప్పదనం భారత దేశానికి దక్కింది. అది కూడా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి చెందిన కోడలికి దక్కటం ముదావహం అని పలువురు ప్రశంసించారు.అత్యంత జనాభా కల్గిన ఆసియా,ఆఫ్రికా,ఆస్ట్రేలియా ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశం అందుకున్న మొట్టమొదటి మహిళ శ్రీకాళహస్తికి చెందిన వారు కావటం ఈ ప్రాంతంలోని ప్రతిభకు నిదర్శనంగా చెప్పవచ్చు. రేవతి టెలిస్పక్టమ్ సాటిలైట్ అర్బిటర్ మేనేజ్‌మెంట్ విభాగంలో సుమారు 30 సంవత్సరాలుగా విశేష సేవలందిస్తున్నారు.ఆమెకు శివయ్య ఆశీర్వదంతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావటం శివయ్య ప్రసాదంగా చెబుతున్నారు.

## రాహుల్ గాంధీని హిందూమతంనుంచి బహిష్కరిస్తున్నాం.. బద్రీనాథ్ స్వామీ అవిముక్తేశ్వరానందజీ సంచలనం

**డెహ్రాడూన్, మే 4:** కాంగ్రెస్ నాయకుడు రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీ శ్రీరాముడిపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈక్రమంలో జ్యోతిర్మఠానికి చెందిన శంకరాచార్య స్వామి అవిముక్తేశ్వరానంద సరస్వతి సంచలన ప్రకటనచేసారు. రాహుల్ గాంధీ ఇకపై హిందూ మతంలో భాగం కాదని అన్నారు. ఆతడిని హిందూ మతంనుంచి బహిష్కరిస్తామని ప్రకటించారు. బద్రీనాథ్‌లోని శంకరాచార్య ఆశ్రమంలో స్వామి అవిముక్తేశ్వరానంద మాట్లాడుతూ రాహుల్‌గాంధీ నిత్యం హిందువుల మనోభావాలు దెబ్బతీసేవిధంగా వ్యాఖలుచేస్తున్నారని, మనుస్మృతికి సంబంధించి రాహుల్‌గాంధీ పార్లమెంటులోచేసిన ప్రకటన సనాతన ధర్మ అనుచరులందరినీ బాధకు గురిచేసిందన్నారు.

# భూసేకరణ సర్వే

>> పూర్తిస్థాయిలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణంకు సిఎం చంద్రబాబు అంగీకరించారు. దీంతో గతంలో సేకరించిన ఎయిర్‌పోర్టు భూములకు అదనంగా మరో 600 ఎకరాల భూసేకరణ చేసి పూర్తిస్థాయి ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేపట్టడంతో పాటు ఇక్కడే విమానాల మరమ్మత్తుల కేంద్రం ఏర్పాటుకు సైతం ప్రభుత్వం తగు చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం ఓ పక్క రెవెన్యూ మరో పక్క ఆర్అండ్‌బి అధికారులు భూముల్ని గుర్తించి సర్వే పనుల్లో నిమగ్నమవుతున్నారు. సుమారు 1100-1200 ఎకరాల విస్తీర్ణంలో కుప్పం ఎయిర్‌పోర్టును నిర్మించనున్నారు. శనివారం రాష్ట్ర ఉన్నతాధికారి ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదిత స్థలాలను స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. ప్రతిపాదిత భూములను సమీప గ్రామాల ప్రజలు ఇబ్బంది పడకుండా భూసేకరణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారని తెలిసింది. భూసేకరణ సాధ్యాసాధ్యాలపై త్వరగా నివేదిక అందించాలని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. అవసరమైన రోడ్ల నిర్మాణంపై కూడా చర్చించినట్లు తెలిసింది. ఏది ఏమైనా సాధ్యమైనంత త్వరగా ఎయిర్‌పోర్ట్ నిర్మాణంకు అవసరమైన భూములు సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) అనుమతులు రాగానే కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణపనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# ఒక్కచోటే మూడు ప్రమాదాలు

>> ప్రకాశం జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ ప్రమాద కారణాలపై ఆరా, రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. వాహన చోదకులు వేగ పరిమితుల పట్ల జాగ్రత్త వహించి వాహనాలను నడపాలని, రహదారి భద్రత సూత్రాలను పాటిస్తూ సురక్షితంగా, క్షేమంగా గమ్యానికి చేరుకోవాలని ఎస్పీ కోరారు. ఎన్‌హెచ్-16 నేషనల్ హైవే కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి ఒంగోలు నుండి నెల్లూరు వైపు మార్గంలో ఆదివారం తెల్లవారుజామున మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మరణించడం అత్యంత బాధాకరంగా ఉందని ఎస్పీ తెలిపారు. ఈ ప్రమాదం చాలా దురదృష్టకరమని మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదం జరిగిన తీరు, కారణాలను పరిస్థితిని నిషితంగా సమీక్షించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడానికి సమగ్ర విచారణ జరుపుతామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ దామోదర్, ఒంగోలు ఉప రవాణా కమీషనర్ సుశీల అన్నారు. కొప్పోలు నేషనల్ హైవే మీద ఆగి ఉన్న లారీని వెనుక వస్తున్న కోడిగుడ్ల లారీ ఢీకొనడంతో లారీ తిరగబడిన ప్రమాదంలో ముగ్గురు మరణించారని, అదే మార్గంలో సుమారు 500 మీటర్ల సమీపంలో ఆగి ఉన్న కారు, ట్రాక్టర్‌ను అదే మార్గం వైపు నుండి వెళ్తున్న లారీ రెండింటిని ఢీకొనగా ఎటువంటి ప్రమాదం జరగలేదని, సుమారు 500 మీటర్ల సమపంలో అదే మార్గంలో ఆగి ఉన్న కారును, నెల్లూరు వైపు వెళ్తున్న కారును వెనుక ఉన్న లారీ బలంగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మరణించగా ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయని ఎస్పీ తెలిపారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్ సంఘమిత్ర ఆసుపత్రికి పంపించడం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రెండు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్‌ను ప్రొక్లైన్‌ల సహాయంతో త్వరితగతిన చర్యలు చేపట్టి ట్రాఫిక్ క్లియర్ చేశారని ఎస్పీ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కే.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, గిద్దలూరు సీఐ సురేష్, నేషనల్ హైవే అధికారులు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

05-5Pg3exHMNWJQEKCVTSPGB.qxd:05-5Pg3exHMNWJQEKCVTSPGB.qxd 05/05/25 12:53 AM Page 1





# డిప్యూటీ స్పీకర్‌పై చర్యలు తీసుకోండి

## సీఎం చంద్రబాబుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు బహిరంగ లేఖ

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం బహిరంగలేఖ రాశారు. కె.రఘురామకృష్ణంరాజు ఆదేశాలు, ప్రోద్బలంతో పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్ళను, చిన్నదుకాణాలను బుల్డోజర్లతో తొలగించటం. పాలకోడేరు అల్లూరి సీతారామరాజు నగర్ పేదలపై, మహిళలపై మగపోలీసుల బలప్రయోగాన్ని ప్రదర్శించటంపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం పాలకోడేరు, ఆకివీడు, ఉండి, కాళ్ల మండలాలు కలిగి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణంరాజు ప్రోద్బలంతో ప్రారంభంలో ఆకివీడు మండలంలో 355, పాలకోడేరు మండలంలో 165, కాళ్ల మండలంలో 100 మొత్తం 700 పైగా పేద ఇళ్లను, ఉండిలో చిన్న దుకాణాలను అక్రమంగా కూల్చారు. నియోజకవర్గంలో ఇంకా పెద్దసంఖ్యలో కూల్చడానికి పేద ప్రజలకు నోటీసులు కూడా ఇచ్చియున్నారు. మే 15లోగా ఆ ఇళ్లు కూల్చేస్తామని బహిరంగంగా ప్రకటించారు. ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన ఇళ్లను సైతం కూల్చే స్థాయికి చాలా అన్యాయం అమానుషం. అందరికీ ఇళ్లు ఇస్తామని చెబుతున్న ప్రభుత్వ నిర్ణయానికి, స్ఫూర్తికి ఇది పూర్తి విరుద్ధం.

# చికిత్స పొందుతూ మహిళ మృతి

**నెల్లూరు క్రైమ్, మే 4, ప్రభాతవార్త:** స్థానిక బుజబుజ నెల్లూరులో విజయ్ అనే దుండగుడు కత్తితో దాడి చేసిన ఘటనలో మహిళ చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. వివరాల్లోకి వెళితే బుజబుజ నెల్లూరుకు చెందిన మాబున్నీసా తన పిల్లలతో కలిసి వెళుతున్న సందర్భంలో అదే ప్రాంతానికి చెందిన విజయ్ అనే వ్యక్తి కత్తితో దాడికి దిగాడు. ఈ క్రమంలో తీవ్ర గాయాల పాలైన మాబున్నీసాను స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న వేదయపాలెం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# చిత్తూరులో భారీ వర్షం

## ఎండ నుండి ప్రజలకు ఉపశమనం

**చిత్తూరు రూరల్, మే 4 ప్రభాతవార్త:** చిత్తూరు, దాని పరిసర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం 3 గంటల నుండి భారీ వర్షం కురిసింది. గత నెల రోజులుగా తీవ్ర ఎండలతో ఉక్కిరి బిక్కిరి అయిన ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కల్పించింది. మార్చి నెల మధ్య నుండి జిల్లాలో భారీ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఎండలు తీవ్రంగా వుండటంతో గత నెల రోజుల నుండి ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు రోడ్లపై కన్పించడం లేదు. ఈ పరిస్థితుల్లో ఆదివారం ఒక్కసారిగా ఒక ఒక గంట పాటు ఓ స్థాయిలో వర్షం కురవడంతో ప్రజలకు ఎండల నుండి భారీ ఉపశమనం కల్గించినట్లైంది. ఈ వర్ష సమయంలో చిత్తూరు, దాని పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఈదురు గాలులు వీచాయి. చిత్తూరు కొంగారెడ్డిపల్లి గాండ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ వర్షానికి పెద్ద చెట్టు నేల కూలింది. చిత్తూరు నగర పరిధిలోని కొన్ని ప్రధాన రోడ్లలో చిన్న చెట్లు నేల కూలడంతో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం ఏర్పడింది. చిత్తూరు పరిసర ప్రాంతాలైన యాద మరి, బంగారుపాళ్యం, గుడిపాల,



కొంగారెడ్డిపల్లి గాండ్లపల్లి పాఠశాల వద్ద కూలిన చెట్టు

తవణంపల్లి మండలాల్లో సైతం ఓ మోస్తరు వర్షం కురవడంతో అక్కడి ప్రజలు ఎండల నుండి ఉపశమనం పొందారు. చిత్తూరు పరిసర ప్రాంతాల్లో సైతం పెద్ద ఎత్తున గాలులు వీయడంతో మామిడి పంటకు తీరని నష్టం వాటిల్లింది. ఇప్పటికే పంట సరిగా లేదని బాధపడుతున్న రైతులకు ప్రస్తుత ఆకాల వర్షంతో మరింత నష్టం కలుగనుంది.

# అభివృద్ధిని అటకెక్కించిన గత ప్రభుత్వం: మంత్రి నారాయణ

**నెల్లూరు, మే 4, ప్రభాతవార్త-వైద్యం:** వ్యక్తులపై అక్రమ కేసులు బనాయించడంపై పెట్టిన శ్రద్ధతో పదోవంతు దృష్టి కూడా విద్యాలయాలపై వైసీపీ ప్రభుత్వం పెట్టలేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. ఐదేళ్ల పాటు సాగిన జగన్ సర్కార్ అస్తవ్యస్థ పాలనతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో మూతపడ్డ వీఆర్ హైస్కూల్‌ని ఆధునీకరించి నిరుపేద విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామన్నారు. ఆదివారం సాయంత్రం మంత్రి నారాయణ వీఆర్‌సీ పాఠశాల పునర్నిర్మాణ పనులను కమీషనర్ నందన్‌తో కలిసి పరిశీలించారు. అన్ని తరగతి గదులను పరిశీలించి తగు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ విద్యార్థుల ఆట పాటలకు అనుకూలంగా గ్రౌండ్‌లో ఉన్నటువంటి పాత శిథిలమైన భవనాలను తొలగించి మైదానాన్ని నిర్మిచాలని ఆదేశించామన్నారు. నెల్లూరు నగర బొడ్డులో మూడు షిప్టుల్లో 8 వేలకు పైగా విద్యార్థులు



ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

చదువుకున్న ప్రతిష్టాత్మక కాలేజీని గత ప్రభుత్వ నిర్వాహకులు నిర్వీర్యం చేశాంన్నారు.

గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి నగరంలోని పేదలు, నిరుపేదలకు ఉన్నత స్థాయి విద్యను అందిస్తామన్నారు. ఎన్‌ఎంసీ కంపెనీ ఆధ్వర్యంలో పునర్నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. అన్ని పనులు అనుకున్న విధంగా పూర్తి చేసి వచ్చే విద్యాసంవత్సరం పాఠశాలలు ప్రారంభించే నాటికి పూర్తి స్థాయిలో సిద్ధం చేస్తామన్నారు. మొదటి సంవత్సరంలో వేయి మంది పేదలకు అడ్మిషన్స్ కల్పిస్తామని, ఉచిత బస్సు, భోజన వసతితో పాటు సాయంకాలం ఆటపాటల అనంతరం స్నాక్స్ అందించి వారి ఇళ్ల వద్ద దించుతామన్నారు. ఆ విధంగా వచ్చే విద్యాసంవత్సరం పేదల అడ్మిషన్లు రెండు వేలకు పెంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, నగర టీడీపీ అధ్యక్షులు మామిడాల మధు, స్థానిక కార్పొరేటర్లు, టీడీపీ నేతలు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# అమ్మవారి అండదండలతో రాష్ట్రాభివృద్ధి: మంత్రి ఆనం



**వరికుంటపాడు (నెల్లూరు), మే 4, ప్రభాతవార్త:** మండలంలోని తిరుపతిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అంకాళమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి,నెల్లూరు పార్లమెంటుసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్,కనిగిరి శాసనసభ్యుడు ఉగ్ర నరసింహారెడ్డి,ఎంఎల్‌సీలు బీదా రవిచంద్ర,కంభం శ్రీకాంత్‌లు అమ్మవారి సన్నిధికి చేరుకొని గ్రామ దేవత అంకాళమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు.గ్రామ పెద్దలు,పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అదే గ్రామంలో విపిఆర్ అమృతధారలో భాగంగ విపిఆర్ ఫౌండేషన్ ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంటును మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి,ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,ఎంఎల్‌ఏలు కాకర్ల సురేష్,ఉగ్ర నరసింహారెడ్డి,ఎంఎల్‌సీలు బీదా రవిచంద్ర, కంభం శ్రీకాంత్‌లు ప్రారంభించారు. అనంతరం మహిళలకు బిందెలతో నీటినిఅందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఏ కంభం విజయరామిరెడ్డి,మాజీ ఎంఎల్‌ఏ కొమ్మి లక్ష్మీనాయుడు,మండలపార్టీ కన్వీనర్ చండ్ర మధుసూదనరావు,మాజీ జట్పీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, నాయకులు ముజ్జె లక్ష్మీనారాయణ,నాదెండ్ల రాజేంద్ర, పోలుబోయిన శ్రీకాంత్‌యాదవ్, ఎంఎల్‌ఏ పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, కాకర్ల వెంకట్,జట్‌పిటిసి రావెళ్ళ నాగేంద్ర,వివిద గ్రామాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

## వాల్ పోస్టర్స్ విడుదల చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** నరేంద్రమోదీ అధికారంలోకి వస్తే ప్రతి ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తానని బీజేపీ ఎన్నికల ముసాయిదాలో ప్రకటించి మోసగించారని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు అన్నారు. ఈ సందర్భంగా పరుచూరి రాజేంద్ర బాబు, మాట్లాడుతూ యువతను అన్ని రకాలుగా మోసం చేస్తున్న పాలకులపై ఉద్యమించడానికి ఈ మహాసభలు వేదిక కానున్నాయని వారు తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభల వాల్ పోస్టర్స్‌ను రైతు పేట చంద్ర రాజేశ్వర రావు భవన్ నందు విడుదల చేసారు,మోదీ మూడో సారి అధికారంలోకి వచ్చినా ఇప్పటికి ఆ హామీ అమలు కాలేదని, తాను చెప్పిన ఏటా 2 కోట్ల ప్రకారం ఇప్పటికి 12సంవత్సరాల కాలంలో 24కోట్ల ఉద్యోగాలు భర్తీ కావాలని,



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు తదితరులు

మోడీ మాటలన్నీ నీటి మూటలేనని వారు ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో మోడీ ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని బలవంతంగా దేశంలో మత ఉన్మాదం అనే కాషాయ విష బీజాలను విద్యార్థులు, యువత మెదలల్లో చొప్పించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడని ధ్వజమెత్తారు. దేశంలో ఎన్నికల సంస్కరణలు జరగాలని, సామాజిక న్యాయం కొరకు ఉద్యమించాలని, భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి, అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐయస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు ఉప్పుటూరి అరుణ్ కుమార్, ఎఐవైఎఫ్ నాయకులు ఎం. ఈస్వరాచారి, విష్ణు, మనోజ్ లు పాల్గొన్నారు.

# భారీ వర్షంతో ఘాట్‌రోడ్డు మూసివేత

**ఇంద్రకీలాద్రి, మే 4, ప్రభాతవార్త:** దుర్గమ్మవారి ఆలయానికి చేరుకునే భక్తుల భద్రతా దృష్ట్యా ఘాట్‌రోడ్డును ఆదివారం మూసివేశారు. ఈ సందర్భంగా భక్తులను కనకదుర్గానగర్ నుండి రాకపోకలు సాగే చర్యలను ఇఓ కె రామచంద్ర మోహన్ తీసుకున్నారు.

**దుర్గమ్మ భక్తుల భద్రతలో లోటుపాట్లు లేవు: స్పష్టం చేసిన ఇఓ:** దుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారిని దర్శించుకునే భక్తులు, మహిళా సెక్యూరిటీ సిబ్బంది భద్రతకు ఎటువంటి లోటు పాట్లు లేవని ఇఓ కె రామచంద్రమోహన్ స్పష్టం చేశారు. దేవస్థానంలో విధి నిర్వహణలో వున్న మహిళా సెక్యూరిటీగార్డు ఉదంతంలో భాగంగా పోలీస్‌స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చామన్నారు. ఈ సంఘటనపైప్రాథమిక విచారణ చేశామన్నారు.

**దుర్గమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ:** దుర్గమ్మ దర్శనానికి ఆదివారం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఆలయంలో జరిగే నిత్యపూజలు, శాంతి కళ్యాణం,



చండీహోమం, లక్షకుంకుమార్చన తదితర ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు త్వరితంగా దర్శనమయ్యేలా ఇఓ చర్యలు తీసుకున్నారు.

**జగన్మాతకు నృత్యకళార్చన:** సనాతన ధర్మప్రచారం, లలిత కళలకు ప్రోత్సాహం అందించేందుకు సకల కళలకు ఆరాధ్యదేవత ఆదిపరాశక్తి, జగన్మాత శ్రీ కనకదుర్గమ్మవారి సన్నిధిలో ఆదివారం నూతన రాజగోపుర ప్రాంగణంలో కూచిపూడి నృత్య ప్రదర్శనతో నృత్య కళార్చన నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన నృత్యగురువు మునిపల్లి మహతి ఆధ్వర్యంలో విద్యార్థులు 19 మంది లయబద్ధంగా నృత్య ప్రదర్శన చేసి భక్తుల మన్ననలందుకున్నారు. వారికి శ్రీ దుర్గమ్మ వారి దర్శనం ఏర్పాట్లు చేసి, ప్రసాదం, మెమొంటోలు అందించారు. వేదాశీర్వచనాలందించారు.

# ఆఫీసులో అసాంఘిక కార్యకలాపాలు

## టూరిజం ఉద్యోగి తీరుపై విమర్శలు

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలోని ఓ ప్రభుత్వ కార్యాలయాన్ని తన అవాంఛనీయ వ్యక్తిగత అవసరాల కేంద్రంగా ఒక ఉద్యోగి మార్చుకున్నాడు. పనివేళలు పూర్తయ్యాక ఆఫీసుకు తాళం వేసి అందరూ ఇంటికి వెళ్లిపోయిన తర్వాత సదరు ఉద్యోగి తిరిగి ఆఫీసుకు వచ్చాడు. వస్తూ ఓ యువతిని తీసుకుని వచ్చేవాడు. బహుశా అతను పనిమీద ఆఫీస్ వచ్చేవాడనుకునే వారు వాచ్‌మెన్‌లు, అయితే ఈ విషయాన్ని నిత్యకృత్యం చేసాడతను.తన వెంట వచ్చేమహిళతో కలిసి అదేపనిగా రావడం వారికి అనుమానం కలిగించింది.ప్రతి రోజు ఇద్దరూ లోపలికి వెళ్లి కొద్ది సమయం తర్వాత తిరిగి బయటకు వచ్చారు. ఆపై ఆఫీసుకు తాళం వేసి వెళ్లిపోయాడు. ఈ ఘటన విజయవాడ టూరిజం డివిజనల్ ఆఫీసులో చోటు చేసుకుంది. ఈ విషయం తీవ్ర అనుమానాలకు దారితీసింది. టూరిజం డివిజనల్ ఆఫీసులో కీలక ఉద్యోగి కావడంతో తనను అడిగే వారు లేరనే ధైర్యమో లేక మరేమిటో కానీ మహిళతో దర్జాగా తన ఇంట్లోకి వెళ్లినట్లు ఆఫీసు తాళం తెరిచి లోపలికి వెళ్లడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారం సదరు డిపార్టుమెంట్‌లో కలకలం రేపింది. కార్యాలయం ప్రవేశ ద్వారంలో, లోపలా అమర్చిన సీసీటీవీ కెమెరాల్లో సదరు ఉద్యోగి నిర్వాకం రికార్డైంది. దీనిపై విచారణకు ఆదేశించామని, నివేదిక అందగానే సదరు ఉద్యోగిపై చర్యలు తీసు కుంటామని ఉన్నతాధికారులు వివరించారు. అయితే సదరు ఉద్యోగి చేసిన పని ఇప్పుడు ఆ శాఖలో కలకలం రేపింది.సదరు ఉద్యోగి ఒక్కరేనా ఇంకా ఎవరైనా ఇలా చేస్తున్నారా అనేసందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

# మల్లన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

**శ్రీశైలంప్రాజెక్టు,మే4,ప్రభాతవార్త:** అష్టదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం మహాపుణ్య క్షేత్రం ఆదివారంనాడు భక్తులతో క్యూలైన్లన్ని రద్దిని తలపించాయి.భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీశైలంకు తరలివచ్చారు.ఈక్రమంలోనే శ్రీశైలం రహదారులన్ని వాహనాలతో కిక్కిరిసి పోయాయి.అదే విధంగా శ్రీశైలంకు చేరుకున్న భక్తులు ఎంతో భక్తిశ్రద్దలతో ముందుగా తమ మ్రొక్కులను తీర్చుకునేందుకు పాతళగంగలో పుణ్యస్నానాలు అచరించి తలనీలాలు సమర్పిస్తూ తదుపరి శ్రీస్వామిఅమ్మవార్ల దర్శనం కోరకు క్యూలైన్ల వద్దకు చేరుకుంటున్నారు. మల్లన్న దర్శన బాగ్యం కొరకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థానం కార్య నిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు ఏర్పాట్లపై అధికారులను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకున్నారు.



# తిరుమల సమాచారం

# ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.1.50 కోట్ల విరాళం

**తిరుమల, మే 4, ప్రభాతవార్త ప్రతినిధి:** బెంగుళూరుకు చెందిన సుయుగ్ వెంచర్స్ ఎల్‌ఎల్పీ సంస్థ చైర్మన్ యతీష్ సూరినేని ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు ఆదివారం రూ.1.50 కోట్లు విరాళంగా అందించారు. తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం చైర్మన్ బీ.ఆర్. నాయుడుకు విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాతను చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఓ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ పాల్గొన్నారు.



# తిరుమలలో విశ్రాంతి భవనాలకు భగవంతుడి పేర్లు

**తిరుమల, మే 4, ప్రభాతవార్త ప్రతినిధి:** పరమ పవిత్రమైన తిరుమల పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ మరింత ఉట్టిపడేలా, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తీసుకుంటున్న నిర్ణయాలు ఒక్కొక్కటిగా కార్యరూపం దాల్చితున్నాయి. అందులో భాగంగా తిరుమలలోని పలు గెస్ట్ హౌస్‌లకు దాతలు తమ స్వంత పేర్లు పెట్టుకొని ఉండటాన్ని చైర్మన్ తీవ్రంగా వ్యతిరేకించారు. తిరుమలలో ఎద్దైనా సరే భగవంతుని నామంతో ఉండాలని, గోవిందా నామ స్మరణ మాత్రమే వినబడాలని, దాతల నిర్మించిన టీటీడీకి ఇచ్చిన విశ్రాంతి భవనాల్లో 42 వాటికి దాతల సొంత పేర్లు ఉన్నాయి. వెంటనే వాటిని మార్చాలని గత డిసెంబర్ నెల 24వ తేదీ జరిగిన పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. భగవంతుడికి సంభందించి 75 పేర్లను సూచించి, వాటిలో ఎద్దైనా ఒకటి గెస్ట్ హౌస్‌కు పేరుగా పెట్టుకోవాలని బోర్డు అదేశించింది. ఈ మేరకు 42 గెస్ట్ హౌస్‌లకు పేర్లు మారాయి. జిఎంఆర్ విశ్రాంతి భవనానికి ఆనంద నికేతనం, మాగుంటనిలయంకు, రాఘవ నిలయం, మైహోమ్ పద్మాప్రియకు పద్మాప్రియ నిలయం, సుధాకృష్ణ నిలయంకు, వైకుంఠ నిలయం, శ్రీరచన కు విధాత నిలయం, పాండవ విశ్రాంతి భవనంకు విరజా నిలయంగా పేర్లు మార్పుచేసారు దాతలు. ఇకపై నిర్మాణాలు జరిగే ఏ కార్యాలయమైనా, విశ్రాంతి భవనమైనా, భగవంతుడి నామాలతోఉండాలని చైర్మన్ అధికారులకు సూచించారు.

# యోగాలో జాతీయ స్థాయి అవార్డు సాధనే లక్ష్యం

## తిరుమల ఆలయం ముందు కాకినాడ చిన్నారి యోగాసనాలు



**తిరుమల, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ స్థాయిలో అవార్డు సాధించాలనేది తన లక్ష్యమని కాకినాడకు చెందిన రేఖాడు చైత్ర వాసుకి పేర్కొంది. ఆదివారం తిరుమలలో శ్రీవారి దర్శనం అనంతరం ఆమె ఆలయం ముందర యోగాసనాలు వేసి ఆకట్టుకుంది. ఈసం దర్భంగా వాసుకి మాట్లాడుతూ తాను జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాణించాలని అందుకు స్వామివారి ఆశీస్సులు కోరినట్లు తెలిపింది. ఇదివరకే తాను 300కుపైగా యోగాసనాల్లో శిక్షణ పొందానని, ఎన్నో యోగా కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు చెప్పింది. తమ పాఠ శాల ఉపాధ్యాయుడు యోగాలో తనకు ఆదర్శమని తెలి పింది. తన తల్లిద ండ్రుల ప్రోత్సాహం యోగాలో మరిం త ముందుకు సాగే దిశగా తీసుకెళ్లిందని పేర్కొంది.

# తిరుపతిలో గాలివాన బీభత్సం

## నేలకూలిన వృక్షాలు.. విరిగిన విద్యుత్ స్థంభాలు

## రెండుకార్లు.. నాలుగు టు వీలర్లు ధ్వంసం, భారీ నష్టం

**తిరుపతి, మే 4 ప్రభాతవార్త ప్రతినిధి:** మండే ఎండలకు ఉపశమనంగా ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా గాలివాన భీభత్సం సృష్టించింది. ఎండలనుంచి వరుణదేవుడు కరుణించాడని జనం సంబర పడేలోపు తిరుపతి నగరంలో చాలాచోట్ల గాలిధాటికి భారీ చెట్లు నేలకూలాయి. వాటికి అనుబంధంగా ఉన్న విద్యుత్ స్థ ంభాలు విరగడం, నేలవాలడంతో విద్యుత్ వేర్లు తెగి కిందకుపడ్డాయి. దీంతో ఒక్కసారిగా నగరంలోని అనేక కాలనీలు చీకటిమయంగా మారాయి. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో మొదలైన బలమైన వానకు గాలి తోడైంది. దీంతో గంట సమయం కురిసిన వానకు, ఈదురుగాలుల ధాటికి భారీగానే నష్టం వాటిల్లింది. ప్రధాన ప్రాంతం పెద్ద కాపు లేఔట్, గంగమ్మగుడి, డిఆర్ మహల్, కర్నాల వీధి, దొడ్డాపురం వీధి, టాటా నగర్ తదితర ప్రాంతాల్లో చెట్లు కూలాయి. దీంతో ఆయా చోట్ల కార్లు, స్కూటర్లు భారీగా ధ్వంసమయ్యాయి. వెంటనే విద్యుత్ అధికారులు సరఫరా నిలిపేశారు. మధ్యాహ్నం 1గంటనుంచి రాత్రి 11గంటల దాకా చెట్లు తొలగించడం, విద్యుత్ స్థంభాలు నుంచి లైన్లు పునరుద్ధరణ కాలేదు. అర్ధరాత్రి దాకా తిరుపతి నగరంలో అనేక ప్రాంతాలు, కాలనీలు చీకట్లో అలమటించాయి. భారీగా కూలిన చెట్లను తొలగించేందుకు నగర పాలక సంస్థ కమీషనర్ మౌర్య, హెల్త్ అధికారి, విద్యుత్ అధికారులు దాదాపు తొమ్మిది గంటలకు పైగా శ్రమించారు. ఆదివారం కావడంతో జనం ఇళ్లలోనే ఉండడంతో ప్రాణనష్టం జరగలేదు. ప్రజలకు ఇబ్బంది కలిగిన ప్రాంతాల్లో ఎపి యాదవ సంక్షేమం మరియు అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ తదితరులు పర్యటించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యుత్ పునరుద్ధరణ, చెట్లు



తొలగించే కార్యక్రమాల్ని దగ్గరుండి పర్యవేక్షించారు. కర్నాల వీధి రైల్వే గేటు పక్కన ఓ మహావృక్షం నేల కూలడంతో అక్కడి కార్పొరేటర్ నరసింహాచారి పర్యవేక్షణలో తొలగించారు. 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్‌కె బాబు డిఆర్ మహల్ వద్ద పడ్డ చెట్లను తొలగించే కార్యక్రమాలు చేపట్టారు.తాతయ్య గుంట గంగమ్మ ఆలయం రోడ్డులో ఆటో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. అలాగే ఒకారు, ఓఆటో, ఓ జీపు, రెండు బైకులు, రెండు దుకాణాలు దెబ్బతిన్నాయి. యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ మాట్లాడుతూ ప్రజలంతాగ ంగజాతర వస్తున్న సందర్భంగా తిరుపతిలో వర్షాలు పడడం సహజంగా జరుగుతుందన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినపుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్ ఈతమాకుల హేమంత్‌కుమార్, నాగప్రతాప్, దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుధాకర్ బాబు, సుబ్రమణ్యం, శరవణ, రామారావు పాల్గొన్నారు.

# ఎపి సినీ ప్రొడక్షన్స్ ఎగ్జిక్యూటివ్స్ మేనేజర్ యూనియన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

**విజయవాడ, మే 4, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాంయస్ ఫెడరేషన్‌కు అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ సినీ ప్రొడక్షన్స్ ఎగ్జిక్యూటివ్స్ మేనేజర్ యూనియన్‌కు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం విజయవాడలో జరిగింది.



యూనియన్ అధ్యక్షుడుగా బండ్రెడ్డి శశికుమార్, ఉపాధ్యక్షులుగా మోటె పల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కొడదల శివప్రసాద్‌రెడ్డి, కోశాధికారి ఉబా ప్రసాద్, కార్యదర్శి బండారు నారాయణరాజు, కార్యనిర్వహక కార్యదర్శిగా అందవరపు ఏడుకొండలు, ఎగ్యికూటివ్ కమిటీ సభ్యులుగా పూజారి భాస్కర్ రాజు, దాసరి రాజు బాలకృష్ణ, అలంక రవికుమార్, మిర్తిపాటి నరేష్, షేక్ మెహబూబ్‌భాషా, బొచ్చు హేమంత్ కిషోర్ తదితరులు ప్రమాణ స్వీకారం చేయగా పలువురు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా నీట్ ఎగ్జామ్స్

**విజయవాడ,మే4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో నీట్ ఎగ్జామ్స్ ఆదివారం ప్రశాంతంగా జరిగాయి,ఈ రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహించారు. భారీ వానలు కారణంగా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.అయినప్పటికి సకాలంలో చేరుకున్నారు.ఈ ఎగ్జామ్ పెన్‌అండ్‌పేపర్ విధానంలో నిర్వహించారు. ఈ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌కు భారీగానే అభ్య ర్థులు హాజరు అయ్యారు. ఎగ్జామ్ సెంటర్‌కు మధ్యాహ్నం 01:30 గంటల కంటే ముందుగానే చేరుకోవాలని ఎన్టీఏ సూచించింది. ఆల స్యంగా వచ్చే అభ్యర్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేసింది. విద్యార్థులు ఇది సీరియస్‌గా తీసుకోవాలని సూచించింది. నీట్ యుజీ పరీక్ష నిబంధనలు ఉల్లంఘిస్తే, వారిపై 3సంవత్సరాల పాటు నిషేధం విధిస్తామని విద్యా మంత్రిత్వ శాఖ తెలిపింది,ఈ క్రమంలో నీట్ పరీక్షలకు ఒక్కటి,రెండు చోట్ల తప్పించి అభ్యర్దులు సకాలంలోనే పరీక్షలకు హాజరయ్యారు.

పంజాబ్ నేషనల్ బ్యాంకు ...విశ్వాసానికి మరో పేరు! | punjab national bank ...the name you can BANK upon!
(భారత ప్రభుత్వరంగ సంస్థ)
సాధారణ పరిపాలన విభాగం-జోనల్ ఆఫీస్: 6-1-73, 2వ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డీ-కా-పూల్, హైదరాబాద్-500004. ఈ-మెయిల్: zohydgad@pnb.co.in ఫోన్: (040)-24475113/18
ఎంపానెల్‌మెంట్ నోటీసు
పంజాబ్ నేషనల్ బ్యాంక్, హైదరాబాద్ జోనల్ ఆఫీస్, "వివిధ కేటగిరీల పనుల కోసం ఆర్కిటెక్ట్‌లు/ఆర్కిటెక్చరల్ సంస్థలను ఎంప్యానెలింగ్ చేయడానికి దరఖాస్తులను" ఆహ్వానిస్తుంది.
అర్హత, నిబంధనలు & షరతులు మరియు దరఖాస్తు ఫారమ్‌ల వివరాలు బ్యాంక్ వెబ్‌సైట్ https://www.pnbindia.in/Tender.aspxలో అందుబాటులో ఉన్నాయి, వీటిని 05.05.2025న 10:00 గంటల నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
మద్దతునిచ్చే అన్ని పత్రాలతో నిర్ణీత నమూనాలో పూర్తి చేసిన పత్రాలను "చీఫ్ మేనేజర్, GAD, పంజాబ్ నేషనల్ బ్యాంక్, జోనల్ ఆఫీస్: హైదరాబాద్, 6-1-73, రెండవ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డీ-కా-పూల్ - 500 004"కి 04.06.2025 నాటికి సాయంత్రం 5.00 గంటల లోగా పంపవలెను.
బ్యాంకు ప్రస్తుత ప్యానెల్‌లోని అన్ని ఆర్కిటెక్ట్స్ /ఆర్కిటెక్చరల్ సంస్థలన్నీ ఈ జాబితా ప్రక్రియలో పరిశీలించబడుటకు తాజాగా దాఖలు చేసుకోనవలసి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న ప్యానెళ్లు నూతన ప్యానెళ్లు ఆమోదం పొందిన తరువాత రద్దు అవుతాయి.
పైన పేర్కొన్న పనికి సంబంధించి ఏదైనా సవరణ/స్పష్టీకరణ పైన పేర్కొన్న బ్యాంక్ వెబ్‌సైట్‌లో మాత్రమే విడుదల చేయబడతాయి, కావున బ్యాంకు వెబ్ సైట్ ను తరచుగా సందర్శించగలరు.
చీఫ్ మేనేజర్

వార్త

సోమరిగా, బలహీనంగా నూరేళ్ళు బతకడం కన్నా దృఢసంకల్పంతో కొద్ది కాలమైనా జీవించడం ఉత్తమం.

-అరిస్టాటిల్

# మనిషి ద్రోహమే!


విశ్వవ్యాప్తంగా మానవ తప్పిదాల వల్లనే విపత్తులు ఒకదానివెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ,ఆస్తినష్టాలకు కారణమవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనూహ్యమైన మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారితీస్తున్నాయి. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది, నిందించాల్సింది మానవుడినే. మానవుడి పర్యావరణ విధ్వంస చర్యలే ఈ బీభత్సానికి, విపత్తులకు కారణమవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుడి మనుగడే భవిష్యత్‌లో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు ప్రేమికులు దశాబ్దాల తరబడి పదేపదే చెబుతూ ఆందోళన వ్యక్తంచేస్తున్నా పట్టించుకునే నాధుడే లేకుండాపోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడంఅటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు చేస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలుపెడితే కొండలు తొలచి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలు, నగరీకరణ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంటపొలాలను జనావాసాలు మార్చడం ఒకటేమిటి ఎన్ని రకాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్నిమార్గాల్లో నిత్యం అన్వేషణ కొనసాగుతూనే ఉన్నది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత జనాభా నూటయాభై కోట్లకు చేరుకోవడానికి ఇంకెంతో సమయం పట్టదు. కానీ అందుకు తగినట్లుగా దేశంలోని సహజవనరులపై పెరగనున్న ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలనే విషయంలో పటిష్టమైన ప్రణాళికలు లేకపోవడం దురదృష్టకరం. ప్రధానంగా అటవీ సంపద ఊహించని విధంగా హరించుకుపోతున్నది. భారతదేశంలో రోజుకు మూడువందల ఎకరాలకుపైగా అటవీ భూమి అదృశ్యమైపోతుందని ఐక్యరాజ్యసమితి గతంలో వెల్లడించింది. బొగ్గుగనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు ప్రాజెక్టుల కోసం యధేచ్ఛగా అడవులను నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించలేకపోతున్నారు. ఇందువల్ల పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంతా ఇంతా కాదు. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవి కాగితాలకే పరిమితమైపోతున్నది. ఇక పెట్రోల్, డీజిల్ లాంటి ఇంధనాల్ వాడకం గూర్చి చెప్పక్కర్లేదు. వాహన కాలుష్య నియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది. పెరుగుతున్న వాహనాల సంఖ్యకు రెట్టింపు స్థాయిలో వాహన కాలుష్యంతోపాటు పరిశ్రమలు వదులుతున్న పొగ, ధుమ్ముధూళి, అన్ని కలిపి వాయు కాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఇలాంటి రకరకాల కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఉష్ణోగ్రత పెరిగి ప్రపంచంలోని తీరప్రాంతాలు దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఏనాడో పర్యావరణ శాస్త్రవేత్తలుహెచ్చరించారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతిగా ప్రకృతి తీవ్రంగానే స్పందిస్తున్నది. పర్యావరణం సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం, కురిస్తే ఒకేసారి ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం ఇటీవల కాలంలో పెరిగిపోతున్నది. ముఖ్యంగా భారతదేశంలో ఈ అకాల వర్షాలు వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో గత ఎనిమిది వారాలుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఈదురుగాలులు, వడగండ్ల వానలు, రైతులను అతలాకుతలం చేస్తున్నాయి. చేతికి అందాల్సిన పంటలు నీటిపాలైపోతున్నాయి.పండ్ల తోటల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఒక్క తెలుగు రాష్ట్రాలకే ఈ అకాల వర్షాలు పరిమితం కాలేదు. దేశమంతా విస్తరిస్తూనే ఉన్నాయి. వీటితోపాటు వరదలు, తుఫాన్‌లు భూకంపాలు లాంటి ఉపద్రవాలు పర్యావరణానికి హాని కలిగించిన కారణంగా జనారణ్యాలపై దాడులు చేస్తున్నాయి. ఏటా సగటున దాదాపు మూడువందల ఎనభైకి పైగా ప్రపంచవ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులు వెల్లడిస్తున్నాయి. లక్షలాది మంది ఈ ఉపద్రవాలతో ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో రోగపీడితులు అవుతున్నారు. ఇక ఆస్తుల నష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. అయితే పాలకులు తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యల కారణంగా ప్రాణ,ఆస్తుల నష్టం కొంత వరకు నియంత్రించలేకపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదించినా ఆధునికంగా ఎంత పురోభివృద్ధివైపు పయనించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుండి మానవుడు బయటపడలేకపోతున్నాడు. ఆర్థికంగా, సాంకేతికపరంగా ఎన్నో రంగాల్లో సాటిలేని అభివృద్ధి సాధించామని విర్రవీగే చైనీయులు ప్రకృతి ముందు తల వంచక తప్పలేదు. మొన్న ఆ మధ్య చైనాలోని సెంట్రల్ వానన్ ప్రావెన్సీలో ఒక్కరోజే ఏకంగా 457.5 మిల్లీమీటర్ల కుంభవృష్టి కురిసింది. ఎల్లో నది ఉగ్రరూపం దాల్చి ముంచెత్తింది. ప్రజాజీవనం అస్తవ్యస్తమైంది. ఒక్క చైనాయేకాదు ప్రపంచంలోని అనేకదేశాలు ఈ పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. భారత్‌లో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉన్నది. చిన్నచితక వానలకే దేశంలోని అనేక నగరాల పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతున్నది. ముంబయి నగరానికి ప్రతి వర్షాకాలంలో వరద ముంపు తప్పడం లేదు. ఉత్తరాఖండ్ పరిస్థితి అంచనాలకే అందదు. ఏదిఏమైనా ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి. ప్రధానంగా ప్రజల్లో అవగాహన కల్పించాలి. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా భారీ మూల్యం చెల్లించక తప్పదు.

నిస్వార్థత ఎంత అధికంగా ఉంటుందో, విజయం అంత అధికంగా లభిస్తుంది.



బెర్నార్డ్ షా

మిక్కిలి ధనంగానీ, గొప్ప విద్య కానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.



ప్లినీ

# దేశ భద్రతే 'ప్రయార్టీ ఐటమ్'

**అమెరికా, రష్యా, బ్రిటన్‌లు కూడా కంటితుడుపు చర్యగానే ఆ రిజల్యూషన్‌ను భావించారు. ఫ్రాన్స్ కోఆర్డినేట్ చేయాల్సిన పరిస్థితులలో సెక్యూరిటీ కౌన్సిల్ మెంబర్లందర్నీ ఏకతాటిపై నడిపించి మతపరమైన చర్యగా పహల్గాం ఘటనను భావించి, ఉగ్రవాదులు న్యాయానికి పట్టుబడే విధంగా చర్యలు తీసుకున్నట్లయితే యు.యన్.ఎస్.సి ప్రకటన సముచితంగా ఉండేది. ఉక్రెయిన్ హమాస్ సంఘర్షణలప్పుడు యు.యన్ జనరల్ బాడీసమావేశమై ఏవిధంగా స్పందించిందో ఆ విధంగానే పహల్గాంలో ఉగ్రవాద దాడిని ఖండించే విధంగా స్పందింప చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలి. భారత్ ఆ విషయంలో తగు చర్యలు తీసుకొని ఉగ్రవాదానికి, వెనుకుండి నడిపిస్తున్న పాకిస్థాన్‌కు గ్లోబల్ ఖండనను తెలియచేసినప్పుడే వెనుకడుగు వేస్తుంది. భారత్ రక్షణ జాగ్రత్తల బాధ్యతను ప్రయారిటీ ఐటమ్‌గా పెట్టుకోక తప్పదు.**



రావులపాటి సీతారాంరావు

ప్రపంచంలోని అన్ని దేశాలూ అభివృద్ధి సాధనలో అహర్నిశలూ కృషి చేస్తూనే ఉన్నాయి.కానీ దేశాల భద్రత దృష్ట్యా అపరిమితంగా సైన్యాల పెంపుదల కోసం, ఆయుధాల ఉత్పత్తి, దిగుమతుల కోసం, మరీ ముఖ్యంగా అణ్వాయుధాల నిమిత్తం విపరీతంగా ఖర్చు చేస్తున్న మాట వాస్తవం. దేశ సంపదలో అభివృద్ధి కోసం కొంత భాగం వినియోగపడుతుంటే, మిలటరీ దళాల కోసం ఖర్చు ఎక్కువగా ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న విషయాన్ని ఎవరూ కాదనలేని పరిస్థితి. నిజం మాట్లాడుతే ఈ పరిస్థితిని చాలా దేశాలు ఎదుర్కోక తప్పటం లేదు. అలాంటి గత్యంతరం లేని పరిస్థితినే ఇండియా ఎదుర్కోవాల్సి వస్తున్నది. పహల్గాం ఘటన ఈ సందర్భంగా ప్రస్తావించక తప్పదు. జమ్మూ,కాశ్మీరు ప్రాంతం ఈ మధ్యనే పెద్దగా అలజడులు లేకుండా ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా పయనిస్తున్న తరుణంలో ఈ సంఘటన కాశ్మీర్ టూరిజం మీద ఎదుర్కోలేని దెబ్బకొట్టింది. కాశ్మీర్ ఆర్థిక సంపద ఎక్కువ భాగం పర్యాటక వ్యవస్థ మీదనే ఆధారపడి ఉన్నది. అక్కడి ప్రకృతి సౌందర్యంతోపాటు సహజమైన ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించటానికీ, అనుభవించడానికి ఎంతో మంది యాత్రికులు ప్రపంచం నలుమూలల నుంచీ వస్తుంటారు. ఈ మధ్య వారి రాపిడి విపరీతంగా పెరిగింది. ఆర్థిక సంపద కాశ్మీర్‌లో కొత్త పంథాలో నడుస్తున్న సమయంలో ఈ దురదృష్టకర మారణకాండ కోలుకోలేనంతగా కాశ్మీర్ వ్యవస్థను దెబ్బతీసింది. దీనివల్ల ఒక్క కాశ్మీరే కాదు దేశంలోని ఆర్థిక వనరులు, రక్షణ భద్రత నిమిత్తం ఖర్చుపెట్టాల్సిన అగత్యం ఏర్పడింది. ఎన్ని మాటలు ప్రభుత్వాలు చెప్పినా, మిలటరీ సాయుధ సంపత్తి సమకూర్చలేకపోతే దేశానికి అన్ని వేళలా భద్రత కల్పించడం కష్టం. అభద్రత లోపాలులేకుండా ఉన్నప్పుడే సమగ్ర రక్షణ దేశానికి ఏర్పడుతుంది. ఒకసారి ప్రపంచంలోని ముఖ్య దేశాలు మిలటరీ వ్యవస్థ కోసం పెట్టిన ఖర్చును పరిశీలిస్తే సామాన్యులు ఆశ్చర్యానికి లోనుకాక తప్పదు. ఈ మధ్యనే స్వీడిష్ థింక్ ట్యాంక్ పేరిట మిలటరీ కోసం చేస్తున్న ఖర్చువిషయంలో చేసిన స్టడీ వెలుగులోకి వచ్చింది. 2024 సంవత్సరం బేస్‌గా పెట్టుకొని ఆ స్టడీ కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు బయటపెట్టింది. 2024లో భారతదేశం తొమ్మిదిరెట్లు పాకిస్థాన్ కంటే ఎక్కువగా మిలటరీ నిమిత్తం ఖర్చుపెట్టింది. పహల్గాం తరువాత అంటే 2025సంవత్సరం నుంచి సైనిక దళాలూ, ఆయుధ సంపత్తి కోసం మరింతగా ఖర్చుపెట్టక తప్పదు. మనదేశం ఈ ఖర్చు విషయంలో అయిదవ స్థానంలో ఉంది. 86.1 బిలియన్ డాలర్ల నుంచి 1.6 శాతం పెరిగింది. పాకిస్థాన్ 10.2 బిలియన్లు పెట్టిందని స్టాక్ హోం ఇంటర్ నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సిప్రి) కూడా తెల్పింది. యు.యస్.ఏ, చైనా, రష్యా, జర్మనీ, ఇండియా ఎక్కువగా రక్షణ నిమిత్తం ఖర్చుపెట్టే ప్రథమ ఐదుస్థానాల్లో వరుసగా ఉన్నాయి. మొత్తం గ్లోబల్ టోటల్‌లో ఈ అయిదు దేశాలు పెట్టే ఖర్చు కలుపుతే దాదాపు 60శాతం ఉంటుంది. ఈ అయిదు దేశాలు కలిసి 1.035 బిలియన్ డాలర్లు ఖర్చు పెట్టున్నాయి. చైనా దేశం తన భద్రత ఖర్చును ఏడు శాతం ఎక్కువ చేసింది. ఆసియా దేశాలతో పోలుస్తే చైనా చేసే ఖర్చు 50 శాతం ఉంటుంది. రష్యా కూడా ఖర్చు బాగానే ఎక్కువగా పెట్టున్నది. ఉక్రెయిన్ యుద్ధం వల్ల రష్యా మిలటరీ ఖర్చు దాదాపు 149 బిలియన్ డాలర్లకు 2024 చేరుకుంది. ఇది 8శాతం 2023 సంవత్సరం ఖర్చు కంటే ఎక్కువ. ఉక్రెయిన్ మొత్తం ఖర్చు (మిలటరీ కోసం) 2.9 శాతం పెరిగి 64.7 బిలియన్ల డాలర్లకు చేరుకుంది. ఈ ఖర్చుల విషయం ప్రస్తావించడానికి కారణం ఒక్కటే. యుద్ధమేఘాలు దేశాల మధ్య కమ్ముకున్నప్పుడు ఏ దేశమూ భద్రత విషయంలో ఖర్చుపెట్టడానికి వెనుకాడదు. అభివృద్ధి తప్పక కుంటుపడ్తుంది. అది వేరే విషయం. కానీ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడవల్సిన బాధ్యత పదవిలో ఉన్న ప్రభుత్వానిదే! ఇవ్వాల పాకిస్థాన్ అస్తవ్యస్తంగా ఉండటానికి కారణం ఆర్థిక పురోభివృద్ధిని సాధించడానికి ప్రణాళికలను ఏర్పరుచుకొని తగు చర్యలు తీసుకోలేకపోవటమే. కేవలం మతపరమైన భావజాలంతో మిలటరీపరంగా బలాన్ని పెంచుకొని దాయాది ఇండియాను అన్నివిధాల దెబ్బతీయాలనే దురాలోచనే పాకిస్థాన్‌ను బలహీనపర్చింది. ఆర్థికాభివృద్ధి ప్రక్కన పెట్టి ఆర్మీ సహాయాంతో ఇండియాను జయించాలనుకుంటే కుదరదు. ప్రజాస్వామ్య పద్ధతులకు తిలోదకాలు ఇచ్చి చైనాతో జట్టుకట్టి ఇండియా మీద పైచేయి సాధించాలనుకోవటం పాకిస్థాన్ చేసిన పెద్ద తప్పిదం. అందుకే ప్రస్తుత స్థితిని అనుభవించక తప్పటంలేదు. భారతదేశం మొదటి నుంచీ ఏ దేశం జోలికి పోలేదు. తగాదాలు పెట్టుకొని ప్రపంచ నాయకత్వాన్ని పొందాలని ఎన్నడూ ఆశించలేదు. అభివృద్ధి సాధించడంలో ఇతర దేశాలతో పోటీపడిన మాట వాస్తవం. అభివృద్ధి వరకే పోటీని పరిమితం చేయడం వల్ల ప్రపంచ దేశాల్లో గౌరవ ప్రధానమైన స్థానాన్ని పొందగలిగింది. చైనాతో కానీ, పాకిస్థాన్‌తో కానీ కావాలని ఇండియా ఎన్నడూ యుద్ధాలు తెచ్చుకోలేదు. ఆ రెండు దేశాలు తమ బలాలను నిరూపించుకోవడానికి సరిహద్దును తారుమారు చేసి పైచేయి సాధించాలని ప్రయత్నించినప్పుడు దీటుగా జవాబివ్వటమే కాదు. తిరుగులేని రీతిలో దాడులను త్రిప్పికొట్టింది.



భద్రతకు సంబంధించినంత వరకు మిలటరీ పరంగా అన్ని అవసరాలను క్రమపద్ధతిలో తీర్చింది. ఆధునిక ఆయుధాలను, యుద్ధవిమానాలను అణ్వాయుధాలను సమకూర్చుకొని శాంతి సూత్రాన్ని పక్కనపెట్టలేదు. ఇండియా తన మీద దాడి చేసినప్పుడు మాత్రమే దేశ రోక్షణ కోసం తగువిధంగా జవాబిచ్చింది. మంచి ఊపులో దేశ ఆర్థిక పురోభివృద్ధి ఉన్నప్పుడు పాకిస్థాన్ పహల్గాం ఘటన ఆధారంగా ఆర్థికంగా బలహీనపర్చేందుకు వేసిన ఎత్తుగడ. యుద్ధం కొనసాగిస్తే పాకిస్థాన్‌కు మంచిది. ఇండియాకు కాదు. అగ్రదేశాలు భారతదేశంతో శత్రుత్వం కావాలని ఎన్నడూ తెచ్చుకోలేదు. కానీ భారతదేశం అగ్రదేశాల సరసన అణుశక్తిగా ఎదగటం ఒక విధంగా ఆ దేశాలకు ఇష్టం లేదు. అందుకే పాకిస్థాన్ వెనుకవుండి ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదాన్ని నిర్దాక్షణ్యంగా ఖండించి నిర్మూలించే పనికి అమెరికా,రష్యా లాంటి దేశాలు పూనుకున్నట్లయితే అఫ్ఘానిస్థాన్, బెలూచిస్థాన్, అంతెందుకు బంగ్లాదేశ్ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలు అసలు తలెత్తకనేపోయేవి. అమెరికా తన తప్పిదాన్ని ట్విన్‌టవర్ నిర్మూలనతో తెలుసుకోగలిగింది. వియత్నాం విషయంలో ఇతర చిన్నచిన్న దేశాలలో అవసరమున్నా, లేకపోయినా అమెరికా తలదూర్చిన తర్వాత తనే విచారించింది. అయినా తగురీతిలో యు.యస్ స్పందన ఇప్పుడు లేదన్నది వాస్తవం. ట్రంప్ సమాధానాలు ఎవరికీ అర్థంకాని పరిస్థితిలో చైనా, రష్యాలు ఎలాంటి విధానాలు అమలు చేస్తాయో ఎవరూ ఊహించలేకపోతున్నారు. ఉగ్రవాదాన్ని అన్ని దేశాలూ కలిసి కట్టుగా సమిసిపోయేట్లు చేస్తేనే ప్రపంచంలో శాంతికి విఘాతం ఉండదు.యునైటెడ్ సెక్యూరిటీ కౌన్సిల్ పహల్గాం విషయంలో కొన్ని రోజుల క్రిందట ఆమోదించిన ప్రకటన ఉండాల్సిన విధంగా ఉండకపోవడం వల్ల గ్లోబల్ సమస్యలు, ఉగ్రవాదం వల్ల మరింతగా పెరిగే అవకాశాన్ని అనవసరంగా కల్పించినట్లయింది. పాకిస్థాన్ సభ్యత్వం ఎన్.సిలో నాన్ పర్మినెంట్ మెంబరుగా (2025-2026) ఉండటం వల్ల లభించింది. చైనా పర్మినెంట్ మెంబర్ అవటం వల్ల ఆ రిజల్యూషన్‌ను పటిష్ట రీతిలో ఉగ్రవాదాన్ని నిర్మూలించే విధంగా తయారు చేయనివ్వలేదు. అమెరికా, రష్యా, బ్రిటన్‌లు కూడా కంటితుడుపు చర్యగానే ఆ రిజల్యూషన్‌ను భావించారు. ఫ్రాన్స్ కో ఆర్డినేట్ చేయాల్సిన పరిస్థితులలో సెక్యూరిటీ కౌన్సిల్ మెంబర్లందర్నీ ఏకతాటిపై నడిపించి మతపరమైన చర్యగా పహల్గాం ఘటనను భావించి, ఉగ్రవాదులు న్యాయానికి పట్టుబడే విధంగా చర్యలు తీసుకున్నట్లయితే యు.యన్.ఎస్.సి ప్రకటన సముచితంగా ఉండేది. ఉక్రెయిన్ హమాస్ సంఘర్షణలప్పుడు యు.యన్ జనరల్ బాడీ సమావేశమై ఏ విధంగా స్పందించిందో ఆ విధంగానే పహల్గాంలో ఉగ్రవాద దాడిని ఖండించే విధంగా స్పందింప చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలి. భారత్ ఆ విషయంలో తగుచర్యలు తీసుకొని ఉగ్రవాదానికి,వెనుకుండి నడిపిస్తున్న పాకిస్థాన్‌కు గ్లోబల్ ఖండనను తెలియచేసినప్పుడే వెనుకడుగు వేస్తుంది. భారత్ రక్షణ జాగ్రత్తల బాధ్యతను ప్రయారిటీ ఐటమ్‌గా పెట్టుకోక తప్పదు. •

# అమరావతి ప్రగతి సంకేతం

తరిగోపుల నారాయణస్వామి

ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి, పాలనా సామర్థ్యానికి, భవిష్యత్ అభివృద్ధికి ఒక సమగ్ర రాజధాని అవసరమైంది. ఈ నేపథ్యంలో 2015లో అమరావతిని రాజధానిగా ప్రకటించడం జరిగింది. ఈ ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ఆశలు అమరావతిపై స్థిరపడ్డాయి. కృష్ణా నదీ తీరంలో, అభివృద్ధికి అనువైన ప్రదేశంగా భావించబడిన అమరావతి, భౌగోళికంగా మధ్యలో ఉండటం, తక్కువగా అభివృద్ధి చెందిన ప్రాంతం కావడం దీన్ని మరింత ప్రత్యేకంగా చేశాయి. అమరావతిని నిర్మించేందుకు 33,000 ఎకరాల భూమిని రైతులు స్వచ్ఛందంగా సమర్పించారు. ఇది దేశంలోనే విశేషమైన ప్రజా భాగస్వామ్య ఉదాహరణగా నిలిచింది. రైతులు తమ భూములను ఇవ్వడమే కాక, భవిష్యత్తులో అక్కడ అభివృద్ధి జరగాలని ఆశతో ఎంతో నమ్మకంతో వ్యవహరించారు. వారి త్యాగం భారత ప్రజాస్వామ్యంలో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. అయితే 2019లో రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానులు ప్రకటించడంతో, అమరావతికి తీవ్ర అన్యాయం జరిగింది. ఇది రైతుల నమ్మకాన్ని, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసింది. అప్పటి నుండి వేలాది మంది రైతులు నిరవధికంగా ఆందోళనలో పాల్గొంటూ, రాజధాని హక్కు కోసం పోరాటం కొనసాగించారు. ఇదిభారతదేశంలో ఒక అరుదైన ప్రజా ఉద్యమంగా చరిత్రలో నిలిచింది. ఈ నేపథ్యంలో 2022లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అమరావతినే శాశ్వత రాజధానిగా ప్రకటిస్తూ కీలక తీర్పును వెలువరించింది. ప్రభుత్వ విధానాలు ప్రజలనమ్మకానికి విరుద్ధంగా ఉండకూడదన్న సందేశాన్ని కోర్టు స్పష్టంగా తెలిపింది. అయినప్పటికీ, అమలులో అసంపూర్ణత కొనసాగుతుండగా ఇప్పుడు కేంద్రం అడుగులు వేయడం రాష్ట్రప్రజలకు కొత్త నమ్మకాన్ని కలిగిస్తోంది. 2025 మే 2న, గౌరవ ప్రధాని నరేంద్ర



మోదీ అమరావతిలో పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇది కేవలం పాలనా కార్యక్రమం మాత్రమేకాదు, రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధికి బలమైన సంకేతం. కేంద్ర ప్రభుత్వం ఈ దశలో అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తించి, చట్టబద్ధతను కల్పించి రైతుల ఆశల్ని నిలబెట్టాల్సిన బాధ్యతను భుజాన వేసుకోవాలి. రైతులకు సరైన నష్ట పరిహారం, పునరావాసం, జీవితాంత భరోసా కావాలి. భూములు ఇచ్చిన రైతులు అభివృద్ధిలో భాగస్వామ్యంగా మారేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఉపాధి అవకాశాలు, రైతు సంక్షేమ పథకాలు అమలయ్యే విధంగా విధానాలు రూపొందించాలి. ఇది కేవలం ఓ భరోసా మాట కాదు, ఒక బాధ్యతగా మారాలి. ఇక అభివృద్ధి ప్రణాళికను చూస్తే, అమరావతిని ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో తీర్చిదిద్దే దిశగా నడవాలి. విశ్వవిద్యాలయాలు, సాంకేతిక విద్యాసంస్థలు, పరిశోధన కేంద్రాలు ఏర్పాటుచేయాలి. ఐటి హబ్‌గా అభివృద్ధి చేసి, యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించాలి.అదేవిధంగా ఆటోమేషన్, బయోటెక్నాలజీ వంటి ఆధునిక రంగాల్లో పెట్టుబడులకు ప్రోత్సాహం ఇవ్వాలి. అంతర్జాతీయ ప్రమాణాల క్రీడా ప్రాంగణాలు, స్టేడియాలు ఏర్పాటు చేయడం ద్వారా క్రీడా అభివృద్ధికి మార్గం వేయవచ్చు. యువతలో స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు,క్రీడా పర్యాటనకు దోహదం చేయవచ్చు.అలాగే,ఆధునిక వైద్యశాలలు, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్యసేవలు అందించవచ్చు. ఈమౌలిక వసతులు అమరావతిని ఒక సమగ్ర జీవన కేంద్రంగా తీర్చిదిద్దతాయి. ఇవన్నీ కలిపిచూస్తే, అమరావతి అభివృద్ధి కేవలం రాజధాని నిర్మాణం మాత్రమే కాదు. అది ఒక రాష్ట్రం ఆత్మగౌరవానికి, ప్రజల భవిష్యత్తుకి నిలకడగా మారే మార్గం. ఇది రైతుల త్యాగానికి గౌరవంగా నిలవాలి. కేంద్రప్రభుత్వం చట్టబద్ధత, నిధులు, ప్రాజెక్టులు సమర్థంగా అందించాలి.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలతోకలిసి ముందుకు నడవాలి.అప్పుడు మాత్రమే అమరావతి ఒక అభివృద్ధి చిహ్నంగా నిలుస్తుంది. •

# ప్రజావాక్కు



### మహిళల భాగస్వామ్యం అవసరం

దేశంలో జీడీపీ లెక్కల గొడవలో పడి అసలైన అభివృద్ధికి కొలబద్దగా నిలిచే మహిళ భాగస్వామ్యంలో రావాల్సిన లేదా పెరగాల్సిన వృద్ధిని పెంచలేకపోతున్నాం. సమానత్వంసాధించకుండావచ్చే అభివృద్ధి ఒకఅభివృద్ధేనా అన్నా అనుమానం రాకమానదు. ఇకపోతే మహిళలు పని చేయడానికి అనువైన పరిస్థితులు కల్పించాలి అని విశాఖ కేస్‌లో చెప్పినప్పటికీ ఆదిశగా అడుగులు పడుతున్నాయా అనేదిపెద్దప్రశ్న. ఇకపోతే దేశంలో సమానత్వం అందించే ఏకీకృత చట్టం,ఉపాధిహామీ ఒకటే అయితే కేంద్రం మితి మీరిన పోకడలువల్ల రాష్ట్ర భౌగోళిక పరిస్థితిని ఆధారంగా పనుల ఎంపికచేసుకునే స్వేచ్ఛలేకపోవడం వల్ల ఆ చట్టం మహత్తర స్ఫూర్తిదెబ్బతింటున్నది.మహబూబ్‌నగర్ వలసలు నివారించేవిధంగా ఆజిల్లా భౌగోళికపరిస్థితికి తగ్గట్టు పనులరూప కల్పన జరగాల్సిన అవసరం ఉంది.

- భారత అవినాష్, జనగామ

### వృక్షో రక్షతి రక్షితః

శబ్ద, వాయుకాలుష్యంతో మానవుడు కకావికలం అవుతున్నాడు.ఇక పశుపక్ష్యాదుల సంగతిసరేసరి.ప్రకృతి అసమతుల్యత వైపు పయనిస్తూ ఆపదలతో విలయతాండవం చేస్తున్నా నరుడుమేలుకోలేదన్న విషయం ఆందోళనకరం. ఇదిముమ్మాటికి మానవతప్పిదం.మనం ఎంత భయంకర వాతావరణంలో ఉన్నామనేది ఏదో ఒకచోట పుడమి తల్లి కన్నెర్ర కారణంగా తుఫాన్, సునామి రక్కసి విరుచుకుపడడమే ఇందుకు నిదర్శనం. అటవి సంపద, చెరువులు, భూగర్భజలాలు, ఇంకుడు గుంతలను పరిక్షించుకోవాలి. అభివృద్ధినెపంతో ఇష్టానుసారంగా పరిసరాలకు హాని తలపెట్టే పనులు ఇకనుంచి అయినా మానుకోవాలి.

- ఎం. రాజేష్ నల్గొండ

### మద్యంపై నియంత్రణ అవసరం

మద్యం, మాదకద్రవ్యాలుఊరూరా విచ్చలవిడిగా లభిస్తూ నవతరాన్ని దారితప్పిస్తున్నాయి. వీటిని అణచివేసేందుకు ఉక్కుపాదంమోపాలి. నవతరాన్నికాపాడాలి.మద్యం, మాదకద్రవ్యాలు యువతకు అందకుండా ప్రభుత్వం నిఘా ఏర్పాటు చేయాలి. ఎవరైనా వీటిని అమ్మినట్లు తెలిసినా, చూసినా వారినివెంటనే అదుపులోకి తీసుకొనికఠిన శిక్షలు విధించాలి. తిరిగిఅలాంటి పనులు చేయకుండా చూడాలి.

- మా.శ్రీ.రాజు, పాల్వంచ

### ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రపంచంలో ఊబకాయంతో బాధపడుతున్న వాళ్ల కోకొల్లలు. మనదేశంలో కూడా తక్కువేమీకాదు. ఈ ఒబెసిటికి ప్రధాన కారణం వ్యాయామలేమి. జంక్‌ఫుడ్ ఎక్కువ తీసుకోవడం అని నిపుణులు చెబుతుంటారు. మంచి ఆరోగ్యం పొందాలంటే చిరుతిళ్లు నిద్ర ముఖ్యంగా మానసిక ప్రశాంతత ఎంతో అవసరం. రోజుకు కనీసం పది నిమిషాలపాటు ధ్యానం చేయాలి. కష్టాలు కలకాలం ఉండవని గ్రహించాలి. నీరు ఎక్కువగా తాగాలి. శారీరకంగా, మానసికంగా దృఢంగాఉండాలి.పొగతాగడం, మందు వగైరాలకు వెంటనే స్వస్తి పలకాలి. భక్తి, భుక్తి మితంగా ఉండాలి.అప్పుడు వృత్తిలోకూడా ఎదగడానికి ఆస్కారంఎంతో ఉంది.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### సీనియర్లకు ప్రమోషన్స్ ఇవ్వాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ట్రాన్స్ఫర్లు చేయాలని ఒక చట్టం రూపొందించింది.అన్ని డిపార్ట్మెంట్లకు ప్రమోషన్ వస్తున్నాయి. కానీ టీచర్లకు ప్రమోషన్లు ఒక కలగానే మిగిలిపోతూ ఉన్నది. ప్రమోషన్లలోరిజర్వేషన్లు ఉండడం వలన సీనియారిటీకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. కొంతమంది పుట్టిన తారీఖు నుండి ప్రమోషన్లు ఇచ్చేయమని అప్పీలుచేశారు. ఇంకొంతమంది సెకండరీ టీచర్లు డైట్ కాలేజీ లెక్చరర్‌గా, ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్లుగా ప్రమోషన్ లో తమకు కొంత శాతం ఇవ్వాలని అప్పిల్ చేశారు. డ్రిల్ మాస్టర్లు కూడా ఏకంగా డిగ్రీ కాలేజీల పీడీలుగా ప్రమోషన్లు ఇమ్మని అడుగుతున్నారు. ఎవరికి తోచిన అప్పిల్ వారు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సెకండరీ టీచర్లు కొంతమంది హైస్కూల్లో జాయిన్ అయ్యి ,స్కూల్ అసిస్టెంట్స్ వర్క్ చేయవలసి వస్తుంది.

- వి. భాస్కర్ రావు, విజయనగరం జిల్లా

### డిప్యుటేషన్ రద్దు చేయాలి

గురుకులాలలో టీచర్స్ పోస్టులను గత సంవత్సరంలో భర్తీ చేయడం జరిగింది. సంవత్సరం పూర్తికాకముందే మళ్లీ డిప్యూటేషన్ అని అంటున్నారు. ఈ విధానానికి స్వస్తి పలకాలి. టీచర్స్ లెక్చరర్స్ ప్రస్తుతం పని చేస్తున్న గురుకులంలో కుటుంబ సమేతంగా క్వార్టర్స్‌లలో ఉండి విధులు నిర్వహిస్తున్నారు. ఈ విధానాన్ని రద్దు చేయాలి. డిప్యూటేషన్ విధానం వలన వికలాంగులైన టీచర్స్ లెక్చరర్స్, మహిళా టీచర్స్ లెక్చరర్స్ ఇబ్బందులు పడుతున్నారు.

-రాపాక, రవీందర్ జనగాం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# భారత్‌కు సకల దేశాల మద్దతు

కనుమ ఎల్లారెడ్డి

పాక్ కు ఎప్పటికి బుద్ధి వస్తుందో తెలియదు కాని ఉగ్రవాదంతో చెట్టా పట్టాల్ వేసుకుంది. భారత్ పై అంత అక్కసు ఉంటే పహాల్గాం దాడి కాకుండా, అమాయక పర్యాటకుల ప్రాణాలు తీసి చాలా పెద్ద తప్పు చేసింది. భారత్ పై ఎందుకు దాయది దేశం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందో అర్థం కావడం లేదు. ఇప్పటికే భారత్ చాలా నిగ్రహంగా ఉంది. అది భారత్‌ను తక్కువ అంచనా వేస్తోందా! అన్న అనుమానాలు రేకెత్తుత్తున్నాయి. అగ్రదేశాలయిన అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు పాక్ పై గుర్రుమంటున్నాయి. ముఖ్యంగా అఫ్ఘానిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వం కూడా భారత్ పక్షాన ఉండటం, ఉగ్రవాదాన్ని తరిమికొడతాం అని చెప్పడం ప్రశంసనీయం. కాగా పహల్గాం దాడిని అల్ జీరియా, గ్రీస్, సియోర్ర లియాన్, గయాన, సోమాలియా, పనామా దేశాలు భారత్‌కు సంఘీభావం ప్రకటించాయి. చివరికి ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ అంటోనియా గుటేర్రస్ కూడా ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండించారు. ముందుగానే అంతత మాత్రాన ఉన్న భారత్, పాక్ సంబంధాలు ఈ దాడితో విపరీత పరిణామాలు చోటు చేసుకుంటాయి అని ఆందోళన వెలిబుచ్చారు. ఉగ్రవాదాన్ని ఖండించి భారత్‌కు మద్దతు ప్రకటించిన దేశాలకు భారత విదేశాంగా మంత్రి జై శంకర్ కృతజ్ఞతలు చెప్పారు. పాక్ లక్ష్యం ఒకటే భారత్‌ను ఎలాగైనా అస్థిర పరచాలానే తలంపుతో ఉంది. ఆ నేపథ్యంలో పర్యాటకులను లక్ష్యంగా పెట్టుకుంది. భారత్‌తో ఇప్పటికే డంకిలు, డెంకీలు తిన్న పాక్‌కు బుద్ధి రాకపోవటం శోచనీయం.పాక్‌పై దాడికి భారత్‌లోని సైనికులు అవసరం లేదు. భారత తల్లుల గర్భంలోని పసికందులు చాలు. వారి రక్తం సలాసలా కాగిపోతోంది. భారత్ ఇక ఎంత మాత్రం ఉపేక్షించరాదు. ఏ దేశం పాక్‌కు మద్దతు ఇవ్వదు. అందు నిమిత్తమే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కూడా పహల్గాంలో 28మంది పర్యాటకుల ప్రాణాలు బలిగొన్న ఉగ్రమూకలకు కఠినంగా శిక్ష పడాల్సిందేనని, దానికి తాము పూర్తి మద్దతు ఇస్తామని స్పష్టంచేశారు. మరో వైపు భారత్ మాపై దాడి చేస్తుంది అని, పహల్గాం దాడిని, భారత్ ఒక సాకుగా వాడుకోవాలని చూస్తుందని, పాక్ సమాచార, ప్రసార శాఖ మంత్రి తరార్ చెప్పడం విడ్డూరం. తప్పు చేసి దాన్ని ఒక



సాకు అని పాక్ చెప్పడం సహించరాని విషయం. పైగా తమపై దాడి చెస్తే భారత్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనని చెప్పడం హేయం. తరర్ మతి ఉండి మాట్లాడుతున్నాడో లేదో అతనికే తెలియాలి. రుజువులు కళ్ల ముందు కనిపిస్తున్నా, పలు దేశాలు పాక్‌ను విమర్శిస్తున్నా పాక్ కు బుద్ధి రాకపోవడం ఆ దేశానికే సిగ్గు చేటు. భారత్‌తో, పాక్ యుద్ధం చెస్తే ఏదేశం కూడా పాక్‌కు మద్దతు ప్రకటించదు. భారత్‌పై పాక్ ఎన్ని ఆంక్షలు విధించినా ఆ దేశానికే నష్టం. ఇప్పటికే చీనాబ్ నది నీరు లేక పూర్తిగా అడగంటి పోయింది. ప్రధాన నీటి వనరు కనుమరుగు కావటం పాక్‌కు తొలి దెబ్బ. పాక్‌లో ఆర్థిక వ్యవస్థ కుదేలు అయింది. భారత్ దాడి చేస్తుంది అని ఆ దేశానికి భయం పుట్టుకుంది. అందుకే భారత్ పై తప్పుడు ప్రచారం చేస్తోంది. యుద్ధానికి భారత్ విముఖంగా ఉందని ఒక ఫేక్ వార్తను ప్రచారం చేస్తోంది. ఇది భారత్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీయడానికే ఇటువంటి అసంబద్ధ వార్తలు ప్రచారం చేయడం పాక్ కే చెల్లింది. పాక్‌ను దెబ్బ కొట్టాల్సిందేనని భారత్ కృత నిశ్చయంతో ఉంది. ఈసారి దాడి చెస్తే పాక్‌కు మాములుగా ఉండదు. అసలు భారత్ అంటే ఏమిటో రుచి చూపిస్తుంది. మళ్లీ భారత్ వైపు కన్నెత్తి చూడకుండా గట్టి గుణపాఠం చెప్పే రోజు ముందుంది. అందుకే పాక్ వణికిపోతోంది. అమాయకులైన పర్యాటకులను పొట్టన బెట్టుకోవడం కాదు దమ్ము, ధైర్యం ఉంటే నేరుగా భారత్ ఆర్మీని ఎదుర్కోండి మీ సత్తా ఏమిటో, మా సత్తా ఏమిటో బయట పడుతుంది అని ప్రతి భారతీయుడు పిడికిలి బిగిస్తున్నాడు. ఇక ఎక్కడైనా పాక్ ఉగ్రవాదులు దాడి చెస్తే మాత్రం సహించలేదు. చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైన దరిమిళ భక్తులకు పూర్తి రక్షణ కల్పిస్తున్నామని భారత్ ఆత్మ విశ్వాసంతో చెప్పింది. భారత్‌కు వివిధ దేశాలు మద్దతు ప్రకటించడం పట్ల, పాక్ ఇప్పటికైనా భారత్‌కు క్షమాపణ చెప్పాలి. అయినా పర్యాటకుల ప్రాణాలు తీయడం ఏ దేశ సంస్కృతి కాదు. పర్యాటకులకు మర్యాద, గౌరవం, తగిన సహాయ, సహకారాలు ఇవ్వాలి. అది భారత్‌ను చూచి పాక్ నేర్చుకోవాలి. ఇంత వరకు భారత్ ఎంతో సంయనం ప్రకటించింది. పర్యాటకుల ప్రాణాలు పోవడంతో ఇక భారత్ వెనక్కి తగ్గదు. ఏ క్షణంలో నైనా పాక్ పై భారత్ దాడి చేయాల్సిందే. దానికి మిగతా దేశాలు కూడా కలసిరావాలి. అప్పుడు కాని పాక్‌కు బుద్ధిరాదు. ఇక ఎప్పటికి ఉగ్రదాడి చేయదు అనే విధంగా పాక్‌కు గట్టి హెచ్చరిక చేయాలి. అప్పుడే పాక్ అదుపులోకి వస్తుంది. •

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక వార్త



# రక్తసిక్తమైన ప్రకాశం రోడ్లు

## - ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి



**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లాలో దాదాపు ఒకే సమయంలో మూడు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. ఆదివారం తెల్లవారుజామున ఒంగోలు మండలం కొప్పోలు సమీపంలో కోడిగుడ్ల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడి ముగ్గురు మృతి చెందారు. నెల్లూరు నగరానికి చెందిన లారీ డ్రైవర్ రమణయ్య(60), నెల్లూరు జిల్లా గుడిపల్లిపాడుకు చెందిన ఆర్.బాబు(45), అదే గ్రామానికి చెందిన నాగేంద్ర (25) అక్కడికక్కడే మృతి చెందారు. బోల్తా పడిన లారీని మరో లారీ ఢీకొనడంతో పలువురికి గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆ ట్రాఫిక్‌లో ఆగి ఉన్న కారును వెనుక నుంచి మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు లారీల మధ్య ఇన్నోవా కారు నుజ్జు నుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న టి.పావని(25), కౌషిక్(14) మృతి చెందారు. వీరు గుంటూరు జిల్లా కాకాణి నుంచి తిరుమలకు దైవదర్శనం కోసం వెళ్తున్నట్లుగా గుర్తించారు. ఈ కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు.

### సంఘటనా స్థలానికి హటావుటిన చేరుకున్న ఎస్పీ :







ఒంగోలు సమీపంలోని జరిగిన రోడ్డు ప్రమాదస్థలాన్ని స్వయంగా పరిశీలించిన ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రమాద కారణాలపై ఆరా, రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. వాహన చోదకులు వేగ పరిమితుల పట్ల జాగ్రత్త వహించి వాహనాలను నడపాలని, రహదారి భద్రత సూత్రాలను పాటిస్తూ సురక్షితంగా, క్షేమంగా గమ్యానికి చేరుకోవాలని ఎస్పీ కోరారు. ఎన్‌హెచ్-16 నేషనల్ హైవే కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి ఒంగోలు నుండి నెల్లూరు వైపు మార్గంలో ఆదివారం తెల్లవారుజామున మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మరణించడం అత్యంత బాధాకరంగా ఉందని ఎస్పీ తెలిపారు. ఈ ప్రమాదం చాలా దురదృష్టకరమని మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదం జరిగిన తీరు, కారణాలను పరిస్థితిని నిషితంగా సమీక్షించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడానికి సమగ్ర విచారణ జరుపుతామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ దామోదర్, ఒంగోలు ఉప రవాణా కమీషనర్ సుశీల అన్నారు. కొప్పోలు నేషనల్ హైవే మీద ఆగి ఉన్న లారీని వెనుక వస్తున్న కోడిగుడ్ల లారీ ఢీకొనడంతో లారీ తిరగబడిన ప్రమాదంలో ముగ్గురు మరణించారని, అదే మార్గంలో సుమారు 500 మీటర్ల సమీపంలో ఆగి ఉన్న కారు, ట్రాక్టర్‌ను అదే మార్గం వైపు నుండి వెళ్తున్న లారీ రెండింటిని ఢీకొనగా ఎటువంటి ప్రమాదం జరగలేదని, సుమారు 500 మీటర్ల సమపంలో అదే మార్గంలో ఆగి ఉన్న కారును, నెల్లూరు వైపు వెళ్తున్న కారును వెనుక ఉన్న లారీ బలంగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మరణించగా ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయని ఎస్పీ తెలిపారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్ సంఘమిత్ర ఆసుపత్రికి పంపించడం జరిగింది. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రెండు కిలోమీటర్ల వరకు ట్రాఫిక్ జామ్‌ను ప్రొక్లైన్‌ల సహాయంతో త్వరితగతిన చర్యలు చేపట్టి ట్రాఫిక్ క్లియరెన్స్ చేశారని ఎస్పీ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. అతి వేగం, నిర్లక్ష్యం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతుంటాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలను అరికట్టడానికి జిల్లా పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని, రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి లోపాలను అన్ని శాఖల సమన్వయంతో సరిదిద్దుతామని, రోడ్డు భద్రత ప్రమాదాలపై వాహనదారులకు, ప్రజలకు తరచు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేస్తామని, ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్న ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తూచా తప్పకుండా పాటించాలని డ్రైవర్లు వేగపరిమితి పట్ల జాగ్రత్త వహించి పరిమితమైన వేగంతో వెళ్లాలని, రహదారి భద్రతా సూత్రాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ ప్రయాణ జాగ్రత్తలు పాటించాలని, వాహనాలు నడిపే సమయంలో సహనంతో ఉండి సురక్షితంగా క్షేమంగా గమ్యాన్ని చేరాలని ఎస్పీ కోరారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కే.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా సీఐ అజయ్‌కుమార్, ఒంగోలు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, గిద్దలూరు సీఐ సురేష్, నేషనల్ హైవే అధికారులు, ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

# ఒంగోలులో ఘోర రోడ్డు ప్రమాదం

## - ఐదుగురు మృతి

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లాలో ఒకే చోట రెండు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఒంగోలు మండలం కొప్పోలు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదాలు జరిగాయి. ఆదివారం తెల్లవారుజామున కోడిగుడ్ల లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ కొప్పోలు వద్ద జాతీయ రహదారిపై ఒక్క సారిగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. నెల్లూరు టౌన్‌కు చెందిన రమణయ్య(60, నెల్లూరు జిల్లా గుడిపల్లిపాడుకు చెందిన బాబు(45), అదే గ్రామానికి చెందిన నాగేంద్ర(25)లు మృతి చెందారు. లారీ బోల్తా పడినట్లు గమనించి వెనుక వచ్చిన కారు బ్రేక్‌లు వేయడంతో అందులో ప్రయాణిస్తున్న వారు ప్రమాదం తప్పించుకున్నారు. కాని అంతలోనే వేగంగా దూసుకు వచ్చిన మరో లారీ అదుపు తప్పి ఆ కారును ఢీకొట్టింది. దాంతో ముందు లారీ, వెనుకాల లారీ, మధ్యలో కారు నుజ్జునుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్న టి.కౌసిక్(14), టి.పావని(25) అక్కడికక్కడే మృతి చెందారు. వీరు గుంటూరు జిల్లా కాకాణికి చెందిన వారు కాగా తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఒకే చోట ఒకే సారి వరుస రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు చనిపోవడంతో తీవ్ర విషాధం నెలకొంది. రెండు లారీలు, ఒక కారు రోడ్డుపై అడ్డంగా నిలిచిపోవడంతో జాతీయ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ ప్రమాదాలపై విచారణ చేపట్టారు.

## నేడే శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి తృతీయ వార్షికోత్సవం



**త్రిపురాంతకం, మే 4 ప్రభాతవార్త**

మండలంలోని గిరిజన ప్రాంతమైన చెరువకొమ్ము సుగాలి తండా గ్రామ పంచాయితీలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయాన్ని నిర్మాణం చేసి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ చేసి మూడు సంవత్సరాలు పూర్తి కాగా ప్రతి ఏటా వార్షికోత్సవం చేస్తూ వచ్చారు. అదే క్రమంలో ఈ ఏడాది తృతీయ వార్షికోత్సవం కూడా సాంప్రదాయబద్దంగా శాస్త్రీయంగా వేద పండితులతో నిర్వహిస్తారని, గ్రామ పెద్దలు, గ్రామ సర్పంచ్ సక్రునాయక్ తెలిపారు. ఈ తృతీయ వార్షికోత్సవానికి మండలంలోని భక్తులంతా విచ్చేసి స్వామివారికి పూజలు చేసి దర్శించుకుని భక్తులంతా తీర్థ ప్రసాదాలు అందుకోవాలని వారు కోరారు. కాగా కార్యక్రమం అనంతరం స్వామివారిని దర్శించి వచ్చిన భక్తులకు గిరిజన భక్తులైన సుగాలీలు అన్నప్రసాదం వితరణ చేసేందుకు సర్వం సిద్ధం చేసినట్లు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం కమిటీ వారు తెలిపారు.

# అక్రమ ఇసుక రవాణా- నేడు ఆదాయ వనరు

- మండల కేంద్రంలో రోజు అక్రమ రవాణా పరిపాలిటీ మారింది - ఆ వైపు కన్నెత్తి చూడని పోలీసు, రెవెన్యూ శాఖలు
- అధికార పార్టీ పలుకుబడుతో ఈ రవాణా జరుగుతున్నట్లు ఆరోపణలు - మాకు సంబంధం లేదంటున్న రెవెన్యూ, పోలీసు శాఖలు
- ఉచిత ఇసుక పాలసీ చూపిచ్చి అక్రమ రవాణానికి వడికట్టుతున్న కాంట్రాక్టర్లు - కాంట్రాక్టు ముసుగులో అధికార పార్టీ నాయకులు

**మద్దిపాడు, మే 4, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీను చూపిస్తు కాంట్రాక్టర్ ముసుగులో అధికార పార్టీ నాయకులు అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ఇసుక దందా నిర్వహిస్తున్నటువంటి పరిస్థితి. ఆదివారం నాడు సెలవు దినం కావడంతో స్థానిక మండల కేంద్రంలోని మద్దిపాడు గుండ్లకమ్మ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా దందా ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు నిర్వహించారు. సుమారుగా 10 ట్రాక్టర్లతోటి ఈ ఇసుక రవాణా జరిగినట్లు మద్దిపాడు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆదివారం నాడు ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారుగా 80 ట్రాక్టర్ల ట్రిప్పులు ఇసుక దందా నడిచినట్లు సమాచారం. గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలో ఉన్నటువంటి వ్యవసాయ భూములకు ముప్పు వాటిల్లుతుందని అనేక సందర్భాల్లో రెవెన్యూ, పోలీసు శాఖలకు మద్దిపాడు రాచవారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు విన్నవించుకున్నా కూడా ఆ వైపు కన్నెత్తి చూడని పరిస్థితి. ఆదివారం 5గంటల సమయంలో వార్త విలేకరి అక్రమ ఇసుక దందా జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించిన అక్రమ రవాణా పై పోలీసు శాఖ అధికారులకు ఫోన్ చేయగా స్థానిక పోలీసు స్టేషన్లో ఎవరు లేరంటూ తాము అందుబాటులో లేమంటూ సమాధానం తెలిపారు. మరో పక్క రెవెన్యూ అధికారులు మరో ముందడుగు వేసి ఫోన్ తీయినటువంటి పరిస్థితి. గ్రామంలో కాంట్రాక్ట్ పనుల నిమిత్తం గ్రామ పంచాయతీ నందు తీర్మానం చేసుకొని ఇసుకను తరలించాల్సి ఉండగా ఈ విషయంపై గ్రామ పంచాయతీ మద్దిపాడు గ్రామ కార్యదర్శి వార్త విలేకరి వివరణ అడుగగా తమకు ఏమి తెలియదంటూ గోడ మీద పిల్లిలా సమాధానం చెప్పినటువంటి పరిస్థితి. గ్రామాలలో కాంట్రాక్టర్ తమ యొక్క పనులు నిమిత్తం ఇసుకను డంపింగ్ యార్డ్ నుంచి తరలించుకోవాల్సినటువంటి పరిస్థితి. కానీ ఓ మాజీ ప్రజాప్రతినిధి కాంట్రాక్ట్‌గా వెలగబెడుతూ మద్దిపాడులోనే ఎస్బీఐ రోడ్డులో ఉన్నటువంటి కాలువ నిర్మాణానికి ఓ ప్రదేశంలో దరిదాపుగా 40 ట్రాక్టర్ ఇసుకను నిల్వ చేసినటువంటి పరిస్థితి. మిగతా 40 ట్రాక్టర్ల అక్రమ ఇసుక ఎటువైపు వెళ్లిందో తెలియనటువంటి ఆలోచన ఈ విధానానికి అధికారులకే వదిలేయాలి. గ్రామంలోని ఓ వ్యక్తి గృహ నిర్మాణం చేపట్టే క్రమంలో గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలో ఉన్నటువంటి గ్రామాలలో స్థానిక సచివాలయంలోను, రెవెన్యూ అధికారుల దగ్గర అనుమతి తీసుకుని ఓ ట్రాక్టర్ ద్వారా మాత్రమే ఇసుకను మనుషుల ద్వారా లోడ్ చేసుకుని గ్రామంలోకి ఆయా ప్రాంతాల్లో తరలించుకునే పరిస్థితి. లేదా డంపింగ్ యార్డు ఎక్కడ ఏర్పాటు చేశారో అక్కడ నుంచి మాత్రమే ఇసుకను తరలించుకోవాలి. గృహ నిర్మాణం చేసే వ్యక్తికే ఇలాంటి నియమావళి ఉండగా ఓ కాంట్రాక్టర్‌కు ఏ విధమైనటువంటి నియమాలు లేకపోవడం ఏమిటని గ్రామస్తులు ముక్కు మీద వేలు వేసుకొని విమర్శిస్తున్నారు. మండల పరిధిలోని మల్లవరం, మద్దిపాడు, వెల్లంపల్లి, రాచవారిపాలెం, కొలచనకోట, నందిపాడు, ఇనమనమెల్లూరు, తదితర గ్రామాలలో రోజువారీగా ఈ యొక్క ఇసుక దందా నడుస్తూనే ఉంది. కొంత మంది కేవలం ఇసుక దందా కోసం మాత్రమే ట్రాక్టర్లు కొనుగోలు చేసినటువంటి పరిస్థితులు ఉన్నాయి. అందరూ రోజు వారి దినచర్యలో వ్యవసాయ పనులు, కూలి పనులు చేసుకుంటే కేవలం ఇసుక దందాకు మాత్రమే పరిమితమైనటువంటి వ్యక్తులు అనేక మంది ఉన్నారు. ఈ ఇసుక అక్రమ రవాణా విషయమై వీఆర్వోలు, వీఆర్ఏలు ఆయా గ్రామాల్లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక అక్రమ దందా నిర్వాహకుల నుంచి ట్రాక్టర్‌కు రూ.500లు చొప్పున వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. దీనిని కట్టడి చేసేందుకు రెవెన్యూ, పోలీసు మైనింగ్ అధికారులు ఏ విధమైనటువంటి చర్యలు తీసుకోకుండా తమకు సంబంధం లేదంటూ ఎవరికి వాళ్ళు చేతులు దులుపుకునే పరిస్థితి. మండలంలోని గుండ్లకమ్మ పరివాహక ప్రాంతం ఇసుక అక్రమ దందా ఒక రోజు వారి దినసరిగా మారింది. పత్రికల్లోనూ వార్తలు వచ్చినప్పుడు పోలీసు శాఖ, రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారులు హడావుడిగా చేయడమే తప్ప కట్టడి చేయనటువంటి పరిస్థితి. అక్రమ ఇసుక దందా నిర్వాహకుల వాహనాలను పట్టుకొని వచ్చిన క్రమంలో పోలీసు శాఖ కేసుల నమోదు చేయటం రెవెన్యూ అధికారులకు అప్పచెప్పటం మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లుగా తూతూ మంత్రంగా జరిమానాలతో చేతులు దులుపుకుంటున్నటువంటి పరిస్థితులు అనేక సందర్భాలలో జరిగాయి. ఇసుక అక్రమ దందా కట్టడి చేయాలంటే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తే గాని ఈ యొక్క దందా నిర్వహణ అనేది ఆగదనేది మండలంలోని ఆయా గ్రామస్తుల ఆరోపణలు. కూటమి ప్రభుత్వం ఇచ్చ 9నెలలైనా క్రమంలో గొప్పలు చెప్పుకోవడానికి గాని పనితీరు ఎక్కడ వేసిన గొంగళి అన్న తీరులో ప్రభుత్వ అధికారుల పనితనం ఉందని మండలంలోని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు, రెవెన్యూ మైనింగ్, జిల్లా ఉన్నత స్థాయి అధికారులు కళ్లు తెరిచి ఈ ఇసుక అక్రమ దందా నిర్వహణాన్ని అరికట్టాలని మండలంలో ప్రజలు కోరుకుంటున్నారు.







# ప్రజలు న్యాయ సేవలును వినియోగించుకోవాలి

## - ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి టి.రాజశేఖర్ రావు

- కోర్టు భవనాన్ని ప్రారంభించిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు టీ.రాజశేఖర్ రావు,కె.మన్మధ రావు, జి.రామకృష్ణ ప్రసాద్,వై. లక్ష్మణరావు

**సింగరాయకొండ, మే 4,ప్రభాతవార్త**

నియోజకవర్గం ప్రజలు కు న్యాయ సేవలను చేరువ చేసేందుకు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి టీ.రాజశేఖర్ రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని మండల కాంప్లెక్స్ సముదాయాలలో నూతనంగా నిర్మించిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభోత్సవం వేడుకలును ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, ప్రకాశం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ తర్లాడ రాజశేఖర్‌రావు హాజరై,హైకోర్టు న్యాయమూర్తి కే.మన్మధరావు ముఖ్య అతిథులుగా హాజరైనారు. ముందుగా కోర్టు శిలాఫలకాన్ని న్యాయమూర్తి టి.రాజశేఖర్‌రావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కోర్టు భవనానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. మన్మధరావు ప్రారంభోత్సవం చేశారు, జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ వై. లక్ష్మణ రావులు కోర్టులోని కార్యాలయాలకు ప్రారంభోత్సవం చేశారు.ముందుగా ఈ కార్యక్రమానికి హాజరైన హైకోర్టున్యాయమూర్తులకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.తోలుత న్యాయమూర్తి టి.రాజశేఖరరావు పోలీసులు గౌరవ వందనం స్వీకరించారు.ఈ కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి,ఏ. భారతి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా జస్టిస్ టి. రాజశేఖర్ రావు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి ఈ కోర్టు చాలా అవసరమని అన్నారు.ప్రతి ఒక్కరికీ న్యాయం అందే విధంగా ఈ కోర్టు ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కోర్టు రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జస్టిస్ కే.మన్మధరావు మాట్లాడుతూ శింగరాయకొండకు కోర్టు అవసరమని చాలా ఏళ్ల క్రితమే గుర్తించామన్నారు. ఇక్కడ న్యాయవాదులు కందుకూరు కోర్టుకు వెళ్లడం ద్వారా వృత్తిపరంగా ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నట్లుచెప్పారు.ప్రస్తుతం నలుగురు హైకోర్టు న్యాయమూర్తులు శింగరాయకొండకు వచ్చి ఈ కోర్టును ప్రారంభించడం చాలా మంచి శుభ పరిణామం అని అన్నారు. జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ఈ కోర్టు ఎంతో మందికి ఉపయోగపడే విధంగా ఉంటుందన్నారు.జస్టిస్‌డాక్టర్ వై.లక్ష్మణరావు మాట్లాడుతూ శింగరాయకొండలో శ్రీవరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చాలా ప్రసిద్ధి కలిగిందని,ఈ ప్రాంతం అంతా ప్రశాంతమైన వాతావరణం ఉంటుందన్నారు.ఇలాంటి ప్రాంతంలో ఏర్పాటు చేసిన కోర్టు కక్షిదారులకు ఎంతో ఉపయోగపడు తుందన్నారు.జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ శ్రీ.ఏ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ ఈ కోర్టు ద్వారా కేసులు త్వరగా పరిష్కారమై కక్షిదారులకు సత్వరన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు.అనంతరం ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన న్యాయమూర్తులకు, అదేవిధంగా హైకోర్టు న్యాయమూర్తులను జిల్లా జడ్జి ఏ.భారతి,బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సన్నెబోయిన శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమం లోబార్‌అసోసియేషన్ అధ్యక్షులు సన్నిబోయిన శ్రీనివాసులు,ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని కోర్టులు న్యాయ మూర్తులు పాల్గొన్నారు.

దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాత సింగరాయకొండ శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోనిశ్రీవరాహ లక్ష్మీనరసింహ స్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్లను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు టి.రాజశేఖర్‌రావు,కె మన్మధరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు మంత్రోచ్ఛారణతో ఆశీర్వదించి స్వామి వారి శేష వస్త్రం తో ఘనంగా సత్కరించారు.







- మైదానప్రాంత గిరిజనులకు తరతరాలుగా అన్యాయం ..
- ఎరుకలు, యానాదులు, చెంచులు కమ్మర్లు సుగాలీలకు టికెట్లు ఇవ్వరా..?
- వారి సమస్యలు అసెంబ్లీ దృష్టికి ఇక ఎలా వస్తాయి..?
- మైదానప్రాంత గిరిజన సదస్సులో గళమెత్తిన నేతలు

# మైదాన గిరిజన కులాలకు ప్రాతినిధ్యం ఏది?..

**ఒంగోలు టౌన్, మే 4, ప్రభాతవార్త**

గిరిజనులకు చట్టపరంగా ఇవ్వాల్సిన రిజర్వేషన్లు కల్పిస్తున్నా.. కొన్ని కులాలకు అసలు రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా పోతోందని పలువురు నేతలు గళమెత్తారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం మైదానప్రాంత గిరిజన సదస్సు నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త, మాజీ డీజీపీ జె.పూర్ణచంద్రరావు, మరో సమన్వయకర్త బక్కా పరంజ్యోతి తదితరులు మాట్లాడారు. ముందుగా మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన ప్రకారం రాష్ట్రంలో మొత్తం జనాభా 4.32 కోట్లు. అందులో ఎస్టీలు 25,34,795. మొత్తం జనాభాలో వారి శాతం 5.86. 2011లో కేంద్రం నిర్వహించిన జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 4.94 కోట్లు. నేషనల్ కమిషన్ టెక్నికల్ గ్రూప్ ఆన్ పాపులేషన్ ప్రొజెక్షన్ ప్రకారం రాష్ట్ర జనాభా (10.02.2025 నాటికి) 5.35 కోట్లు. ఎస్టీలలో ప్రధానంగా యానాదులు, ఎరుకలు, సుగాలీలు, చెంచులు కమ్మర్లు కొండదొరలు, కోయలు, జాతాపులు, కోర్లు, సవర్లు, కొండ రెడ్లు, బగతలు.. ఇలా ఇంకా చాలా మంది ఉన్నారు. వీరందరికీ సమానమైన ప్రాతినిధ్యం లేదు. రాష్ట్రంలో కమ్మ, రెడ్ల రాజకీయం ఎక్కువగా నడుస్తోంది. వాళ్ల తప్పనిసరిగా రిజర్వేషన్ల ప్రకారం ఇవ్వాల్సిన ఏడు అసెంబ్లీ సీట్లను ఏజెన్సీ ప్రాంతంలో సర్దేస్తున్నారు. మైదాన ప్రాంత గిరిజనులకు అవకాశం అస్సలు దక్కడం లేదు. రాయలసీమ, కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లోని మైదాన ప్రాంతంలో ఎస్టీలకు అస్సలు ఎస్టీ నియోజకవర్గాలు ఏర్పాటు చేయడం లేదు. ఏజెన్సీ ప్రాంతాలకు సర్దేస్తున్నారు. ప్రధానంగా ఇక్కడ యానాదులు, ఎరుకులు, సుగాలీలు చెంచులు కమ్మర్లు తదితరులుంటారు. మొత్తం ఎస్టీ లలో వీళ్లే ఉంటారు. కానీ, యానాదులు, ఎరుకలకు అస్సలు ఎమ్మెల్యే టికెట్లే దక్కడంలేదు.ఎప్పుడో ఒకసారి వెంకటేశ్వర్లు అనే నాయకుడు, పెంచలయ్య యానాది నాయకుడు ఎమ్మెల్యేలు అయినట్లు తెలుస్తోంది. అలాగే ఇటీవలి కాలంలో కుంభా రవిబాబు ఎస్.కోట ప్రాంతానికి చెందినవారు. ఆయన ఎమ్మెల్సీ అయ్యారు. ఎస్టీలలో అత్యధికంగా ఉన్నవారు యానాది కులస్థులు. వారు సుమారు 5 లక్షల పై చిలుకు ఉన్నారు.ఆ తర్వాత వరుసగాఎరుకలు, సుగాలీలు, కొండదొరలు, కోయలు, జాతాపులు, కోదులు, సవరలు, కొండరెడ్లు.. ఇలా ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 115 మంది ఎస్టీలు ఎమ్మెల్యేలయ్యారు. జనాభా దామాషా ప్రకారం సంఖ్య చూసుకుంటే సరిగ్గానే ఉంటుంది. కానీ యానాది, ఎరుకల, సుగాలీ చెంచులు కమ్మర్లు నుంచి ఇప్పటివరకు ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. ఇది నిజమైన ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది? ఇప్పటివరకు ప్రాతినిధ్యం లేని కులాలకు తప్పనిసరిగా ప్రాతినిధ్యం ఉంటేనే వారి సమస్యలపై అసెంబ్లీలో చర్చించే అవకాశం ఉంటుంది" అని సూచించారు. పూర్ణ చంద్రరావు త్వరలో జరగనున్న నియోజక వర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)లోనైనా మైదాన ప్రాంత గిరిజనులకు న్యాయం చేయాలి. వారికి కనీసం మూడు నాలుగు స్థానాలు కేటాయించాలి. మైదాన ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన గిరిజన సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్లు చాలా అధ్వాన్నంగా ఉంటున్నాయి. వాటికి అరకొరగానే నిధులు కేటాయిస్తున్నారు. అలాగే మైదాన ప్రాంత గిరిజనుల కోసం ఏర్పాటుచేసిన కార్పొరేషన్ కూడా నామమాత్రంగానే ఉంటోంది. దానికి కూడా నిధులు ఇవ్వడం లేదు. ప్రతి జిల్లాలోనూ ఐటీడీఏ ఏర్పాటుచేసి, బ్యాంకులతో సంబంధం లేకుండా గిరిజనుల్లో మైదాన ప్రాంతంలో ఉండేవారిని కూడా సమాజంలో పైకి తీసుకురావాలి. ఈ సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే రాజకీయ ప్రాతినిధ్యం ఉండాలి" అని తెలిపారు.ఎమ్మెల్సీ కుంభా రవిబాబు,ఎల్ ఎస్టీ నాయకుడు పేరం సత్యం మాట్లాడారు. బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త బక్కా పరంజ్యోతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్టీ ఉప ప్రణాళిక పేరుతో నిధులు కేటాయించినట్లు చూపిస్తున్నా, వాస్తవ ఖర్చు దగ్గరకు వచ్చేసరికి మాత్రం వాటిని వేరే కార్యక్రమాలకు మళ్లిస్తున్నారు. గిరిజనులకు ఉపాధి కల్పన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం పెట్టాల్సిన ఖర్చు అస్సలు పెట్టడం లేదు. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా వినియోగించేలా చేయాలంటే ఉద్యమించక తప్పేలా లేదు. అలాగే యానాదులు, ఎరుకలు, సుగాలీల్లాంటి మైదాన ప్రాంత గిరిజనులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి" అని డిమాండు చేశారు.



# ప్రజలు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

## - మంత్రి గొట్టిపాటి



**బల్లికురవ, మే 4, ప్రభాతవార్త**

రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో భారీ వర్షాలు కురుస్తున్నందున అనుక్షణం ప్రజలు అప్రమత్తంగా వ్యవహారించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. వర్షంతో పాటు పలు ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని, వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో రవికుమార్ రాష్ట్ర ప్రజానీకానికి పలు సూచనలు చేస్తున్నారు. అదే విధంగా విద్యుత్ శాఖ అధికారులు కూడా అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి గొట్టిపాటి ఏ విధమైన చర్యలు తీసుకోవాలో వివరించారు. గాలి వానకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను వెంటనే పునరుద్దరించి ప్రజలకు విద్యుత్ సరఫరా అందజేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహారించవద్దన్నారు. వర్షప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపులు, భారీ వర్షం నేపథ్యంలో సురక్షిత ప్రాంతాలలోనే ఉండాలన్నారు.

## 6 నుంచి శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



**కొనకనమిట్ల, మే 4, ప్రభాతవార్త**

మండలంలోని చినమనగుండంలో నూతనంగా నిర్మించిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు జరుగుతాయని కమిటీ నిర్వాహకులు తెలిపారు. 6న ఉదయం పూజ ప్రారంభం, గణపతి పూజా పుణ్యాహవచన, పతాకావిష్కరణ యాగశాల యాధాకాల పూజలు, తీర్థ ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమం 7న ఉదయం సుప్రభాత సేవ, కలశ తీర్థం, మహాన్యాస పూర్వక యంత్రాభిషేకం, జలాధివాస విమోచనం, వీర నాట్య దీపోత్సవ సహిత గ్రామోత్సవం, అభిషేకం, ధాన్యాధివాసం, ఆదివాసం, సాయంత్రం 5గంటల నుంచి కేరళ వాయిద్యాలతో స్వామివారి భారీ ఊరేగింపు రాత్రి ఎలక్ట్రికల్ ప్రభ, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 8న సుప్రభాత సేవ కలశ తీర్థం, యంత్రాభిషేకం, యదాకాల పూజలు, గర్తన్యాస, రత్నాన్యాస, భీజన్యాసాలు మహాయంత్ర శిఖర కలశ, విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా జరుగుతాయని, ఈ ప్రతిష్ఠ కార్యక్రమాలను వాస్తు సిద్దాంతి, ప్రతిష్ఠాచార్యులు పండిత ప్రసాద దైవజ్ఞశర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. అన్నదాన కార్యక్రమం రాత్రి 8గంటల నుంచి కోలాటం భజన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

# పిడుగుపాటుకు వ్యక్తి మృతి



**చిన్నగంజాం, మే 4, ప్రభాతవార్త**

చిన్నగంజాం మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి చిన్నగంజాంలో పిడుగు పాటుకు గురై గేదెలు కాపరి గడ్డం బ్రహ్మయ్య(50) అనే వ్యక్తి మృతి చెందారు. స్థానిక రామ కోటేశ్వర కాలనీ కి చెందిన బ్రహ్మయ్య రొంపేరు కాలువ పక్కన పొలాల్లో గేదెలను మేతకు తీసుకెళ్లారు. ఆ సమయంలోనే భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగు పడటంతో అక్కడే ఉన్న బ్రహ్మయ్య అక్కడికక్కడిడే మృతి చెందాడు మృతుడికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# 5వ తేదీ నుంచి ఆధార్ క్యాంపులు

**చిన్నగంజాం, మే 4, ప్రభాతవార్త**

చిన్నగంజాం మండల పరిధిలోని అన్ని గ్రామాల పంచాయతీల్లో 0- 6 సంవత్సరాల్లోపు పిల్లలకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్ల సహకారంతో ఈనెల 5 నుండి 8వ తేదీ వరకు, మరలా 12వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఆధార్ మొబైల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఏ.శ్రీనివాస మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. దానిలో భాగంగా ఈనెల 5వ తేదీ డిజిటల్ అసిస్టెంట్ ఎన్.సురేష్, ఏ.మనిషి కుమార్ ఆధ్వర్యంలో గొనసపూడి, చిన్నగంజాం సచివాలయంలో ఈనెల 6న చింతగుంపలా, చిన్నగంజాం సచివాలయంలో 7న మోటుపల్లి, కొత్తపాలెం సచివాలయంలో 8న మున్నంవారిపాలెం సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12న రాజుబంగారు పాలెం సచివాలయంలో 13న పెద్దగంజాం సచివాలయంలో, 14న పెద్దగంజాం సచివాలయంలో, 15న పెద్దగంజాం సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆధార్ మొబైల్ క్యాంపులను ఆయా గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వేసవి విజ్ఞాన శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



**చిన్నగంజాం, మే 4, ప్రభాతవార్త**

శాఖా గ్రంధాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంధపాలకుడు ఏఎంఎల్ఎన్ చార్యులు ఆదివారం తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులకు రిసోర్స్ పర్సన్‌పై వై.రామాంజనేయులు చేత ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాలు పిల్లలు చేత నీతి కథలు, జాతీయ నాయకులు జీవిత చరిత్రలు చదివించి వారి చేత మరలా కథలు చెప్పించారు. ఇంగ్లీష్ ఫ్యాకల్టీ నరసింహారావు చేత విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషన జనరల్ నాలెడ్జ్ క్లాసులు నిర్వహించారు. కాంపిటిటేవ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కొరకు గ్రంధాలయాన్ని సాయంత్రం వరకు తెరిచి ఉంచుతున్నట్లు ఆయన తెలిపారు.

## పదిలో ప్రతిభ చూపిన విద్యార్థినికి నగదు ప్రోత్సాహం



**వేటపాలెం, మే 4, ప్రభాతవార్త**

2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో 596 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం, బాపట్ల జిల్లా స్థాయిలో ప్రధమ స్థానం సాధించిన జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన సజ్జా దివ్యశ్రీని చీరాలలోని వైకుంఠపురంలో ఉన్నటువంటి రామకృష్ణ సేవా సమితి తరుపున వీఎస్ఎన్ మూర్తి కే.మధు రూ.3వేలు నగదు పురస్కారం, బహుమతితో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ తల్లి భారతి, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.శేఖరరావు, ఉమ్మిటి వేణుగోపాలరావు, రామకృష్ణ, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## బూచేపల్లిని సన్మానించిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు



**దర్శి, మే 4, ప్రభాతవార్త**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని గజమాలతో సన్మానించిన వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రీజనల్ కోఆర్డినేటర్ దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి.. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రీజనల్ కోఆర్డినేటర్‌గా నియామకానికి సహకారం అందించిన జిల్లా అధ్యక్షుడు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి, జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మకి, పార్లమెంట్ ఇన్‌ఛార్జీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌కి పెద్దలు రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డికి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్యకి రాష్ట్ర అధికార ప్రతినిధి పుత్తా శివ శంకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం భాషా, ప్రకాశం జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యరమల మధుసూదన్‌రెడ్డి, ఐటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు దుగ్గిరెడ్డి నాగేంద్రరెడ్డి, మాజీ యువజన విభాగం అధ్యక్షుడు మేకల కృష్ణారెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ సందిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ విద్యార్థి విభాగం నాయకులు ఆఫ్రిది, బాజీ ప్రసాద్ పాల్గొన్నారు.

## కోటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన టీడీపీ యువ నాయకులు కడియాల లలిత్ సాగర్



**దర్శి, మే 4, ప్రభాతవార్త**

దర్శి మండలంలోని దేవవరం గ్రామంలో గాజుల కోటమ్మ ఇటీవల హార్ట్ ఎటాక్‌తో మృతి చెందగా విషయం తెలుసుకున్న టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ వారి గ్రామానికి వెళ్లి మృతి చెందిన గాజుల కోటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. తదుపరి గ్రామంలో బైపాస్ సర్జరీ చేపించుకున్న అటికల శ్రీనుని, మోకాల ఆపరేషన్ చేపించుకున్న పోకూరి అంకమ్మని, బైక్ యాక్సిడెంట్ కారణంగా కాలు ప్యాచర్ అయిన గోగిరెడ్డి వెంకటరెడ్డిని పరామర్శించారు. పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దర్శి మార్కెట్ యార్డు చైర్మన్ దారం నాగవేణి- సుబ్బారావు, ఒంగోలు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, దర్శి మండల టీడీపీ నాయకులు సానె సుబ్బయ్య, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ(చిన్న), క్లస్టర్ అంకయ్య, గణపతి, రమణయ్య, రంగారావు, గ్రామ టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**దర్శి, మే 4, ప్రభాతవార్త**

దర్శి టౌన్‌లో విద్యుత్ లైన్ క్రింద సాగర్ పైపులైన్ మరమ్మత్తుల కారణంగా సోమవారం ఉదయం 8గంటల నుండి మధాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ అంకబాబు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. కావున ఈ విద్యుత్ అంతరాయినిక ప్రజలందరూ సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

# నీ గానమే నా ప్రాణం స్వర్ణోత్సవ వేదిక





**ముండ్లమూరు, మే 4, ప్రభాతవార్త**

హైదరాబాద్ నగరంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి వ్యవస్థాపకులు, జాతీయ అధ్యక్షులు శ్రీ రాజు దేశ్ పాండే గురుస్వామి అధ్యక్షతన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నాలుగు రాష్ట్రాల నుండి అనేక మంది గురుస్వాములు పాల్గొన్నారు. నీ గానమే నా ప్రాణం స్వర్ణోత్సవ వేదిక నిర్వహించారు. ఏపీ నుంచి ఏబీఏడీపీఎస్ ప్రధాన కార్యదర్శి వాసు గురుస్వామి, ప్రకాశం జిల్లా జాయింట్ సెక్రటరీ కొండలు గురుస్వామి పాల్గొన్నారు.

# ఉచిత సున్తీ శిబిరానికి విశేష స్పందన

## - కనిగిరిలో కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 103 మందికి సున్తీ





**కనిగిరి, మే 4, ప్రభాతవార్త**

కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్, కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ అడ్వకేట్ షేక్ అబ్దుల్ గఫార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత సున్తీ శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. కనిగిరి పట్టణం, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన పేద ముస్లిం చిన్నారులకు ఈ సేవా కార్యక్రమం అంకితం చేయబడింది. కార్యక్రమంలో 103 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సున్తీ చేయడం జరిగింది. వైద్యులు ముందుగా సున్తీ యొక్క ఆరోగ్య ప్రయోజనాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వైద్యపరమైన ప్రాముఖ్యతతో పాటు మతపరమైన సాంస్కృతిక విలువలను కూడా ఈ సందర్భంగా వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఇది 18 సంవత్సరాలుగా నిరంతరం జరుగుతున్న సేవా కార్యక్రమం పేద కుటుంబాలకు సున్తీ ఖర్చుతో కూడిన ప్రక్రియ కావడంతో వారిపై ఆర్థికభారం తగ్గించేందుకు ప్రతియేటా ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. సున్తీ చేయించుకున్న చిన్నారులకు ఐదు కేజీల గోధుమ పిండి, కేజీ బెల్లం, నెయ్యి, బ్రెడ్, అరటి పండ్లు, మెడికల్ కిట్‌లను పంపిణీ చేయగా, దూర ప్రాంతాల నుంచి విచ్చన వారికి టిఫిన్, భోజన సదుపాయాలను కూడా కల్పించారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని చిన్నారులకు ఆశీస్సులు తెలిపారు. చివరిగా పిల్లల తల్లిదండ్రులు కేఎస్ఎం ఎడ్యుకేషనల్ సొసైటీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల



**చిన్నగంజాం, మే 4, ప్రభాతవార్త**

చిన్నగంజాం మండలంలోని సోపిరాల గ్రామంలో పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లను పురష్కరించుకుని మేళ తాళాలతో ఊరేగింపుగా భక్తులు వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అమ్మవారిని దర్శనార్థం భక్తులు భారీ సంఖ్యలో వచ్చారు.

## గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు





**తాళ్లూరు, మే 4, ప్రభాతవార్త**

మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మీ అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్.కామేశ్వర శర్మ, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రక్కన ఉన్న పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో జి.వాసుబాబు, చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్ఏ కాటూరి ప్రసాద్ సిబ్బంది పర్యవేక్షించారు.

## వృద్దాశ్రమానికి నిత్యవసర సరుకులు, బియ్యం అందజేసిన పెరుమాళ్ళ



**దర్శి, మే 4, ప్రభాతవార్త**

దర్శి ఆర్యవైద్య కళ్యాణ మండపం దగ్గర నివాసం ఉన్న పెరుమాళ్ళ శ్రీనివాసరావు కుమారులు పెరుమాళ్ళ సాయి గౌతమ్ పెద్ద కుమారుడు, చిన్న కుమారుడు పెరుమాళ్ళ యశ్వంత్ కుమార్ సీఏ ఇంటర్ పాసైన సందర్భంగా దర్శి కురిచేడు రోడ్డులోని షిర్డీ సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్దులకు 100 కేజీల బియ్యం, కంది పప్పు, 10 కిలోల నిత్యవసర సరుకులు ఆశ్రమంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# గ్రంధాలయాలను ఉపయోగించుకోవాలి




**దర్శి, మే 4, ప్రభాతవార్త**

దర్శి శాఖా గ్రంధాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థుల చేత కథలు చెప్పించడం కథలు చెప్పడం జరిగింది. రిసోర్స్ పర్సన్ ఆర్.సుధాకర్, చెంచు లింగం మాట్లాడుతూ పిల్లలు రోజు గ్రంధాలయాన్ని ఉపయోగించుకుని విజ్ఞానవంతులు కావాలని కోరడం జరిగింది. డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విజయకుమారి పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే ముత్తుముల చేతుల మీదుగా వ్యవసాయ పనిముట్లు పంపిణీ

**గిద్దలూరు, మే 4 ,ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని రైతులకు నేడు సోమవారం సబ్సిడీపై వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు మరియు పచ్చిరొట్టె విత్తనాలను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖాధికారి విజయభాస్కర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు.

## నేడు 1గంట నుంచి 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొనకనమిట్ల, మే 4, ప్రభాతవార్త**

మండలంలో సోమవారం మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ బ్రహ్మం తెలిపారు. బచ్చలకూరపాడు పరిధిలో నూతన విద్యుత్ లైన్ పనులు చేపట్టడం జరుగుతుందని, అందువల్ల సహకరించాలని కోరారు.

# పాము కాటుతో మహిళ మృతి

**బల్లికురవ, మే 4, ప్రభాతవార్త**

మండలంలోని సోమవరప్పాడు గ్రామంలో పాటు కాటుకు గురై మహిళ గార్లపాటి మల్లేశ్వరి(52) మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. శనివారం కూలి పనులలో భాగంగా గ్రామానికి చెందిన రైతులు మిరప తోటలో కాయలు కోసేందుకు వెళ్ళింది. కాయలు కోస్తూ ఉండగా పాము కాటు వేసింది. తోటి కూలీలు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి హుటాహుటీన చిలకలూరిపేట వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం చనిపోయింది. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## ద్విచక్ర వాహనంపై హెల్మెట్ లేకుండా బైక్ నడిపితే కఠిన చర్యలు

## - ఎస్సై అనుక్



**పొన్నలూరు, మే 4, ప్రభాతవార్త**

స్థానిక పోలీసు స్టేషన్ సమీపంలో ఆదివారం ఎస్సై అనుక్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్,ఆర్‌సీ ఉండాలని,18 సంవత్సరాలు నిండకుండా వాహనాలు నడిపినట్లయితే కఠిన చర్యలుతప్పవని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహన దారులు పాల్గొన్నారు.

# పొగాకు కొనుగోలు చేయాలి

**మద్దిపాడు, మే 4, ప్రభాతవార్త**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల నాయకులు కనపర్తి సుబ్బారావు ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. కనపర్తి సుబ్బారావు ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. గుడిమందుని తెల్లనల్ల బర్లి పొగాకు రూ.15000 వరకు కొనుగోలు చేయాలన్నారు. గత ప్రభుత్వం వ్యవస్థలను కుదేలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు రైతులు గిట్టుబాటు ధర లేక ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది పొగాకు పంట సాగు పెరిగిందని, రైతులు అప్పులు తీసుకొచ్చి పంట సాగు చేశారని కొనుగోలు చేయకపోతే తీవ్రంగా నష్టపోతారన్నారు. వేలం కేంద్రాల్లో నోబిడ్ పేరుతో చెక్కులు వెనక్కి పంపుతున్నారని రైతులకు ఆర్థిక భారం పెరిగిపోతుందని అన్నారు. పొగాకు కొనుగోలు చేయని పక్షంలో రైతులతో ఆందోళన చేపడతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కవులు, రైతు సంఘం నాయకులు కాకుమాను సుబ్బారావు తదితర రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

**మార్కాపురం, మే 4, ప్రభాతవార్త**



స్థానిక గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం టెక్ మహీంద్రా, ఎసెంచర్, హెచ్‌సీఎల్ కంపెనీలు ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు షరీఫ్ ఆర్య, దయా స్వరూప్ పాండే, మనోహర్ కంపెనీ ప్రతినిధులుగా పాల్గొన్నారు. టెక్ మహీంద్రాకు 18 మంది విద్యార్థులు, ఎసెంచర్ కంపెనీకి ముగ్గురు విద్యార్థులు, హెచ్‌సీఎల్ కంపెనీకి నలుగురు విద్యార్థులు ఆకర్షణీయమైన వేతనంతో ఎంపిక కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్, కళాశాల డైరక్టర్ మీర్జా మసూద్ అలీ బేగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, సీఎస్ఈ డిపార్టుమెంట్ హెచ్ఓడీ షేక్ మహమ్మద్ రఫీ, హ్యూమనిటీస్ అండ్ సైన్సెస్ హెచ్ఓడీ రమాదేవి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**సంతనూతలపాడు, మే 4, ప్రభాతవార్త**



సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం నాడు వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్ ఆధ్వర్యంలో వారం వారం నాలుగో వారం మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో భాగంగా 300 మందికి పైగా మజ్జిగ పంపిణీ చేశారు. దాతలు గ్రంధి లక్ష్మీప్రసాదరావు, సులోచన దంపతులు ఆధ్వర్యంలో వేసవిలో ఏర్పాటు చేసిన మినీ కూలింగ్ చలివేంద్రం వద్ద దాతలు దమ్మల వెంకట సుబ్బారావు, సుబ్బరత్నంలు జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీనివాసరావు, సురేష్, బాలాజీలు ఆధ్వర్యంలో ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాదరావు, వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధి గ్రంధి లక్ష్మీ ప్రసాదరావులు దీనిని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు వివి శేషారావు, సెక్రటరీ వేమూరి ఆంజనేయులు, గౌరవ అధ్యక్షులు పాదర్తి గిరి, కోశాధికారి పామిడి సుధాకర్, వాసవి మహిళా క్లబ్ సెక్రటరీ శిఘాకొల్లి జయశ్రీ, వాసవి మహిళా క్లబ్ మాజీ అధ్యక్షులు జి.సులోచన, ఎస్.విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్ జి.శరత్‌బాబు, వాసవి క్లబ్ ఆర్యవైశ్య నాయకులు చలువాది రాము, కే.కోటేశ్వరరావు, ఎస్.రవి, ఎస్.సురేష్ కుమార్, ఎస్.ఉమా తదితరులు పాల్గొన్నారు. వేసవిలో కూలింగ్ తాగునీటిని, మజ్జిగను పంపిణీ చేస్తున్నల్న దాతలను వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాదరావుఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

## వైసీపీ నేతలు చెంచిరెడ్డి, రమణమ్మలకు ఘన సత్కారం

**సంతనూతలపాడు, మే 4, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం జబ్పీటీసీ, జిల్లా వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, మండల వైసీపీ కన్వీనర్ చెంచిరెడ్డి దంపతులను సంతనూతలపాడులో ఆదివారం నాడు సంతనూతలపాడు మండల వైసీపీ పబ్లిసిటి వింగ్ నూతన అధ్యక్షులు తెళ్ళ అనిల్ తదితరులు దుశ్శాలువాతో సత్కరించారు. వైసీపీ అభ్యున్నతకు మరింతగా కృషి చేయాలని నూతన అధ్యక్షులు అనిల్‌ను వైసీపీ నేతలు చెంచిరెడ్డి, రమణమ్మలు కోరారు. వైసీపీ అనుబంధ విభాగాల్లో మండల కమిటీల్లో పలువురుకు చోటు కల్పిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా పలువురు చెంచిరెడ్డి, రమణమ్మ, దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని వారు సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బుట్టి వెంకట్రావు, బుట్టి సురేష్ బాబు, తెళ్ళ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విజ్ఞానం మెరుగు

**టంగుటూరు, మే 4, ప్రభాతవార్త**



టంగుటూరు శాఖ గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగింది. ఈ విజ్ఞాన శిబిరంలో పాల్గొని విజ్ఞానవంతులు కావాలని పిల్లలు ఇష్టంగా మంచి కథలు, పుస్తకాలు చదివి అర్థం చేసుకోవడం, నిబంధ ఆ కథలను మిగిలిన వారికి చెప్పడం జరిగిందనిగ్రంథపాలకుడు గుమ్మడి వర్ధన్‌రాజు తెలిపారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్ జరిగిందన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు ఎందుకు తిరగకుండా, సెల్, టీవీలకు సమయాన్ని వృధా చేయకుండా తమ పిల్లలను గ్రంథాలయానికి అలవాటు చేయాలని గ్రంథపాలకుడు కోరారు. ఈ కార్యక్రమంలో మారుతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంగం లక్ష్మీదేవి మృతికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే అన్నా

**గిద్దలూరు, మే 4, ప్రభాతవార్త**



గిద్దలూరు మండలం కొమ్మునూరు గ్రామ పంచాయితీ పరిధిలోని వేములపాడు గ్రామంలో మాజీ సర్పంచ్ అంకిరెడ్డి సతీమణి లక్ష్మీదేవి గుండెపోటుతో మృతిచెందారు విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబు లక్ష్మీదేవి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీదేవి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్సీపీ నాయకులు ఉన్నారు.

## కర్ణాటి, చేగిరెడ్డి వారి వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల

**గిద్దలూరు, మే 4 ,ప్రభాతవార్త**





గిద్దలూరు పట్టణ నగర రోడ్డులోని శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో గిద్దలూరు పట్టణానికి చెందిన చేగిరెడ్డి వెంకట నారాయణమ్మ (టీచర్) కుమారుడు రాహుల్ రామిరెడ్డి మరియు కర్ణాటి పెద్ద లక్ష్మిరెడ్డి (టీచర్) కుమార్తె జాహ్నవి రెడ్డిలకు జరిగిన వివాహ వేడుక కార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఫైర్ ఫైటర్స్ దినోత్సవం



**దర్శి, మే 4, ప్రభాతవార్త**

అంతర్జాతీయ ఫైర్ ఫైటర్స్ దినోత్సవంను పురస్కరించుకుని జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటీవ్ మెంబర్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ దర్శి ఏరియా కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో దర్శిలోని స్థానిక ఎన్నెస్పీ కాలనీలోని రాష్ట్ర విద్యుత్ నివారణ, అగ్నిమాపక శాఖ కార్యాలయం ప్రాంగణంలో దివంగత ఫైర్ ఫైటర్స్ అమరవీరులకు గౌరత సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కపురం శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఫైర్ ఆఫీసర్ మోజేష్ అధ్యక్షత వహించగా ఏఐటీయుసీ నాయకులు హనుమంతరావు, ఆశా వర్కర్ సుశీలమ్మ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలి

## - ఎమ్మెల్యే కందుల



**మార్కాపురం, మే 4, ప్రభాతవార్త**

విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యతను ప్రతిభను వెలికి తీసేందుకు వేసవి శిక్షణ తరగతులు దోహదపడాలని మార్కాపురం శాసనసభ్యులు నారాయణరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా సాధికారిత సంస్థ పర్యవేక్షణలో శ్రీ కోడి రామకృష్ణమూర్తి ఆరోగ్య క్రీడా సాంస్కృతిక సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా, నట శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ మీ కోడి రామ్మూర్తి ఆరోగ్య క్రీడా సాంస్కృతి సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వేసవిలో విద్యార్థులకు నట శిక్షణ, ప్రతిభాపాటవాల తరగతులను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరిలో వారికి తెలియని కళ దాగి ఉంటుందని, దానిని గుర్తించి వెలికితీసినప్పుడే వారిలోని కలలు బహిర్గతమవుతాయని అన్నారు. కర్రసాము, బాక్సింగ్ నట శిక్షణలలో ప్రావీణ్యం గల శిక్షకుల ద్వారా వేసవి శిక్షణ తరగతులు నిర్వహించడం హర్షణీయమని పేర్కొన్నారు. బిడ్డతో పాటు శారీరక దృఢత్వం పెంపొందించుకునేందుకు ఇష్టమైన కళలను ప్రదర్శించేందుకు శిక్షణా తరగతులు వేదికగా మారాలని అన్నారు. పశ్చిమ ప్రకాశ ప్రాంతం కలలకు పుట్టినిల్లు అని, ఎందరో కళాకారులు ఈ ప్రాంతంలో ఉన్నారని అన్నారు. ఇలాంటి శిక్షణ తరగతులను పశ్చిమ ప్రకాశ ప్రాంతంలో ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ అశోక్‌రెడ్డి, పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యులు టి.సంజీవ్, శాప్ బాక్సింగ్ కోచ్ వేణు, ఫుట్‌బాల్ కోచ్ రామకృష్ణ, నాగార్జున రమేష్ తదితరులు పాల్గొన్నారు. శిక్షణా శిబిరం ప్రారంభోత్సవం సందర్భంగా జొన్నలగడ్డ ఆదేశకుమార్, అభినయ దంపతులు విద్యార్థులకు అల్పాహారం అందజేశారు.

## వికలాంగులకు, నడవలేని వారికి ట్రైసైకిళ్లు అందించిన గాదంశెట్టి సుబ్బారావు

**పామూరు, మే 4, ప్రభాతవార్త**





పామూరు పంచాయతీ పరిధిలోని ఇరువురు రోడ్డు ప్రాంతంలో నివసించే సీనియర్ కార్యకర్త షేక్ బాబు, షేక్ హజార్‌బి, షేక్ ఖాజామొహిద్దిన్‌లు అనారోగ్యం రీత్యా మంచానికే పరిమితమై కదల్లేని స్థితిలో ఉండటాన్ని స్థానిక సూర్యచంద్ర సేవా సంస్థ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ వెంకట మనోహర్‌ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా తన బామ్మర్ది అయిన గాదంశెట్టి సుబ్బారావు అందించిన ఆర్థిక సాయంతో వీల్ చైర్లను ఆదివారం నాడు ఆదివారం అందజేశారు. అదే విధంగా మంచానికే పరిమితమైన కుటంబానికి అండగా ఉండేందుకు, నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ద్వారా రూ.15వేలు పింఛన్ అందేలా చూస్తామని వారి కుటుంబానికి హామీ ఇచ్చారు. జిల్లా మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ హమీర్ బాబు, షేక్ ఖాజారహంతుల్లా, మాచర్ల రహమాన్, సిద్దవట్టం తిరుపతయ్య, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశంలో మహానేతగా ఎదిగిన వీరయ్య చౌదరి

**నాగులుప్పలపాడు, మే 4, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీలో యువ నాయకులుగా అంచలంచలుగా ఎదిగి మండల, నియోజకవర్గ జిల్లా స్తాయి నేతగా ఎదిగి ముప్పవరపు వీరయ్య చౌదరి ఆ పార్టీలో మహానేతగా పేరు సంపాదించుకున్నారు. 1983 తెలుగుదేశం పార్టీ చురుకైన నాయకులుగా మాజీ శాసనసభ్యులు ఈదర హరిబాబు నాయకత్వంతో ముప్పవరపు వీరయ్య చౌదరి యువతతో కలిసి దేశం పార్టీ గెలుపు కోసం కృషి చేశారు. అనంతరం ఆ పార్టీలో పార్టీ ఎన్నికల్లో తెలుగుదేశం తరుపున సర్పంచ్ నుండి ఎంపీటీసీ వార్డు మెంబర్‌తో పాటు జిల్లా స్థాయి పదవుల్లో దేశం పార్టీ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ సాధించడంలో ఆయన వెన్నంటి ఉండేవారు పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా తెలుగుదేశంలోనే కొనసాగి ఆ పార్టీకి కొండంత అండగా నిలిచిన ముప్పవరపు వీరయ్య చౌదరి ఎన్నో ఉద్యమాలు ప్రత్యక్షంగా పరోక్షంగా చేపట్టి దేశం పార్టీ చేస్తున్న కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉండేవారు. ఒంగోలు నియోజకవర్గంతోపాటు సంతనూతలపాడు నియోజకవర్గంలో ఆ పార్టీ గెలుపుతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన ముందు వరుసలో ఉండి కార్యకర్తలకు అండగా ఉండేవారు.

### మండల నాయకత్వం ఎవరికి :

త్వరగా సంపన్నులు కావాలంటే అక్రమ రవాణాగా ఇసుక వ్యాపారం ప్రభుత్వం అందిస్తున్న బియ్యం అలాగే బెల్టు షాపులు ఇలా అనేక వ్యాపారాలు సాగిస్తున్న నేతలు అడ్డుకట్ట వేస్తున్నారని భయభ్రాంతులతో కొంత మంది నేతలు, వ్యాపారస్తులు కలిసి హత్య చేయించి ఉంటారని మండలంలోని అన్ని గ్రామాల్లో వదంతులు ప్రతిఇంటా వినిపిస్తున్నాయి. అక్రమ వ్యాపారం అధికారులు సమర్థవంతంగా అడ్డుకట్ట వేసినట్లయితే ఇంత ఘోరం ఉండేది కాదని తెలుగుదేశం పార్టీ నేతలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

### రాష్ట్ర నేతగా గుర్తింపు :

తెలుగుదేశం పార్టీలో గ్రామ పంచాయతీ వార్డు మెంబరు స్థాయి నుండి అంచలంచలుగా ఎదిగి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు తో పాటు విద్యావాఖ మంత్రి లోకేష్‌తో మంచి సంబంధాలు ఏర్పరుచుకోవడంతో, ఆయన హత్యా అనంతరం ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు వివిధ స్థాయి నేతలు వీరయ్య చౌదరి కుటుంబానికి సానుభూతితో పాటు అండగా ఉంటామని హామీ ఇవ్వడం ఆయన ఏ స్థాయిలో ఎదిగారో అర్థమవుతుంది.

# ఘనంగా శ్రీ రాజర్షి భగీరథ మహర్షి జయంతి మహోత్సవం

**మార్కాపురం రూరల్, మే 4, ప్రభాతవార్త**





మార్కాపురం పట్టణంలోని స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం ఎదురుగా మార్కాపురం తర్లుపాడు రహదారి మార్గాన గల శ్రీ రాజర్షి భగీరథ మహర్షి విగ్రహం ఆవరణలో జయంతి మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి, జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్‌లు శ్రీ రాజర్షి భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలతో ఘనంగా సత్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగీరథుడు గంగను భువికి తీసుకువచ్చిన మహాముని, హిందూ సాహితనయంలో ఇక్షాకు వంశానికి చెందిన పురాణ రాజు. హిందూనది దేవత గంగగా వ్యక్తీకరించబడిన పవిత్రమైన గంగానదిని స్వర్గం నుంచి భూమి పైకి తపస్సు చేయడం ద్వారా తీసుకువచ్చిన మహర్షి భగీరథ మహర్షి అని తెలిపారు. తమ వంశీకులు పూర్వీకులు తపస్సు చేసిన ప్రయోజనం లేకపోయింది. చివరకు దిలీపుడు కుమారుడు భగీరథుడు ద్వారా సాధ్యం అయిందని అన్నారు. అనంతరం ఇమ్మడి కాశీనాథ్ గారి చేతుల మీదుగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించడం జరిగింది.

## నేటి నుండి వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి మహోత్సవ వేడుకలు

**సంతనూతలపాడు, మే 4, ప్రభాతవార్త**



సంతనూతలపాడు ఆర్యవైశ్య కళ్యాణ మండలంలోని శ్రీ సీతారామ వారి నిత్య భజన మందిరం నందు ఈనెల 5వ తేదీ నుండి వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవ వేడుకలు ఘనంగా జరగనున్నట్లు ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ అధ్యక్షులు వేమా మల్లేశ్వరరావు, సెక్రటరీ పబ్బిశెట్టి ఆంజనేయులు, ఉపాధ్యాక్షులు శిఘాకొల్లి సత్యనారాయణ, కోశాధికారి వేమా చిన్న వెంకట కృష్ణారావు, కమిటీ సభ్యులు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీ వరకు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి జయంతి మహోత్సవ వేడుకలు ఘనంగా జరగనున్నట్లు వారు వెల్లడించారు. 5వ తేదీన ఉదయం 9గంటలకు కలశ స్థాపన, గణపతి పూజ, అభిషేకం లు రాత్రి 7గంటలకు గీతా పారాయణం, 6వ తేదీన ఉదయం 9గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం 7గంటలకు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి లక్ష మల్లెల పూజ, 7వ తేదీ అమ్మవారి జయంతి వేడుకల్లో భాగంగా అభిషేకాలు, కుంకుమ పూజలు జరగనున్నాయి. వీటికి ప్రసాద దాతలుగా జి.నిరంజన్ బాబు, సీహెచ్ బ్రహ్మయ్య, కే.రాఘవరావు, పాదర్తి సతీష్ కుమార్, ముప్పల వెంకటేశ్వరస్వామిలు వ్యవహరిస్తున్నారు. ఈనెల 7వ తేదీన వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం 10గంటలకు సామూహిక కుంకుమ పూజలు జరగనున్నాయి. 7వ తేదీ బుధవారం మధ్యాహ్నం సంతనూతలపాడు వాస్తవ్యులైన విజయవాడకు చెందిన శిఘాకొల్లి పాండురంగారావు, అనసూయ, వారి కుమారులు సుందరేశ్వర్, రాధాకృష్ణలు ఆధ్వర్యంలో వందలాది మందికి అన్నదాన వేడుకలను ప్రతి ఏడాదిలో భాగంగా ఈ ఏడాది ఘనంగా నిర్వహించనున్నారు. ఈనెల 7వ తేదీన బుధవారం రాత్రి 6గంటలకు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్య మహిళలచే గ్రామోత్సవం నిర్వహించనున్నారు. కారంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన సారంగి ఎల్లయ్య, వీర ముష్టి బృందం ఆధ్వర్యంలో ఈ ప్రభ, దండకాలు, నారసాలు, వీరంగం వేడుకలు ఈ సందర్భంగా ఘనంగా జరగనున్నట్లు కమిటీ బృందం తెలిపారు. వీటికి ప్రసాద దాతలుగా కే.శేషయ్య, సీహెచ్ సుధాకర్‌లు వ్యవహరిస్తున్నారు.

# 9న పంచాయతీ రూములకు వేలం పాట

**టంగుటూరు, మే 4, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన టంగుటూరులోని పంచాయతీ రూమ్‌లకు, పంచాయతీ స్థలాలు వేలంపాట ఈనెల 9న నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు పంచాయతీకి ఏమి బాకీ ఉండకూడదని, ఇంటి పన్ను కుళాయి పన్ను బాకీ ఉండకూడదని, వాటిని క్లియర్ చేసుకోవాలని అన్నారు. అంతే కాకుండా ఎస్సీలు, బీసీలు కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు వేలం పాటకు తీసుకురావాలన్నారు. రూమ్‌లకైతే రూ.10వేలు డిపాజిట్, స్థలాలకైతే రూ.5వేలు డిపాజిట్ పాటకు వచ్చేవారు కట్టాలని తెలియజేశారు. ఈ నెల 9వ తేదీ 10గంటలకు పంచాయతీ కార్యాలయంలో జరిగే పాటకు ఈ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

# సమగ్ర సేద్యంతో సుస్థిర ఆదాయం

## - ప్రకృతి వ్యవసాయాధికారి వెంకటరావు



**టంగుటూరు, ప్రభాతవార్త**

గోఆధారిత, సేంద్రీయ సాగుతో పండించే పంటల ఆహార ఉత్పత్తులతోనే మానవాళికి ఆరోగ్య రక్షణ అని ప్రకృతి వ్యవసాయాధికారి వెంకటరావు అన్నారు. ఖరీఫ్ యాక్షన్ ప్లానింగ్‌లో భాగంగా మండలంలోని కొణిజేడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు గురించి లాభాల గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల గురించి యూనిట్ ఇన్‌ఛార్జి వెంకటరావు మాట్లాడుతూ రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకంతో పండించే పంటలతో తయారు చేసే ఆహార ఉత్పత్తులు విషపూరితమై మనషుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. ఆహార పదార్థాలను ఉత్పత్తి చేసి భవిష్యత్తు తరాలకు ముప్పు కలిగించవద్దని సూచించారు. సేంద్రీయ సాగు చేసిన ఉత్పత్తులకు బహిరంగ మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని, ఈ విధంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు గురించి లాభాల గురించి వివరించారు. వీఏఏ సౌమ్య మాట్లాడుతూ ప్రతి మహిళా రైతు ఇంటి దగ్గర స్థలంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకుని ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని తెలియజేశారు. యూనిట్ ఇన్‌ఛార్జి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యకరంగా ఉంటారని, రాబోయే రోజుల్లో ప్రకృతి వ్యవసాయమే ప్రధానమవుతుందని, రైతులు కూడా ప్రకృతి వ్యవసాయం చేయడానికి ముందుకు రావాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రైతు శ్రీనును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, యూనిట్ ఇన్‌ఛార్జి విజయలక్ష్మి, ఐసీఆర్‌పీలు పద్మావతి, కవిత, జోష్నా, శృతి, సుజాత, మరియమ్మ, రమాదేవి, త్రివేణి, హరిత పాల్గొన్నారు.

# పిడుగు పాటుకు వ్యక్తి మృతి

**నాగులుప్పలపాడు, మే 4, ప్రభాతవార్త**



ఈదుముడి గ్రామానికి చెందిన కొండపి నాగమల్లేశ్వరరావు (42) ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పిడుగుపాటుకు మృతి చెందాడు. ఆయన వ్యవసాయ భూమిలో గొర్రెలు మేపుతుండగా ఒక్క సారిగా కురిసిన వర్షంతో పాటు ఉరుములు మెరుపులతో పిడుగులు పడడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆయన దివ్యాంగుడు కావడంతో గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నాగులుప్పలపాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నేడు ఎమ్మెల్యే ముత్తుముల చేతుల మీదుగా వ్యవసాయ పనిముట్లు పంపిణీ

**గిద్దలూరు, మే 4 ,ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని రైతులకు నేడు సోమవారం సబ్సిడీపై వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు మరియు పచ్చిరొట్టె విత్తనాలను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖాధికారి విజయభాస్కర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు.

## జనసైనికురాలికి రక్తం ఇచ్చిన ఉమ్మడిశెట్టి శ్రీను

**పామూరు, మే4 ,ప్రభాతవార్త**

కనిగిరికి చెందిన జనసేన కార్యకర్త తలసేమియా వ్యాధితో బాధపడుతూ ప్రతి నెల దాతల ద్వారా రక్తం అందించుకునే ధీనస్థితిలో ఉందని తెలియగా బీజేపీ పామూరు మండల పార్టీ అధ్యక్షులు ఉమ్మడిశెట్టి శ్రీను నిరుపేద జనసేన కార్యకర్తకు రక్తం అందించారు. సేవా కార్యక్రమాల్లో జనసేన కార్యకర్తలు ముందుంటారని అది మా నాయకుడు పవన్ కల్యాణ్ చూపించిన మొట్టమొదటి అభిప్రాయంగా ఉమ్మడిశెట్టి శ్రీను తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఫ్రోగ్రాం కమిటీ కార్యదర్శి రామిశెట్టి సునీల్ కుమార్, మండల జనసైనికులు సోమిశెట్టి వీరాంజనేయులు, ల్యాబ్ టెక్నీషియన్ కోటపాటి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత వైద్య సేవకు దాతల సహాయం

**వేటపాలెం, మే 4, (ప్రభాతవార్త**



మండలంలోని పందిళ్లపల్లిలో గత 30 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరంకు వచ్చు పేషెంట్ల యొక్క సౌకర్యాల నిమిత్తం ఎన్ఆర్ఐ పల్లపోలు రమేష్ సుమారు 40 వేల రూపాయలు వచ్చించి ఆర్‌సీసీ రేకుల షెడ్డు, ఔషదాల భద్రతకు ఇనుప బీరువా, పేషెంట్లు కూర్చునేందుకు బల్లలు, వగైరాలను తన తల్లిదండ్రులు, పల్లపోలు శివరాం వెంకట సుబ్బరావమ్మల ఆధ్వర్యంలో నిర్మించినట్లు ఉచిత వైద్య శిబిర నిర్వాహకులు సుబ్బారావు ఎలియాస్ షారూక్ తెలిపారు. గ్రామ పెద్దలు ఊటుకూరు శ్రీమన్నారాయణ, డాక్టర్ బొగ్గుల బ్రహ్మం తదితరులు కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ డాక్టర్ బి.బ్రహ్మం మాట్లాడుతూ సేవా దృక్పథంతో మూడు దశాబ్దాలుగా సుబ్బారావు చేస్తున్న ఉచిత వైద్య సేవలు అభినందనీయమని అన్నారు. దాతలు అందించిన సహకారంతో పేదలకు వైద్య సేవలు అందించడం హర్షనీయమన్నారు. గ్రామ పెద్దలు ఊటుకూరు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఎంతో మంది మధుమేమ వ్యాధిగ్రస్తులు, ప్రమాదాల వలన గాయాలపాలైన వారికి ఉచిత సేవలందిస్తున్న సుబ్బారావు వలన పందిళ్లపల్లి గ్రామానికి మంచి పేరు లభిస్తుందని కొనియాడారు. పలువురు పేషెంట్లు తమకు అందుతున్న ఉచిత వైద్యం గురించి వివరించారు. ఈ సందర్భంగా సుబ్బారావును అభిమానులు దుశ్శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు, పేషెంట్లు పాల్గొన్నారు.

# డీవైడర్‌ను ఢీకొని యువకుడు మృతి

**వేటపాలెం, మే 4, (ప్రభాతవార్త**



చల్లారెడ్డిపాలెం చేనేతపురికి చెందిన 18 సంవత్సరాల బుజ్జి బాబు బైక్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు డివైడర్‌ను ఢీకొని తీవ్ర గాయాలకు గురయ్యాడు. వెంటనే చికిత్స నమిత్తం హాస్పిటల్‌కు తరలించగా చికిత్స సమయంలో బుజ్జిబాబు మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. బుజ్జిబాబు తండ్రి దిలీప్ వివరణ ఇస్తూ తన కుమారుడు కొత్తగా నిర్మాణంలో ఉన్న డిమార్ట్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడని టాబ్లెట్ల కోసం నూలు మిల్లు సెంటర్ మెడికల్ స్టోర్‌కి వెళ్ళగా ఈ ప్రమాదం జరిగిందని చేతికి అంది వచ్చిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని తమకు ఇంక దిక్కు ఎవరని కన్నీరు పర్యంతమయ్యారు. వేటపాలెం పోలీసు స్టేషన్ నందు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ నవ్వుల దినోత్సవం

**వేటపాలెం, మే 4, (ప్రభాతవార్త**



చీరాల ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా జీవితంలో ఆనందానికి ఆరోగ్యానికి నవ్వు ఔషదం జీవితంలో ఒత్తిడి తగ్గించుకోవడానికి నవ్వు ఒక ఆయుధం అని వాకింగ్ సభ్యులకు తెలియజేసి నవ్వుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మా సభ్యులు గోలి మల్లిఖార్జునుడు, ముంగిర శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా 9వ రోజు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమంనకు రూ.4200లు కోటయ్య అనాధ వృద్ధాశ్రమానికి ఒక బస్తా బియ్యం అందజేశారు. హైస్కూల్ గ్రౌండ్ నందు 19 రోజుల నుండి వాకర్స్ క్రీడాకారుల దాహం తీర్చుటకు మంచి నీటి క్యాన్లు అసోసియేషన్ తరుపున ఏర్పాటు చేయుచున్నాము. నవ్వుల దినోత్సవం సందర్భంగా సభ్యులకు పండ్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, చారగుళ్ల గురు ప్రసాద్, గ్రంధి నారాయణమూర్తి, వీరాంజనేయులు, శ్రీరాం రమేష్, పూర్ణ చంద్రరరావు, డీవీ సురేష్, రమేష్, కృష్ణ, పూర్ణ చంద్రరరావు, ప్రసాద్, నారాయణ, చెంగలరాయుడు, శ్రీనివాసరావు, శివాంజనేయ ప్రసాద్, మల్లిఖార్జునుడు, వాకింగ్ మిత్రులు పాల్గొన్నారు.

## ఈదురు గాలులకు విరిగిపడిన వృక్షాలు, ఫ్లెక్సీలు





**టంగుటూరు, మే 4, (ప్రభాతవార్త**

మండల కేంద్రమైన టంగుటూరులో ఆదివారం నాడు గాలి వాన కురిసింది. ఈదురు గాలులకు ఫ్లెక్సీలు, వృక్షాలు విరిగిపడి రోడ్లకు అడ్డంగా పడ్డాయి. గాలివానకు భారీ ఎత్తున దుమ్ము లేచి వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. కురిసిన వానకు రహదారుల మీద నీళ్లు నిలబడి కొండపి రోడ్డులో వాహనదారులకు విరిగిన చెట్లు ఆటంకంగా మారాయి. చెట్టును పక్కకు లాగేసి వాహనదారులు, పాదచారులు వెళ్లిపోయారు. ప్రమాదం తప్పిందని అంటున్నారు.

# తాగి వేధిస్తున్నాడని భర్తను హత్య చేసిన భార్య

**కంభం రూరల్, మే 4, (ప్రభాతవార్త**







మద్యం త్రాగి వచ్చి తనను వేధిస్తున్నాడని భర్తను భార్య హత్య చేసిన ఘటన కంభం పట్టణంలోని స్థానిక కాపా వీధిలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు శనివారం పూటుగా మద్యం తాగి వచ్చిన షేక్ వలి (45) భార్యతో గొడవ పెట్టుకొని చంపేందుకు ప్రయత్నించాడు. కోపంతో ఊగిపోయిన భార్య రిజ్వాన భర్త మెడకు టవల్ బిగించి హతమార్చింది. తర్వాత నిందితురాలు భర్తది సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. పోలీసుల విచారణలో రిజ్వాన హత్య చేసినట్లు గుర్తించి ఆదివారం పోలీసులు నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలాన్ని మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు, కంభం సిఐ మల్లికార్జున, కంభం ఎస్సై బి నరసింహారావు చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కాపురం డిఎస్పీ నాగరాజు మాట్లాడుతూ దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.


## దివ్యాంగుడికి పెన్షన్ హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి

**మార్కాపురం రూరల్, మే 4 (ప్రభాతవార్త**



మార్కాపురం పట్టణంలో కందుల నారాయణ రెడ్డి కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆదివారం ఓ హృదయ సంఘటన చోటుచేసుకుంది. సమావేశం మధ్యలో ఓ దివ్యాంగుడు తన సమస్యను చెప్పేందుకు వచ్చినట్లు కార్యకర్తలు తెలియజేయడంతో, ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి తానే స్వయంగా వచ్చి దివ్యాంగుడిని కలిసి అతని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగుడి ఆవేదనను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి త్వరలోనే అతనికి పెన్షన్ మంజూరు అయ్యేలా అన్ని ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దివ్యాంగుడి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# కదిరి బాబురావుని మర్యాదపూర్వకంగా కలిసిన దద్దాల



**కనిగిరి, మే 4, (ప్రభాతవార్త**

వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంటు పరిశీలకులుగా మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు నియమితులైన సందర్భంగా శనివారం హైదారాబాద్‌లో కనిగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవుల భాస్కర్‌రెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# అచ్చాల శశిరరెడ్డిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఉగ్ర



**కనిగిరి, మే 4, (ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని కొత్తూరు అచ్చాల నాగిరెడ్డి, రామ సుబ్బులు మనుమరాలు అచ్చాల రవి, తిరుపతమ్మల కుమార్తె అచ్చాల శశిర రెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి దీవించారు. ఆదివారం కొత్తూరులో జరిగిన అచ్చాల వారి ఓణీల వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా బంధుమిత్రులు పట్టణ ప్రజలు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు, వైద్యులు, న్యాయవాదులు, కొత్తూరు తెలుగుదేశం పార్టీ నాయకులు ఉండేల శ్రీనివాసరెడ్డి, తమ్మనేని సురేంద్రరెడ్డి, కిరణ్, రవి, శ్రీకాంత్ పాల్గొని చిన్నారిని దీవించారు.

# ఇన్‌ఛార్జీ దద్దాలను సన్మానించిన తమ్మినేని సుజాత



**కనిగిరి, మే 4, (ప్రభాతవార్త**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం జనరల్ సెక్రటరీగా ఇటీవల నియమితులైన తమ్మినేని సుజాతరెడ్డి శనివారం వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె దుశ్శాలువాతో సత్కరించి, పూలబొకే అందజేశారు. తదుపరి ఆమె మాట్లాడుతూ తనను ఈ పదవికి ఎంపిక చేసిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంటు ఇన్‌ఛార్జీ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇంతటి అవకాశాన్ని కల్పించిన ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్‌కు, కనిగిరి నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని, దద్దాల నారాయణ గెలుపు కోసం సంపూర్ణంగా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాలంటీర్ విభాగం జనరల్ సెక్రటరీ ఆవుల భాస్కర్‌రెడ్డి, సైకం సర్పంచ్ స్వర్ణ ఏడుకొండలురెడ్డి, చోడవరం సర్పంచ్ ఎలిక నరేంద్ర, తమ్మినేని ఉమా శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని

# సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించండి

**- ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి**



**పామూరు, మే 4, (ప్రభాతవార్త**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ప్రజలందరూ సంపూర్ణఆరోగ్యవంతులుగా జీవించాలని మండల అధ్యక్షురాలు గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి కోరారు. మండలంలో దూబగుంట పంచాయతీ పరిధిలోని పడమటపల్లి ఎస్సీ కాలనీలోని ప్రజలకు తడి, పొడి చెత్త సేకరించి చెత్త సంపదకు తరలించేందుకు అవసరమైన బకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుళ్లిన ఇతర పచ్చి వ్యర్థాలను చెత్తాచెదారాన్ని వేర్వేరుగా రెండు డబ్బాల్లో వేసి ఇళ్ల వద్దకు వచ్చే చెత్త వాహనాల్లో వేయాలని, తద్వారా పంచాయతీకి ఆదాయం పెరగడమే కాక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చన్నారు. ఇంటి పక్కనే పేడదిబ్బలు, మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పంచాయతీ ఉప సర్పంచ్ కందుల శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యార్థులను తల్లిదండ్రులు ఎక్కడికి పంపించవద్దని, ఆకతాయిలు చెరువులు, కుంటల్లోకి వెళ్లి ప్రమాదాలను కొనితెచ్చుకుంటారని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ గ్రీవెన్స్ కార్యదర్శి గట్ల విజయభాస్కర్‌రెడ్డి, కందుల శివరామిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, విశ్రాంతమ్మ, గురవయ్య, సాల్మన్, రాజా తదితరులు పాల్గొన్నారు.

# నీటి యుజీ పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు

## ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

**చీరాల, మే4 ,(ప్రభాతవార్త**





చీరాల పట్టణంలోని యార్లగడ్డ అన్నపూర్ణమ్మ ప్రభుత్వ మహిళ కళాశాలను ఆదివారం జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడిలు సందర్శించారు. కళాశాలలో నిర్వహిస్తున్న నీట్ యుజీ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. అభ్యర్ధి అడ్మినిస్ట్రేషన్ విభాగాన్ని విద్యార్థులను తనిఖీ చేసి విధానాన్ని, సీసీ కెమెరాలు అనుసంధానించిన విభాగాన్ని పరిశీలించారు. అబ్జర్వర్లు, కోఆర్డినేటర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి విద్యార్థులకు చేసిన ఏర్పాట్ల గురించి పరీక్ష విధానాల గురించి చర్చించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్ల గురించి పోలీసు అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నీట్ యూజీ పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యార్లగడ్డ అన్నపూర్ణమ్మ ప్రభుత్వ మహిళ కళాశాలలో మొత్తం రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటిలో మొత్తం 416 మంది విద్యార్థులను నేషనల్ ఎంట్రన్స్ ఎగ్జామిషన్ టెస్ట్ రాయడానికి కేటాయించడం జరిగిందన్నారు. పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఎవరు గుంపులుగా సంచరించకుండా పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ (144 సెక్షన్) విధించి, కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు మూసివేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. పరీక్ష సెంటర్ వద్ద డీఎఫ్ఎండీలు, హెచ్ఎఫ్ఎండీలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్క అభ్యర్థిని బీడీ టీమ్‌తో తనిఖీ చేయించడం జరిగిందన్నారు. హాల్ టికెట్‌లు,అడ్మిట్ కార్డులు ఉన్న అభ్యర్థులను ఎగ్జామిషన్ సెంటర్లోకి అనుమతించడం జరిగిందన్నారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళితో కలిసి అభ్యర్థి అడ్మినిస్ట్రేషన్ విభాగాన్ని విద్యార్థులను తనిఖీ చేసే విధానాన్ని సీసీ కెమెరాలు అనుసంధానించిన విభాగాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. అబ్జర్వర్లు, కోఆర్డినేటర్లతో విద్యార్థులకు చేసిన ఏర్పాట్ల గురించి, పరీక్ష విధానాల గురించి చర్చించడం జరిగిందన్నారు. పరీక్ష ముగిసిన అనంతరం పేపర్లను తరలించేందుకు కట్టుదిట్టమైన పోలీసు భద్రతను ఏర్పాటు చేశామన్నారు.

## సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి రోజూ పది వేల అడుగుల నడక





**ఒంగోలు టౌన్, (ప్రభాతవార్త**

శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక రంగారాయుడు చెరువు వాకింగ్ ట్రాక్ మీద ఈ రోజు ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు ప్రముఖ ఎముకలు మరియు కీళ్ల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలియజేశారు. ప్రతి నెల మొదటి ఆదివారం ఉదయం రంగా రాయుడు చెరువు మీద గాంధీ విగ్రహం వద్ద జరుగు ఈ వైద్య శిబిరంలో భాగంగా ఈ రోజు జరిగిన ఈ వైద్య శిబిరంలో సుమారు 250 మందికి ఉచితంగా బిపి, షుగర్, హెచ్‌బి పల్స్‌ాక్షి మీటర్ పరీక్షలు, పాదాల నరాల స్పర్శ పరీక్ష ఉచితంగా నిర్వహించి, ప్రముఖ జనరల్ మెడిసిన్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ సానల ధీరజ్ బాబు గారిచే తగిన వైద్య సలహాలు, సూచనలు అందజేయడం జరిగింది. డాక్టర్ సానల ధీరజ్ బాబు మాట్లాడుతూ సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ రోజూ పది వేల అడుగులు నడవాలని సూచించారు. అలాగే షుగర్ ను ఎలా నియంత్రించుకోవాలి, ఆహార సమతుల్యత ఎలా పాటించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజు 45 నిమిషాలు వ్యాయామం చేయడం వలన శారీరకంగా మరియు మానసికంగా ఆరోగ్యకరంగా ఉండవచ్చుని,వ్యాయామం ఎక్కువగా కండరాలను, రక్త ప్రసరణ వ్యవస్థను మెరుగు పరచడానికి, అధిక బరువు తగ్గించుకోవడానికి, మానసిక ఉల్లాసం పెంపొందించుకోవడానికి ఉపయోగపడుతుందని అలాగే క్రమం తప్పకుండా చేసే వ్యాయామం వలన మన శరీరపు వ్యాధినిరోధక శక్తి పెంపొందుతుందని, గుండెకు సంబంధించిన వ్యాధులు, స్థూలకాయం, మధుమేహం వంటి వ్యాధులు రాకుండా నిరోధిస్తుందని తెలియజేశారు. ప్రతినెల మొదటి గురువారం శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు అన్ని మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలకు ఉచితంగా ఓపి, బిపి షుగర్, ఈసీజీ, థైరాయిడ్ పరీక్షలు, గర్భిణీ స్త్రీలకు స్కానింగ్, ఎముకల పట్టుత్వ సాంద్రత పరీక్ష, ఊపిరితిత్తుల సామర్థ్యపు పరీక్ష, యూరిక్ ఆసిడ్, పాదాల నరాల స్పర్శ పరీక్ష ఉచితంగా చేయబడును అని తెలియజేశారు. ప్రకాశం జిల్లా ప్రజలు ఈ వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కొప్పోలు సామిత్ర పల్లవ్, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గోపి, అనిల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తపట్నంలో సర్వాంగ సుందరంగా సరస్వతి నిలయం

**- హెచ్ఎం శ్రీదేవి చొరవతో పాఠశాలలో వసతుల కల్పన**

**- సంపూర్ణంగా ఉపాధ్యాయులు గ్రామస్తులు సహకారం**

**- అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం**

**కొత్తపట్నం, (ప్రభాతవార్త**





కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అతికొద్ది కాలంలోనే ప్రధానోపాధ్యాయురాలు ఎం శ్రీదేవి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఉపాధ్యాయులు గ్రామస్తుల సహకారంతో పాఠశాలకు పూర్తిస్థాయిలో మోలిక వసతులు కల్పించింది. ప్రజా ప్రతినిధులు జిల్లా అధికారులు నేతృత్వంలో పాఠశాలకు హెచ్ఎం వసతులను ఏర్పాటు చేయించ గలిగారు. 21.01.2002.లో స్కూల్ అసిస్టెంట్ బయాలజీ ఉపాధ్యాయునిగా చేవూరులో బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పొందూరు, కందుకూరు, కొత్తపట్నం స్కూల్ నందు ఇన్ఛార్జి హెచ్ఎంగా పనిచేస్తూ పరిపాలన నందు పూర్తిస్థాయిలో పట్టు సాధించారు. నవంబర్ 2023న కొత్తపట్నం హైస్కూల్ ఎఫ్ ఎ సి హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టారు. జిల్లాలోని 1450 మంది విద్యార్థులతో ప్రథమ స్థానంలో ఉన్న హై స్కూల్ కు అనేక అరకొర వసతులతో కొట్టుమిట్టాడు తుండేది. వాటిని అధిగమించి పరిస్థితులు చక్క దిద్దడంలో సాధ్యమైనంత వరకు సఫలీకృతు లయ్యారని గ్రామస్తుల సమాచారం. వివిధ కారణాలతో నిలిచిపోయిన నాడు నేడు పనులు 27 లక్షలతో పూర్తి చేయించారు. పాఠశాల ఆవరణలో మూడు లక్షల రూపాయలతో గ్రామస్తులు ఉపాధ్యాయులను ప్రోత్సహించి గ్రామంలో వర్షపు నీరు స్కూల్లోని కి రానీయకుండా గేటు ఎత్తు పెంచడం, సరస్వతి విగ్రహానికి మరమ్మతులు చేయించడం, 200 మీటర్లు మేర నాపరాలు వేయించడం చేయించారు. పీఎం శ్రీ క్రింద 4:30 లక్షల రూపాయలతో 200 మీటర్లు, 100 మీటర్లు,వాలీబాల్ కోర్ట్ పనులు హెచ్ఎం హయాంలోనే జరిగాయి. 2024 విద్యా సంవత్సరం ప్రారంభంలో క్రీడా విభాగం నందు రాష్ట్ర స్థాయి ఫుట్బాల్ (హిందూపూర్) కబడ్డి (బాపట్ల) సాఫ్ట్బాల్ (గుంటూరు) కరాటే (అనంతపురం)కు విద్యార్థులను పంపి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. 2023 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాల్లో 80 శాతం, 2024 నందు 88 ఉత్తీర్ణత సాధించి విద్యార్థులు తల్లిదండ్రుల, జిల్లా అధికారుల మన్ననలను పొందగలిగారు. పాఠశాలలో విద్యుత్ అసౌకర్యం కలుగుతుంటే అధికారులను సంప్రదించి పవర్ సప్లై ఆటంకం కలగ నివ్వకుండా మూడున్నర లక్షల విలువచేసే ట్రాన్స్ఫార్మర్ను ఉచితంగా అధికారుల చే మంజూరు చేయించడంలో సఫలీకృతులయ్యారు. మెగా పేరెంట్స్‌డేకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అధ్యక్షతన పాఠశాల సమస్యలు దృష్టికి తీసుకుని వెళ్లి విద్యార్థులు తాగునీటి కు ఇబ్బంది పడుతున్నారని తెలియజేయగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ నేతృత్వంలో దేవి సీఫుడ్ సహకారంతో మూడున్నర లక్ష విలువచేసే ఉచిత ఆరో ప్లాంట్ ను బిగించడం జరిగింది. డ్రాప్ ఔట్స్ సంఖ్య తగ్గించడం కోసం ఉపాధ్యాయులను కమిటీలు గా నియమించి గ్రామాల్లో నికి పంపించి విద్యార్థులను బడికి వచ్చే విధంగా చేయించ గలిగారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాల తనిఖీ సమయంలో మధ్యాహ్న భోజన పథకం, నిర్వహణ తీరు సంతృప్తి ని పరిచింది. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ నేతృత్వంలో పార్టీ నాయకులు ఆధ్వర్యంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించి గ్రామస్తులు అధికారులు పొందగలిగారు. కొన్ని సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న విద్యుత్ బకాయి 1,40,000 ను ప్రభుత్వం మంజూరు చేసి విద్యుత్ శాఖ అధికారులకు బిల్లు చెల్లించడం ఈ హెచ్ఎం హయాం లో జరగడం విశేషం. విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచి సమయానికి పాఠశాలకు హాజరయ్యే విధంగా విద్యార్థులలో మార్పు తీసుకు రాగలిగారు. పాఠశాలలో 52 మంది ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ వారందరినీ ఐకమత్యంగా ఉంచి వారి సహకారం ఎస్ ఎం సి ఛైర్మన్ వంశీకృష్ణా రెడ్డి సహకారంతో ఇలాంటి పొరపాట్లు లేకుండా ఈ రెండు సంవత్సరాల పాటు ఎఫ్ఎసి హెచ్ఎం మనం శ్రీదేవి పాఠశాలను అన్ని హంగులతో తీర్చిదిద్దడంలో సఫలీకృత మయ్యారని గ్రామస్తుల, పూర్వ విద్యార్థులు తల్లిదండ్రులు నుండి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరైన వైసీపీ శ్రేణులు

**పామూరు, మే 4, (ప్రభాతవార్త**

మండలంలోని దూబగుంట పంచాయతీ పరిధిలో బత్తువారిగృహ ప్రవేశ కార్యక్రమానికి ఎంపీపీ గంగసాని లక్ష్మీహుస్సేన్‌రెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కందుల శ్రీనివాసులురెడ్డి, కందుల శివరామిరెడ్డి, మస్తాన్ రెడ్డి తదితులు హాజరయ్యె సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నూతన గృహ ప్రవేశం గావించిన దంపతులకు పట్టువస్త్రాలను సమర్పించారు.



5-5Pg5exJ.qxd:5-5Pg5exJ.qxd 05/05/25 12:03 AM Page 1



# భారత్ నౌకలను అనుమతించబోం

## ప్రతీకార చర్యలకు దిగుతున్న పాకిస్థాన్



**లాహోర్, మే 4:** పహల్గాంలో ఉగ్రవాద దాడి తర్వాత భారత్, పాకిస్థాన్ల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కూడా పెరుగుతున్నాయి. పొరుగు దేశంతో వాణిజ్య సంబంధాలను తెంచుకునే దిశగా భారత్ అడుగులు వేస్తున్నది. ఇప్పటికే పాక్ నుంచి ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, ఆ తర్వాత పొరుగు దేశ నౌకలను భారత్‌లోని ఓడరేవుల్లోకి అనుమతించకూడదని నిర్ణయించింది. అయితే కాస్త ఆలస్యంగా పాకిస్థాన్ మరో నిర్ణయం తీసుకుంది. భారత్‌కు చెందిన నౌకలను తమ ఓడరేవుల్లోకి అనుమతించబోమని నిర్ణయించింది. పొరుగు దేశంతో సముద్ర సార్వభౌమత్వం, ఆర్థిక ప్రయోజనాలు, జాతీయ భద్రతను కాపాడటానికి పాక్ తక్షణమే పలు చర్యలను అమలు చేస్తుంది. భారత నౌకలను పాక్ ఓడరేవుల్లోకి వచ్చేందుకు అనుమతులు లేవు అంటూ సముద్ర వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాలను జారీ చేసింది. భారత వాణిజ్య మంత్రిత్వశాఖ పాక్ నుంచి వచ్చే దిగుమతులపై నిషేధం విధిస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదల చేసింది. పాకిస్థాన్ నుంచి మన దేశానికి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది. పాకిస్థాన్‌తో సముద్ర రవాణా మార్గాలను భారత్ మూసివేసింది. మర్చెంట్ షిప్పింగ్ చట్టం, 1958లోని 411 సెక్షన్ ప్రకారం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని వెల్లడించింది. భారత ఓడలు కూడా పాక్ పోర్టుల్లోకి వెళ్లకూడదని స్పష్టం చేసింది. మరో వైపు ఆ దేశం నుంచి భారత్‌కు వివిధ మార్గాల్లో వచ్చే అన్నిరకాల ఉత్తరాలు, పార్సిళ్ల రవాణాను కూడా నిలిపివేస్తున్నట్లు తపాలా శాఖ ప్రకటించింది. 2019లో పుల్వామా ఉగ్రదాడి తర్వాత పాక్ దిగుమతులపై 200% సుంకాన్ని కేంద్రం విధించింది. దాంతో అవి చాలావరకు తగ్గిపోయాయి. పహల్గాం ఉగ్రదాడి, సరిహద్దుల్లో కవ్వింపు చర్యల నేపథ్యంలో ఇప్పుడు ఇతర దేశాల మీదుగా పాక్ నుంచి వచ్చే దిగుమతుల్ని సైతం నిలిపివేసింది. దీంతో భారత్‌కు ఎగుమతులపైనే ఆధారపడుతున్న పాక్‌లోని కొన్ని పరిశ్రమలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉండడం వల్ల ఆ దేశం ప్రతీకార చర్యలకు పాల్పడుతోంది.

# సింగపూర్ ప్రధానిగా మళ్లీ లారెన్స్ వాంగ్



**సింగపూర్, మే 4:** ప్రపంచంలో ఆర్థిక అనిశ్చితులు నెలకొన్న సమయంలో సింగర్‌పూర్‌లో జరిగిన ఎన్నికల్లో అధికార పీపుల్స్ యాక్షన్ పార్టీ (పీఏపీ) మరోసారి ఘన విజయం సాధించింది. అక్కడ జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాని లారెన్స్ వాంగ్ నేతృత్వంలో భారీ గెలుపును సొంతం చేసుకుంది. దీంతో ప్రధానిగా మరోసారి ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. సింగపూర్ పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8గంటల వరకూ జరిగింది. దాదాపు 26 లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ దేశంలో ఓటేయడం తప్పనిసరి. అనంతరం రాత్రి జరిగిన ఓట్ల లెక్కింపులో పీఏపీ తిరుగులేని విజయం సాధించింది. సింగపుర్ పార్లమెంటులో మొత్తం 98 సీట్లుండగా 5 చోట్ల ఇప్పటికే పీఏపీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికలు జరిగిన 93 సీట్లలో 82 చోట్ల ఆ పార్టీ విజయం సాధించి మొత్తం 87సీట్లను గెలుచుకుంది. ప్రతిపక్ష వర్కర్స్ పార్టీ 10 సీట్లలో గెలిచింది. 66 ఏళ్లుగా సింగపూర్‌లో పీఏపీనే అధికారంలో కొనసాగు తోంది. గత ఏడాది సింగపూర్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన లారెన్స్ వాంగ్ (52) తన నేతృత్వంలో జరిగిన తొలి ఎలక్షన్‌లో పట్టును నిరూపించుకున్నారు. అమెరికాలో శిక్షణపొందిన ఈ ఆర్థికవేత్త సింగపూర్ ఆర్థిక మంత్రిగానూ సేవలందిస్తున్నారు. సింగపూర్ సార్వత్రిక ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో విజయం సాధించిన లారెన్స్ వాంగ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఆయనతో కలిసి పనిచేయడం కొనసాగించాలని ఎదురుచూస్తు న్నట్లు చెప్పారు. భారత్, సింగపుర్ మధ్య బలమైన, బహుముఖ భాగస్వామ్యాన్ని పంచుకుంటాయి అని అన్నారు. 97 పార్లమెం టరీ స్థానాల్లో 87 స్థానాలను గెలుచుకుంది పీఏపీ. సింగపూర్‌లో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది.



## పాక్‌కు రహస్య సమాచారం లీక్ చేసిన ఇద్దరి అరెస్టు

**అమృత్‌సర్, మే 4:** అమృత్‌సర్‌లో భారత ఆర్మీ కంటోన్మెంట్ ప్రాంతాలు, వైమానిక స్థావరాలకు సంబంధించిన అత్యంత సున్నితమైన సమాచారం, ఫొటోలను పాకిస్థాన్‌కు చేరవేస్తున్న ఇద్దరు వ్యక్తులను పంజాబ్‌లోని అమృత్‌సర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిని పాలక్ షేర్ మసిహ్, సూరజ్ మసిహ్‌లుగా గుర్తించారు. వీరు పాక్‌లోని ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌లతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాథమిక దర్యాప్తు సమాచారం ప్రకారం హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ పిట్టు అలియాస్ హ్యాపీ సూచనల మేరకు వీరు పని చేస్తున్నట్లు తేలింది. ప్రస్తుతం హర్‌ప్రీత్ సింగ్ అమృత్‌సర్ జైల్లో ఉన్నాడు. వీరి వద్ద అత్యంత సున్నితమైన విజువల్స్ తోపాటు, డేటా ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. అధికార రహస్యాల చట్టం కింద వీరిపై కేసులు పెట్టారు. దర్యాప్తు ముందుకు సాగే కొద్దీ మరిన్ని విషయాలు బయటపడవచ్చని, ఇంకొన్ని అరెస్టులు ఉండొచ్చని పోలీసులు చెబుతున్నారు.

# ఇమ్రాన్, భుట్టోల ఎక్స్‌ఖాతాలు నిలిపివేత



**న్యూఢిల్లీ, మే 4:** పహల్గాం దాడి తర్వాత పాక్‌పై భారత్ అనేక చర్యలు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా తాజాగా పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఆ దేశ విదేశాంగ మాజీ మంత్రి పిపిపి చీఫ్ బిలావల్ భుట్టోల ఎక్స్‌ఖాతాలను నిలిపివేసింది. పహల్గాం ఉగ్రదాడితర్వాత జమ్ముకాశ్మీర్‌పై వారు తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని కేంద్రం నిలిపివేతకు ఆదేశించింది. ఇటీవలే పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా మహ్మద్ ఆసిఫ్ ఎక్స్‌ఖాతాను భారత్ నిలిపివేసింది. పాక్ కేంద్రంగా నిర్వహిస్తున్న 16 యూట్యూబ్ ఛానళ్లపైనా వేటు వేసింది. పహల్గాం ఉగ్రదాడిపై ఇటీవల ఇమ్రాన్‌ఖాన్ మీడియాతో మాట్లాడుతూ ఇది చాలా విషాదకర సంఘటన అన్నారు. కాశ్మీర్‌పరంగా భారత్ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రేలాపనలు చేసారు. ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ పాక్‌పై దాడులకు దిగితే గట్టిగా బదులిస్తామని హెచ్చరించారు. పాక్‌మాజీ విదేశాంగమంత్రి భిలావల్‌భుట్టో సైతం ఇదేవిధంగా నోరుపారేసుకున్నారు. సింధూజలాలు ప్రవహించకపోతే రక్తం పారుతుందని రెచ్చగొట్టే వ్యాఖ్యలుచేసారు. సింధూనది తమదేనని ఆ నాగరికతకు నిజమైన సంరక్షకులం తామేనంటూ భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు.ఈదాడితో పాక్, భారత్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. పాక్ సీమాంతర ఉగ్రవాదం విడిచిపెట్టేవరకూ ఆదేశంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించిన భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకొని పాక్ జాతీయులను దేశం నుంచి వెళ్లగొట్టింది.

## ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడి ఢిల్లీ-టెల్‌అవీవ్ విమానం అబుదాబీకి



**టెల్‌అవీవ్, మే 4:** ఇజ్రాయెల్‌లోని కీలక నగరమైన టెల్ అవీవ్ శివారులోని బెన్ గురియన్ విమానాశ్రయం సమీపంలో క్షిపణి దాడితో ఎయిరిండియా అధికారులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీ నుంచి టెల్‌అవీవ్‌కు వెళ్తున్న ఎయిరిండియా విమానాన్ని అధికారులు అబుదాబీకి మళ్లించారు. ఎయిర్ ఇండియాబోయింగ్ 787 విమానం ఎఐ 139 టెల్‌అవీవ్‌లో ల్యాండ్ కావడానికి దాదాపు గంట ముందు ఈ దాడి జరగడంతో దారి మళ్లించినట్లు సమాచారం. ఈ విమానం తిరిగి ఢిల్లీకి వచ్చేస్తుందని సదరు వర్గాలు పేర్కొన్నాయి. ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌రాడార్ 24.కామ్ ప్రకారం అబుదాబీకి మళ్లించాలని నిర్ణయం తీసుకున్న సమయానికి ఈ విమానం జోర్డాన్ గగనతలంలో ఉంది. తాజా పరిణామాల నేపథ్యంలో టెల్‌అవీవ్ నుంచి ఢిల్లీకి ఆది వారం రావాల్సిన ఎయిరిండియా విమానం రద్దయింది.

**టెల్ అవీవ్‌కు ఎయిరిండియా విమాన సర్వీసులు రద్దు:** మరోవైపు, టెల్‌అవీవ్‌లో తాజా పరిణామాల నేపథ్యంలో మే 6 వరకు విమాన సర్వీసులు రద్దు చేస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. వినియోగదారులు, సిబ్బంది భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. తమ ఉద్యోగులు కస్టమర్లకు సహాయం చేస్తూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో వారికి సహాయం చేస్తున్నట్లు పేర్కొంది. మే 4 నుంచి 6 మధ్య ప్రయాణాలకు టికెట్లు బుక్ చేసుకున్న వారికి పూర్తి మొత్తాన్ని రిఫండ్ చేస్తా మని 'ఎక్స్'లో పేర్కొంది.ఇతర సమాచారం కోసం 011-69329333, 011-69329999 నంబర్లు లేదా తమ అధికారిక వెబ్‌సైట్ ఎయి రిండియా.కామ్‌ను సంప్రదించవచ్చని సూచించింది.

**అంతకు ఏడురెట్లు బలంగా దెబ్బ కొడతాం: ఇజ్రాయెల్ రక్షణ మంత్రి:** యెమెన్ నుంచి హూతీ తిరుగుబాటుదారులు ప్రయోగించిన క్షిపణి ఆదివారం ఉదయం బెన్ గురియన్ విమానాశ్రయం ప్రధాన టెర్మినల్ సమీపంలో కూలినట్లు ఇజ్రాయెల్ అధికారులు వెల్లడించారు. ఈ క్షిపణి దాడి సమీపంలో టెల్ అవీవ్ శివారులో ఉన్న విమానాశ్రయం సమీపంలో దట్టమైన పొగలు అలముకున్నట్లు ఉన్న వీడియో ఫుటేజీలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఈ క్షిపణి దాడి నేపథ్యంలో టెల్ అవీవ్‌లోని విమానాశ్రయానికి విమాన రాకపోకలు నిలిపివేశారు. ఈ క్షిపణి దాడిలో ఆరుగురికి గాయాలైనట్లు సమాచారం. ఈ ఘటనపై ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ మాట్లాడుతూ తమపై దాడిచేసిన వారికి.. అంతకు ఏడు రెట్లు బలంగా దెబ్బతీస్తామని హెచ్చరించారు.

# బలూచ్ ఆర్మీతో పాకిస్థాన్‌కు వణుకు



**ముజఫరాబాద్, మే 4:** భారత్ తమపై ఎక్కడ యుద్ధానికి దిగుతుందోనని భయపడిపోతున్న పాకిస్తాన్‌కు మరో షాక్ తగిలింది. బలూచ్ లిబరేషన్ ఆర్మీ దాడులతో పాకిస్తాన్ ఆర్మీ అల్లాడిపోతోంది. కొన్ని రోజుల క్రితం పాక్ సైనికులు వెళుతున్న ట్రైన్‌ని హైజాక్ చేసిన బలూచ్ లిబరేషన్ ఆర్మీ తాజాగా బలూచిస్తాన్‌లో ఓ టౌన్‌ని కూడా స్వాధీనం చేసుకుంది. బీఎల్‌ఏ వరుస దాడులతో బలూచిస్తాన్‌పై పాకిస్తాన్ నియంత్రణ కోల్పోతోంది. తాజా దాడిలో పాక్ సైనికులను బంధించి మంగుచోర్ పట్టణాన్ని బీఎల్‌ఏ స్వాధీనం చేసుకుంది. బలుచిస్తాన్‌ను ప్రత్యేక దేశంగా ప్రకటించాలని బీఎల్‌ఏ పోరాడుతోంది. ఇప్పటికే బీఎల్‌ఏ దాడుల్లో వందలాదిమంది పాక్ సైనికులు మృతి చెందారు. సొంతదేశంలో నిరసనకారుల నుంచి ఓ పట్టణాన్ని కాపాడుకోలేక పోయిన పాక్ భారత్‌పై మాత్రం దాడులకు వెనుకాడబోం అంటూ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. పాకిస్తాన్‌లోని నైరుతి ప్రాంతమే బలూచిస్తాన్. ఇది పాక్‌లో ఒక ప్రావిన్స్‌గా ఉంది. పాకిస్తాన్ మొత్తం విస్తీర్ణంలో 44 శాతం బలూచిస్తాన్ ఉంటుంది. విస్తీర్ణం పరంగా పాకిస్థాన్‌లో అతి పెద్ద ప్రావిన్స్‌గా బలూచిస్తాన్ ఉంది. అలాగే మిగతా అన్ని ప్రావిన్స్‌లో కెల్లా అతి తక్కువ జనాభా ఉన్న ప్రావిన్స్ కూడా బలూచిస్తానే. బలూచిస్తాన్‌లో చమురు, బొగ్గు, బంగారం, రాగి, సహజ వాయు వు వనరులు పుష్కలంగా ఉన్నాయి. బ్రిటిష్ ఇండియాలో విలీనం చేయకముందు వరకు బలూచిస్తాన్ స్వతంత్ర దేశంగానే ఉండేది. బ్రిటిష్ వారి నుంచి మనకు స్వతంత్రం వచ్చిన తర్వాత దేశ విభజన తర్వాత పాకిస్తాన్‌లో భాగమైంది. ఆ తర్వాత కొంత కాలానికి స్వతంత్ర దేశం కోసం బలూచిస్తాన్ నుంచి డిమాండ్ పుట్టుకొచ్చింది. ఆ ప్రావిన్స్‌లో పాక్ సాగిస్తున్న మారణకాండ కూడా తిరుగుబాటుకు మరో కారణం. 2011 నుంచి 2024 జనవరి వరకు పాక్‌లో మొత్తం 10,078 మంది అదృశ్యం అయ్యారు. అదృశ్యమైనవారిలో 2,752 మంది బలూచ్ పౌరులే. 2001-2017 మధ్య 5,228 మంది బలూచ్ పౌరులు అదృశ్యం కావడం గమనార్హం. ప్రస్తుతం బీఎల్‌ఏ చురుకుగా వేర్పాటువాద కార్యకలాపాలు సాగిస్తోంది. బలూచిస్తాన్ స్వతంత్ర దేశం కావాలనే డిమాండ్‌తో బీఎల్‌ఏ ఏర్పాటైంది. దశాబ్ద కాలంగా పాకిస్తాన్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తోంది. అయితే పాకిస్తాన్ ప్రభుత్వం, అమెరికా బీఎల్‌ఏను ఒక ఉగ్ర సంస్థగా గుర్తించాయి. ప్రస్తుతం పాక్, ఇండియాతో యుద్ధం వస్తుందేమో అని భయపడుతున్న క్రమంలో బీఎల్‌ఏ పాకిస్థాన్‌తో పాటు చైనాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. వెంటనే బలూచిస్తాన్‌ను వదిలివెళ్లిపోవాలంటూ ఆ రెండు దేశాలను హెచ్చరించింది.




## భారత వాయుసేనతో ఘర్షణ జరగొచ్చు పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజ ఆసీఫ్

**ఇస్లామాబాద్, మే 4:** మాపై 36 గంటల్లో భారత్ దాడి చేయడం ఖాయం అంటూ గగ్గోలు పెట్టిన పాక్ రక్షణ మంత్రి ఖవాజ ఆసీఫ్ ఇప్పుడు కొత్త పల్లవి అందుకొన్నారు. ఆయన 36 గంటలు అని చెప్పి నాలుగు రోజులు దాటినా భారత్ నుంచి ఎటువంటి ప్రతిదాడి లేకపోవడంతో కొత్త కోణం తెరపైకి తెచ్చారు. భారత్ వాయుసేనతో ఘర్షణ జరిగే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని అంచనా వేశారు. ఆయన పాక్‌కు చెందిన ఎఆర్‌వై న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే తమ గగనతలంలోకి వచ్చేందుకు ప్రయత్నించిన రఫేల్ యుద్ధ విమానాలను అడ్డుకొన్నట్లు ఆయన చెప్పుకొచ్చారు. ఇక ఇదే మంత్రి మరో ఛానెల్‌లో మాట్లాడుతూ సింధు నదిపై భారత్ నిర్మించే ఏ కట్టడాన్నిఅయినా దాడిచేసి కూల్చేస్తామని పేర్కొన్నారు. అసలు భారత్ దీనిపై నిర్మాణాలకు యత్నించడమే దౌర్జన్యంగా భావిస్తా మన్నారు. గత నెల చివరలో ఆసీఫ్ ఓ ప్రకటన చేశారు. భారత్ 24-36 గంటల్లో తమపై సైనిక చర్య చేపడుతుందని సంచలన ప్రకటన చేశారు. భారత్‌లో సిసిఎస్ సమావేశం ముగిసి ఉగ్రవాదులపై చర్యకు మిలటరీకి అధికారాలు ఇచ్చిన వేళ ఈ ప్రకటన వెలువడటం సంచలనం సృష్టించింది.కానీ అటువంటిది ఏమీ చోటుచేసుకోలేదు.

# భారత్-పాక్ సరిహద్దులో పాక్ రేంజర్

## అదుపులోకి తీసుకున్న బిఎస్‌ఎఫ్ జవాన్లు



**జైపూర్, మే 4:** భారత్ సరిహద్దులోకి చొరబడిన పాకిస్థాన్ రేంజర్‌ను బీఎస్‌ఎఫ్ జవాన్లు పట్టుకున్నారు. శనివారం రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ సమీపంలో ఉన్న భారత్‌పాక్ బోర్డర్‌లోకి ఓ పాకిస్థాన్ రేంజర్ చొరబడ్డాడు. అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో బీఎస్‌ఎఫ్ జవాన్లు అతడిని అదుపులోకి తీసుకున్నారు. భారత్‌పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ పాకిస్థాన్ రేంజర్ భారత్‌లోకి ప్రవేశించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల అనుకోకుండా భారత్ సరిహద్దు దాటి పాక్‌లోకి ప్రవేశించిన ఓ బీఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌ను పాకిస్థాన్ ఆర్మీ నిర్బంధించింది. అతనిని విడుదల చేయాలని భారత్ సైనిక అధికారులు చర్చలు జరుపుతున్నప్పటికీ, ఫలితం కనిపించడం లేదు. ఉన్నతాధికారుల అనుమతి లేనిదే ఆయన్ను విడుదల చేయడం కుదరదని పాక్ ఆర్మీ వర్గాలు అంటున్నాయి. మరి ఇప్పుడు పాక్ రేంజర్‌ను అదుపులోకి తీసుకున్న భారత్ ఎలా స్పందిస్తుందో చూడాలి. పాక్ మహిళను పెళ్లాడిన విషయాన్ని రహస్యంగా ఉంచడమే కాకుండా, వీసా గడువు ముగిసినా ఆమెను ఇక్కడే ఉంచిన ఓ జవాన్‌ను సీఆర్పీఎఫ్ ఉద్యోగం నుంచి తొలగించింది. పహల్గాం ఉగ్రదాడి తరువాత ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ వ్యవహారం బయటకొచ్చింది. పాక్ జాతీయులు స్వదేశానికి వెళ్లిపోవాలని భారత్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే ఆమె వివరాలు ఆరా తీయగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సీఆర్పీఎఫ్ 41వ బెటాలియన్‌కు చెందిన మునీర్ అహ్మద్ అనే జవాన్ గతేడాది మే నెలలో పాక్‌కు చెందిన ఓ మహిళను వీడియో కాల్ మాధ్యమంలో పెళ్లి చేసుకున్నాడు. ఆ తరువాత ఆమె వీసాపై భారత్‌కు చేరుకుంది. అయితే, ఈ విషయాన్ని సదరు జవాన్ ఉన్నతాధికారుల వద్ద దాచి ఉంచాడు. పైగా వీసా గడువు ముగిసినా ఆమెను ఇక్కడే ఉంచాడు. దీంతో ఉన్నతాధికారులు మునీర్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు. పాక్ జాతీయురాలితో వివాహం జరిగిన విషయాన్ని మునీర్ అహ్మద్ దాచిపెట్టాడు. అంతేకాదు ఆమె వీసా గడువు ముగిసిందని తెలిసి కూడా ఆశ్రయం కల్పించాడు. అందుకే అతన్ని తక్షణం సర్వీసు నుంచి తొలగిస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించడంతోపాటు జాతీయ భద్రతకు విఘాతం కలిగేలా ప్రవర్తించాడు. అందుకే ఈ మేరకు చర్యలు తీసుకున్నాం'అని ఆర్పీఎఫ్‌ప్రతినిధి వెల్లడించారు.



## జార్ఖండ్‌లో రోడ్డుపై వెళ్తున్న కారులో పేలుడు డ్రైవర్ సజీవ దహనం

**రాంచీ, మే 4:** రోడ్డుపై వెళ్తున్న కారులో మంటలు చెలరేగాయి. కొన్ని క్షణాల్లోనే ఆ కారులో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో కారులో వ్యాపించి మంటల్లో కాలి డ్రైవర్ సజీవదహనమయ్యాడు. ఇది చూసి అక్కడున్న జనం షాక్ అయ్యారు. జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. కద్మా ప్రాంతంలో రోడ్డుపై వెళ్తున్న కారులో మంటలు వ్యాపించాయి. దీంతో డ్రైవర్ కారును రోడ్డుపై ఆపాడు. అయితే ఆ కారు డిక్కీలో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలింది. దీంతో ఆ మంటల్లో కారు కాలిపోయింది. కారు డ్రైవ్ చేసిన వ్యక్తి సజీవ దహనమయ్యాడు. ఈ సంఘటన చూసిఅక్కడున్న జనం షాక్ అయ్యారు. కాగా, ఈ సంఘటన గురించి తెలిసిన వెంటనే పోలీసులు, ఫోరెన్సిక్ బృందం అక్కడకు చేరుకున్నారు. మృతుడిని సునీల్ అగర్వాల్‌గా గుర్తించారు. కారు పేలిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## 128 యేళ్ల యోగా గురువు స్వామి శివానంద కన్నుమూత



**వారణాసి, మే 4:** ప్రముఖ యోగా గురువు, పద్మశ్రీ అవార్డు గ్రహీత స్వామి శివానంద (128) తుదిశ్వాస విడిచారు. వారణాసిలోని నివాసంలో ఆయన కన్నుమూసినట్లు సన్నిహితులు వెల్లడించారు. శివానంద మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి యోగా రంగానికి తీరని లోటుగా పేర్కొన్నారు. 1896 ఆగస్టు 8న అవిభాజ్య భారత్‌లోని సిల్హెట్ ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉన్న జిల్లాలో నిరుపేద కుటుంబంలో స్వామి శివానంద జన్మించినట్లు వారి శుష్యులు వెల్లడించారు. ఆరేళ్ల వయసులోనే శివానంద తల్లిదండ్రులు మరణించారు. దీంతో ఆయన బెంగాల్‌లోని ఓ ఆశ్రమంలో పెరిగారు. గురు ఓంకారానంద గోస్వామి ఆయనను పెంచి పెద్ద చేయడమేగాక, యోగా వంటి ఆధ్యాత్మిక విషయాలను బోధించారు. ఈ క్రమంలోనే తన జీవితాన్ని సమాజసేవకు అంకితం చేశారు.50 ఏళ్లుగా పూరిలో 4,00, 600 కుష్టు రోగులకు సేవ చేశారు. అయితే యోగా రంగానికి చేసిన కృషికి గాను 2022లో శివానంద, అప్పటి రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. ఆ సమయంలో తెల్లని ధోవతి, కుర్తా ధరించి కాళ్లకు చెప్పులు లేకుండా అత్యంత సామాన్యంగా వచ్చి పురస్కారాన్ని స్వీకరించారు. దీంతో అప్పట్లో అందరి దృష్టిని ఆకర్షించారు.



## ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలను వాడం: పుతిన్

**మాస్కో, మే 4:** ఉక్రెయిన్‌పై అణ్వాయుధాలను ఉపయోగించే అవసరం తలెత్తదని రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు. ఆ పరిస్థితి ఏర్పడదని తాను ఆశిస్తున్నట్లు స్పష్టం చేశారు. రష్యా అధికారిక టివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ వివాదానికి తాత్కాలిక ముగింపు తీసుకురావడానికి రష్యా వద్ద బలం ఉందన్నారు. మరోవైపు రష్యా నిర్వహిస్తున్న 'విక్టరీడే' కవాతుకు హాజరయ్యే విదేశీ ప్రముఖుల ప్రాణాలకు తాను హామీ ఇవ్వలేనంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ హెచ్చరిక జారీ చేశారు.

# తెరుచుకున్న బద్రీనాథ్ దేవాలయం

## ప్రధాని మోడీ పేరిట ఉత్తరాఖండ్ సీఎం మహాభిషేకం



**డెహ్రాడూన్, మే 4:** ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథుడి ఆలయ ద్వారాలు ఆరు నెలల తర్వాత తెరుచుకోగా, ప్రధాని నరేంద్ర మోదీ పేరిట సీఎం పుష్కర్ సింగ్ ధామి తొలి మహాభిషేక పూజను నిర్వహించారు. ఆ తర్వాత దేశ ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థించారు. లక్ష్మీ దేవి, వినాయకుడు సహా ఆలయ ప్రాంగణంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆ సమయంలో ఆయనతోపాటు పలువురు పండితులు కూడా ఉన్నారు. కొన్ని నెలలపాటు ఉన్న కఠిన వాతావరణ పరిస్థితులు తగ్గడంతో ఆదివారం ఉదయం ఆరు గంటలకు భక్తుల జయ జయ ధ్వానాలు, అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య మత పెద్దల సమక్షంలో బద్రీనాథ్ ఆలయ ప్రధాన ద్వారాలను అధికారులు తెరిచారు. ఆ సమయంలో భారత సైనికులు ప్రత్యేక సంగీతాన్ని ఆలపించారు.అంతకుముందు 15 టన్నుల రకరకాల అందమైన పుష్పాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. దేశం నలుమూలలతోపాటు నేపాల్ నుంచి వచ్చిన వందలాది మంది భక్తులు బద్రీనాథుడిని దర్శించుకున్నారు. బద్రీనాథ్ ధామ్ తలుపులు తెరిచిన సందర్భంగా మానా, బామ్ని గ్రామానికి చెందిన మహిళలు ఆలయ ప్రాంగణంలో నృత్యం చేశారు. సీఎం పుష్కర్ సింగ్ ధామి బద్రీనాథ్‌లోని యాత్రికుల నుంచి ప్రయాణ ఏర్పాట్లపై అభిప్రాయాలను తీసుకున్నారు. సురక్షితమైన చార్‌ధామ్ యాత్ర, భక్తులకు సౌకర్యాల కోసం ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు.ఆలయ సమీపంలో జరుగుతున్న నిర్మాణ పనులను కూడా ఆయన పరిశీలించారు. ప్రయాణికుల భద్రత, సౌకర్యా లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీసు సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. గోవింద్ ఘాట్ వద్ద అలకనంద నదిపై నిర్మాణంలో ఉన్న వంతెన నిర్మాణ పనుల గురించి ఆయన ఆరా తీశారు. జిల్లా మేజిస్ట్రేట్‌ను వంతెన నిర్మాణాన్ని నాణ్యతతో పూర్తి చేయాలని కోరారు. గతనెల 30న గంగోత్రి, యమునోత్రి ఆలయాల తలు పులు తెరవడం వల్ల చార్‌ధామ్ యాత్ర ప్రారంభమైంది. ఈనెల 2న, భక్తుల కోసం కేదార్‌నాథ్ ధామ్ తలుపులు తెరుచుకోగా, బుధవారం బద్రీనాథ్ ధామ్ తలుపులు భక్తుల కోసం తెరుచుకున్నాయి. దీంతో ఛార్‌ధామ్ యాత్ర సంపూర్ణంగా ప్రారంభమైనట్లైంది.



## రాంబన్‌జిల్లాలో లోయలోకి పడిన ఆర్మీ వాహనం ముగ్గురు సైనికులు మృతి

**శ్రీనగర్, మే 4:** జమ్ము కశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో సైనిక వాహనం అదుపుతప్పి లోయలో పడింది. ఈ దుర్ఘటనలో వాహనంలో ఉన్న ముగ్గురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన సైనికులను అమిత్ కుమార్, సుజీత్ కుమార్, మన్ బహదూర్‌గా గుర్తించారు. ఆర్మీ వాహనం పడిన లోయ ఏకంగా 700 అడుగుల లోతు ఉండటం ప్రమాద తీవ్రతను తెలియజేస్తోంది. ప్రమాద స్థలిలో సైనికుల మృతదేహాలతో పాటు వారికి సంబంధించిన కొన్ని వస్తువులు కొన్ని పత్రాలు దొరికినట్లు సమాచారం. జమ్మూ నుంచి శ్రీనగర్‌కు వెళ్తున్న సైనిక వాహన శ్రేణిలో ఆవాహనం ఒక భాగమని సైనిక వర్గాలు తెలిపాయి. బ్యాటరీ చష్మా ప్రాంతంలో వాహనం లోయలో పడింది. వెంటనే అక్కడకు చేరుకున్న సైన్యం, జమ్ముకశ్మీర్ పోలీసులు, రాష్ట్ర విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. కాన్వాయ్‌లో భాగమైన ఆర్మీ వాహన డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్ల ప్రమాదం జరి గింది. వాహనంలో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. దురదృష్టవశాత్తు వారు ముగ్గురూ మరణించారు. పోలీసు బృందం, ఆర్మీ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని చర్యలు నిర్వహించాయి. మృతదేహాలను వెలికితీసి పైకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాం. ఘటనాస్థలానికి వెళ్లగా అక్కడ ఒక నట్‌బోల్ట్ కనిపించింది.

అది బహుశా స్టీరింగ్ వీల్స్ నుంచి వచ్చి ఉండవచ్చు. కాబట్టి ఆ నట్‌బోల్ట్ కారణంగా డ్రైవర్ స్టీరింగ్ వీల్స్‌పై నియంత్రణ కోల్పోయాడని భావిస్తున్నాం. అదే ప్రమాదానికి ప్రాథమిక కారణంగా తెలుస్తోంది. దర్యాప్తు తర్వాతే విషయాలు స్పష్టంగా తెలుస్తాయి అని రమ్బాన్ ఎస్ఎస్పీ కుల్బీర్ సింగ్ తెలిపారు.

5-5Pg6exHMNWJQE.qxd:5-5Pg6exHMNWJQE.qxd 05/05/25 1:11 AM Page 1



# శివయ్యకు ధారా పాత్ర



అష్టోత్తర లింగంపై ధారా పాత్ర ఏర్పాటు

**శ్రీకాళహస్తి,మే 4 ప్రభాతవార్త:** సంప్రదాయాలు, సంస్కృతికి నిదర్శనమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం నుంచి డొల్లు కత్తెర ప్రారంభం కానున్నట్లు ఆలయాధికారి డి.బాపిరెడ్డి తెలిపారు. విశ్వసునామ సంవత్సరం వైశాఖ చిత్త శుద్ధి సప్తమి ఆదివారం రాత్రి 12.23 గంటలకు డొల్లు కత్తిర ప్రారంభం అయినట్లు వివరించారు. మండుటెసవిలో స్వామి వారికి ఉపశమనం కల్గించుటకు ఈ ఏర్పాట్లు చేసేటట్లు ఆది నుంచి వస్తుందని తెలిపారు. ఈ సంప్రదాయాన్ని అమలు చేస్తున్నట్లు ఇఓ వివరించారు. ఈ మేరకు ఆలయ అర్చకులు, వేదపండితులతో చర్చించిన మీదట నిర్ధారణ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వాయులింగేశ్వరుని మూల విరాట్టుకు పై భాగాన ధారా పాత్ర నెలకొల్పబడిందని వివరించారు. ఆలయంలోని వాయులింగేశ్వరుని మూల విరాట్టు మీద అలాగే ఆలయ ప్రధాన ద్వారం పక్కనే ఉన్న అష్టోత్తర లింగం ,పట్టణంలోని జెట్టిపాళెం లో వెలసిన చక్రేశ్వరస్వామి ఆలయంలోనూ, అలాగే అర్ధనారీశ్వరాలయంలో కూడా ఈ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఆదివారం రెండవ కాలాబిషేకం తరువాత స్వామి విగ్రహంపై ధారాపాత్రను ఏర్పాటు చేసారు. ఈ నెల 11 నుంచి నిజ కత్తెర ప్రారంభమౌతుందన్నారు. ఈ నిజ కత్తెర మే నెల 28 వరకు కొనసాగుతుందన్నారు. 28న రాత్రి 1.28గంలకు కత్తెర త్యాగం జరుగుతుందని ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, వివరించారు. ఈ సమయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

**6 నుంచి శివయ్యకు చిన్న కొటాయ్ ఉత్సవం**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ఉత్సవాలు, సేవలు భిన్నంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 6నుంచి స్వామి అమ్మవార్లకు చిన్న కొటాయ్ ఉత్సవం నిర్వహించబడుతుందని ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదివారం వివరించారు. ఆలయంలో స్వామి అమ్మవార్లతోపాటు అనుబంధంగా ఉన్న పరివార దేవతలకు కూడా నిత్యం ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆలయంలో పెద్దకొటాయ్ ఉత్సవాలను పది రోజుల పాటు నిర్వహిస్తారు. వేసవిలో స్వామి అమ్మవార్లకు వారం రోజుల పాటు చిన్న కొటాయ్ ఉత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది విసువాశ్వ నామ సంవత్సరం చిన్న కోటాయ్ ఉత్సవం ఈ నెల 6 నుంచి 12 వరకు నిర్వహించబడుతుందన్నారు. సాయంత్రం ప్రతి రోజూ 5.30గంటలకు ఈ ఉత్సవం నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో చక్కగా అలంకరించి గ్రామోత్సవంగా ఆలయ ఆవరణ లోని పొగడ చెట్టు కిందకు తీసుకువస్తారు. అక్కడ వట్టివేళ్ళతో పందిళ్ళు, పరదాలు ఏర్పాటు చేస్తారు. అక్కడ స్వామి అమ్మవార్లకు సేవలందించి అభిషేకాలు, అనంతరం మూడు ప్రదక్షిణలు జరిపి దీపారాధన, హారతులు అందించి ఆలయానికి చేర్చబడుతుందన్నారు. మే 5న గ్రామోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి వివరించారు.

# భగీరథ మహర్షికి ఘన నివాళి





భగీరథ వవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్, ఎంపి అంబిక లక్ష్మినారాయణ

**అనంతపురం న్యూటౌన్, మే 4 ప్రభాతవార్త:** భగీరథ మహర్షి జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ దగ్గర గల కేర్ క్యూర్ హాస్పిటల్ ఎదురుగా వున్న భగీరథ మహర్షి విగ్రహానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మానవ ప్రయత్నంతో చాలా పెద్ద సాధనను చేయొచ్చు అనేదానికి భగీరథ మహర్షి ఒక ఉదాహరణ అని అన్నారు. మన జిల్లాకు అది వర్తిస్తుందని, కరువు జిల్లా, తక్కువ వర్షంపడే ప్రాంతం అయినా కూడా ప్రభుత్వం నుంచి చేస్తున్న ప్రయత్నాలు ఉపాధి హామీ పథకం, జల్ శక్తి అభియాన్, లాంటి పథకాలను జిల్లాలో సజావుగా అమలు చేస్తున్నామన్నారు. అందరూ మంచినీరు, తాగనీటిపై జవాబుదారీగా ప్రవర్తించాలన్నారు.

**భగీరథ ప్రయత్నం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంపీ అంబికా లక్ష్మినారాయణ:** భగీరథ జయంతి సందర్భంగా భారతదేశ వ్యాప్తంగా ఉన్న సగర ఆత్మీయ బంధువులకు శుభాకాంక్షలు తెలిపారు. భగీరథుడు ఎలాంటి ప్రయత్నాలు చేపట్టారు అనేది గుర్తుంచుకోవాలని, కరువు సీమలో నీటి కోసం తన శక్తి వంచన లేకుండా ధారపోసి భూమి లోపల నుంచి నీటిని తీసుకువచ్చి అపర భగీరథ ప్రయత్నం గురించి మనం మాట్లాడుకుంటామని, ఎంత కష్టంతో కూడుకున్నదైనా సాధించేందుకు మొక్కవోని దీక్షతో ప్రపంచంలోనే మానవాళికి ఉపయోగపడేటువంటిది భగీరథ ప్రయత్నంగా మనం భావించాలన్నారు. అలాంటి నీటి వనరులను గుర్తించి బయటకు తీసుకువచ్చి మనందరికీ స్ఫూర్తిదాయకమైనటువంటి, కఠోరమైనటువంటి శక్తిని చూపించిన మహానుభావుడుగా భగీరథ మహర్షి మనందరి హృదయాలలో నిలిచిపోయారన్నారు. భగీరథ మహర్షి ప్రయత్నాలను ఎలా సఫలీకృతం చేసారో అలాంటి ప్రయత్నాలను రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు చేస్తున్నారని, భగీరథ ప్రయత్నంతో పోలవరం ప్రాజెక్టను పూర్తి చేసి నీటి సదుపాయాన్ని రాష్ట్రానికి కల్పించే ఆలోచనతో పనిచేస్తున్నారన్నారు. భగీరథ మహర్షి ఆశీస్సులు రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి, మనందరికీ ఉండాలని ఆశిస్తున్నామన్నారు.

రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు : అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ రాష్ట్రంలో సాగు తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు భగీరథ ప్రయత్నం చేస్తున్నారన్నారు. భగీరథుడు కేవలం ఉప్పర కులస్తులకు మాత్రమే దైవం కాదని, ఏ పని తలపెట్టినా ఆయన పూర్తిగా నిలిచే దైవమని అన్నారు. భువి నుంచి దివికి గంగను తీసుకొచ్చేందుకు భగీరథుడు చేసిన కృషి చరిత్రలో ఎప్పటికీ నిలిచే ఉంటుందన్నారు. లక్ష్యసాధనలో ఆయన తీరు అందరికీ ఆదర్శనీయమన్నారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్లో కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ప్రయత్నం భగీరథ ప్రయత్నంలా ఉందని అన్నారు. భగీరథ మహర్షి స్ఫూర్తితోనే రాష్ట్రంలో ప్రాజెక్టులన్ని పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్లు సుభాషిని, రంగమ్మ, గంగాద్రి, బీసీ హాస్టల్ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మస్తాన్, జిల్లా అధ్యక్షులు మారుతి ప్రసాద్, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కుల సంఘాల నాయకులు, బీసీ హాస్టల్స్ వార్డెన్లు, జిల్లా కార్యాలయం ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



# వేసవి సెలవులతో జనసంద్రంగా కాణిపాకం

## సర్వ దర్శనానికి నాలుగైదు గంటలు

**కాణిపాకం, మే 4 ప్రభాతవార్త:** వరుస సెలవుల కారణంగా సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిది వినాయక స్వామి అలయం భక్తుల రద్దీతో ఆదివారం భక్తజన సంద్రంగా మారింది సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శని, ఆదివారాలు వారంతపు రోజులు కావడంతో పాటు విద్యాసంస్థలకు వేసవి సెలవులు రావడం, ఆదివారం ప్రభుత్వ సెలవు రోజు రావడంతో కాణిపాకం ఆలయ దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ నెలకొంది. దీనితో పాటు తిరుమల వెళ్ళే భక్తులు కూడా కాణిపాకం ఆలయ దర్శనానికి భారీగా తరలి రావడంతో ఉదయం నుండి ఆలయంలోని క్యూలైన్లన్ని భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో కాణిపాకం ఆలయం భక్తజన సంద్రంగా మారింది. రీద్దతో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్ర దర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు గంటలకు పైగా వేచి వుండాల్సిన పరిస్థితి

# హైదరాబాద్‌లో మొదలైన ప్రపంచ సుందరీమణుల సందడి

**మిస్ బ్రెజిల్ జెస్సికా, మిస్ సౌత్ఆఫ్రికా జోయలైజ్ రాక**

**మిస్ వరల్డ్ పోటీలకు ముస్తాబవుతున్న హైదరాబాద్**





**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 4:** హైదరాబాద్‌లో ప్రపంచ సుందరీమణుల సందడి మొదలైంది. ఈ నెల 10న హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ప్రపంచ అందగత్తెలు ఒక్కొక్కరుగా హైదరాబాద్‌కు చేరుకుం టున్నారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొననున్న మిస్ బ్రెజిల్ జెస్సికా స్కెన్డియుజ్స్ పెడ్రోసో శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు ఆదివారం ఉదయం చేరుకున్నారు. శంషాబాద్‌కు చేరుకున్న మిస్ బ్రెజిల్ కు తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాల ప్రకారం అధికారులు ఘన స్వాగతం పలికారు. కాగా, మిస్ వరల్డ్ సీఈవో, చైర్ పర్సన్ జూలియా ఈవేలిన్ మోర్లి, మిస్ కెనడా మిస్ ఎమ్మా డయన్నా క్యాథరీన్ మొర్రిసన్ లు ఇప్పటికే చేరుకున్నారు. కాగా, మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు మిస్ సౌత్ ఆఫ్రికా జోయలైజ్ జన్సెన్ వాన్ రెన్స్ బర్గ్ ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఇప్పటివరకు కెనడా, బ్రెజిల్, సౌత్ ఆఫ్రికా కు చెందిన ప్రతినిధులు హైదరాబాద్ వచ్చారు. శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న మిస్ సౌత్ ఆఫ్రికాకు తెలంగాణ ప్రభుత్వ అధికారుల బృందం స్వాగతం పలికింది. ఈ మిస్ వరల్డ్ పోటీల కంటెస్టర్లు ఈ నెల 6 వ తేదీ నుండి హైదరాబాద్‌కు మరింత మంది చేరుకుంటారు. మే 10 నుంచి 31 వరకు పోటీలు జరగనున్నాయి. మూడు వారాల పాటు 120 దేశాలకు చెందిన అందగత్తెలు హైదరాబాద్‌లో సందడి చేయనున్నారు. ఈ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. తొలిసారి హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్నాయి. గచ్చిబౌలి స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. మే 31న ఫైనల్స్ ఉంటాయి. ఈ పోటీల్లో పాల్గొనే బ్యూటీలు మే 8లోపు హైదరాబాద్ చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో మహానగరం ప్రపంచ సుందరీమణుల పోటీలకు ముస్తాబవుతోంది. రహదారులు, కూడళ్లు, పర్యాటక కేంద్రాలు, ముఖ్యమైన భవాలను అందంగా తీర్చిదిద్దేందుకు జీహెచ్ఎంసీ నడుం బిగించింది. అందాల భామలు, అతిథులు తిరిగే రహదారులపై గుంతల్లేకుండా చూసుకోవడం, లేన్ మార్కింగ్, కాలిబాటలు, కూడళ్ల సుందరీకరణ, పచ్చదనం ఏర్పాట్లను యుద్ధప్రాతిపదిన పూర్తి చేయాలని కమిషనర్ ఆర్వీ.కర్ణన్ ఆ దిశగా యంత్రాంగానికి ఆదేశాలు సైతం జారీ చేశారు. ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొనేవారు ఇప్పటికే నగరానికి చేరుకోవడం ప్రారంభించారు. పోటీదారులు, అతిథులు శంషాబాద్ విమానాశ్రయం నుంచి నగరంలోకి చేరుకునే అన్ని రోడ్లను బల్దియా చక్కదిద్దుతోంది. అటువైపు వెళ్లే రోడ్లు, చుట్టుపక్కల ప్రాంతాలను ముస్తాబు చేయాలని నిర్ణయం తీసుకుంది. రోజంతా పారిశుద్ధ్య నిర్వహణకు జోనల్, సర్కిళ్ల స్థాయిలో కమిటీలు వేసింది. 151 కి.మీ. రోడ్లను కేంద్ర కార్యాలయం మ్యాపింగ్ చేసి, పర్యవేక్షణకు ఉన్నతాధికారులను బాధ్యులుగా నియమించింది. ప్రపంచ సుందరి పోటీలకు సంబంధించిన ప్రచార కార్యక్రమాలను సైతం జీహెచ్ఎంసీ చేపట్టబోతోంది. నగరంలో ఉన్న 250 బస్టాపులపై ఫ్లెక్సీ బోర్డులు, పలు వారసత్వ కట్టడాలు, రహదారుల్లో రూ.1.8 కోట్లతో ఎల్ఈడీ విద్యుద్దీపాల ఏర్పాటు, సెల్ఫీ పాయింట్లు, ఇతరత్రా ఏర్పాట్లు పురోగతిలో ఉన్నాయి. పోటీదారులు, అతిథులు ఆ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో విహరించే అవకాశం ఉండటంతో రూ.1.89 కోట్లతో వంతెనలపై క్రాష్ బారియర్లు, రోడ్ల డివైడ్లు, కాలిబాటలకు రంగులు సైతం వేస్తున్నారు. యూటర్న్లు, రహదారులకు మరమ్మతులు, లేన్ మార్కింగ్ చేస్తున్నారు. చౌమహల్లా ప్యాలెస్, చార్మినార్, తదితర ప్రాంతాలనూ అతిథులు సందర్శిస్తారని అధికారులు చెబుతున్నారు. అక్కడా మరమ్మతులు చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ వెల్లడించింది.

**మిస్ వరల్డ్ బ్యూటీలపై టాలీవుడ్ కన్ను**

ప్రస్తుతం టాలీవుడ్ పాన్ వరల్డ్ సినిమాలు తీసే స్థాయికి ఎదిగింది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో జరగబోయే మిస్ వరల్డ్ పోటీలపై టాలీవుడ్ దర్శక నిర్మాతలు దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ పోటీల్లో తమ అందం, అభిన యంతో అలరించే అందగత్తెలతో సినిమా ఒప్పందాలు చేసుకోవడానికి వారు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. టైటిల్ గెలవని అందమైన ముద్దుగుమ్మలను సైతం తమ సినిమాల్లో నటింపజేసేందుకు మేకర్స్ సిద్దమైనట్లు తెలుస్తోంది.

# బకాయిల చెల్లింపునకు రూ.6వేల కోట్లు విడుదల

## ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు

**శ్రీ సత్యసాయి జిల్లా , మే 4, ప్రభాతవార్త ప్రతినిధి:** విడతలవారీగా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లు హామీ ఇచ్చినట్లు ఉత్తరాంధ్ర టీచర్ల ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు. ఆదివారం అయన ఎమ్మెల్సీ గా మూడోసారి ఎన్నికవడంతో భగవాన్ సత్యసాయి బాబా దర్శనార్థం విచ్చేసి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై తాను ఇప్పటికే ముఖ్యమంత్రితో పాటు విద్యా శాఖమంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారని, అందులో భాగంగానే మొదటి విడతలో బకాయిల చెల్లింపులకు రూ.6 వేలకోట్ల నిధులను విడుదలచేసి వారి సమస్యల పరిస్కా రంలో ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలో రెండో విడత నిధులను విడుదల చేసి డిఏ బకాయిలతో పాటు ఈ ఎల్ సి తదితర గత ప్రభుత్వ హయాంలో ఉన్నబకాయిలను సైతం విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్న ట్లు ఆయన తెలియజేశారు. ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగస్తులు కోరుకుంటున్నట్లుగా ఐఆర్ తో పాటు పిఆర్సి కమిటీవేసి ఉత్తమమైన రీతిలో పిఆర్సి అందివ్వాలన్నారు. ప్రస్తుత వేసవికాలంలో 10వతరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమిడియల్ క్లాసులు ఉదయం నుండి సాయంత్రం వరకు నిర్వహిస్తున్నారని, ఇదిసరైనది కాదని వేసవిని దృష్టిలో ఉంచుకొని రోజుకు 6 గంటల సమయం క్లాసులు బోధిస్తే చాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన 117 జీవోను రద్దుచేసి తరగతిగదిలో 40 మందిమాత్రమే ఉండేలా చూడాలని అప్పర్ ప్రైమరీ పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. వేసవికాలంలో క్లాసులు బోధించిన ఉపాధ్యాయులకు పనిచేసిన కాలానికి ఈయల్స్ మంజూరు చేయాలని, డీఎస్సీ రిక్రూట్మెంట్ నందు పరీక్షపేపరు జిల్లాల వారిగా కాకుండా రాష్ట్రమంతటా ఒకటే పరీక్ష పేపర్ ఉండేలా చూడాలన్నారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఆధ్వర్యంలో విద్యావ్యవస్థ కొత్తపుంతలు తొక్కుతోందని, మెరుగైన విద్యా విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం వివిధ రకాల ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. వీటిలో కూడ కొన్ని ఇబ్బందికర అంశాలు ఉన్నాయని వాటినిసరిచేసి మంచివిద్యను అందిస్తే ఉత్తమమైన ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. చాలాకాలం తర్వాత డిఎస్సీ నిర్వహిస్తున్నారని నిరుద్యోగులకు టెట్ లో ఉత్తీర్ణులు కావడానికి మరో అవకాశం ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. డీఎస్సీ దరఖాస్తులలో పర్సెంటేజీ విధానాన్ని రద్దుచేయాలని, ప్రస్తుతం బీఈడీ, డీఎడ్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు కూడా ప్రస్తుత డీఎస్సీలో అవకాశం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రైమరీ మోడల్ పాఠశాలను నిర్వహించాలన్నారు. పదోన్నతులకు సంబంధించి ఉన్నత పాఠశాలలో గ్రేడ్ వన్ హెచ్ఎంలు నియమించాలని, స్కూల్ అసిస్టెంట్లకు జేఎల్స్ గా పదోన్నతులు కల్పించాలని, సర్వీస్ రూల్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టి అన్ని కేటగిరీల ఉపాధ్యాయులకు పదవి విరమణ వయసు 62 కు పెంచాలన్నారు. ఈహెచ్ఎస్ ద్వారా దేశంలో ఎక్కడికెళ్ళిన వైద్యం సేవలు పొందేటట్లు ఇన్సూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచనలేకుండాకృషి చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో వైయస్ఆర్టీఏ జిల్లా అధ్యక్షులు పివి .రమణారెడ్డి , అపుష్ జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు, పిఆర్టియు నాయకులు రామకృష్ణారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లాగౌరవాధ్యక్షులు రజనీకాంత్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి, నారాయణస్వామి, సౌధామణి, చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల పంపిణీ స్కాంపై యేడాదిన్నరగా సాగుతున్న ఎసిబి విచారణ

**ఇంకా పట్టుబడని ఇద్దరు అసలు నిందితులు**

**రూ.2.10 కోట్లతో మొదలై రూ.700 కోట్లకు చేరిన కుంభకోణం**

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** గత బిఆర్ఎస్ సర్కారు ఏలుబడిలో వెలుగు చూసిన గొర్రెల పంపిణీ స్కాంపై ఎసిబి విచారణ ఏడాదిన్నరగా సాగుతున్నా పెద్దగా పురోగతి లేదనే విమర్శలు వున్నాయి. ఈ గోల్‌మాల్‌లో అసలు నిందితులు కాంట్రాక్టర్ మొయినుద్దీన్ అలియాస్ మొయిద్ అతని కుమారుడు ఇక్రముద్దీన్ ఇప్పటి వరకు పట్టుబడలేదు. రూ.2.10 కోట్ల రూపాయల స్కాంగా మొదలైన ఈ కుంభకోణం 700 కోట్ల రూపాయలకు చేరడం ఎసిబి అధికారులనే ఆశ్చర్యప రిచింది. ఈ కేసులో 15 మంది నిందితులు అరెస్టయినా అసలైన వారు ఇద్దరు ఇంకా దొరక్క పోవడంతో విచారణ ముందుకు సాగడం లేదని ఎసిబి అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో పెద్ద తలకాయలు వుండడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదనే విమర్శ బలంగా వుంది.

పెద్దపెద్ద కుంభకోణాలు కూడా చిన్నస్థాయిలో జరిగే పొరపాట్ల వల్లే వెలుగు చూస్తాయనడానికి గొర్రెల పంపిణీ స్కాం ఒక ఉదాహరణగా చెప్పాలి. రాష్ట్రంలో 2023 నవంబర్‌లో వెలుగు చూసిన గొర్రెల నిధుల గోల్‌మాల్ కేసులో కేవలం రెండు కోట్ల పది లక్షల రూపాయల చెల్లింపుల వద్ద జరిగిన పేచీ మొత్తం గోల్ మాల్‌ను రట్టు చేసింది. ఎపిలోని కొందరు రైతుల వద్ద గొర్రెలు ఖరీదు చేసి వారికి రెండు కోట్ల పది లక్షల రూపాయలను ఎగ్గొట్టినందుకు నమోదైన చీటింగ్ కేసు ఆ తరువాత భారీ స్కాంగా మారి గచ్చిబౌలి పోలీసు స్టేషన్ నుంచి ఎసిబికి బదిలీ అయ్యింది. అప్పటి సర్కారు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ పథకం వాస్తవంలో గొర్రెలు, మేకల పెంపకం దారులకు ఎంతగానో ప్రయోజనకరంగా వుందని రైతుల నుంచి ప్రశంసలు వచ్చాయి. రాష్ట్రంలో మాంసం వినియోగం పె రగడంతో దానికి తగినట్లుగా గొర్రెలు, మేకల ఉత్పత్తి పెరగాలని భావించి అప్పటి సర్కారు ఈ పథకాన్ని ప్రవేశపెట్టినా అధికారులు, కొందరు నాయకుల చేతివాటం వల్ల ఏకంగా 700 వందల కోట్ల రూపాయల స్కాంగా మారింది. 2024 జనవరిలో రట్టయిన గొర్రెల పంపిణీ నిధుల స్వాహా కేసు అంతకు ముందే గచ్చిబౌలి, నాంపల్లి పోలీసు స్టేషన్‌లలో వేరు వేరుగా నమోదయ్యాయి. తెలంగాణలో మంచి బ్రీడ్ గొర్రెలను రైతులకు అందించేందుకు ఈ పథకం ప్రవేశపెట్టగా ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు పశు సంవర్థక శాఖ అధికారులు వెళ్లి మేలు రకమైన గొర్రెలను కొని ఇక్కడి రైతులకు సబ్సిడీగా అందించాల్సి వుంది. ఈ క్రమంలో పశు సంవర్థక శాఖ అధికారులు ఎపి సహా పలు రాష్ట్రాలకు వెళ్లి మేలు రకమైన గొర్రెలను కొనుగోలు చేసి వాటిని వాహనాలలో తెలంగాణ కు తరలించి ఇక్కడి రైతులకు సబ్సిడీ రూపంలో అందించామని అప్పట్లో అధికారులు ప్రచారం చేసుకున్నారు. అయితే ఇక్కడే స్కాంకు తెరలేచిందని ఎసిబి అధి కారులు గుర్తించారు. గొర్రెల కొనుగోలు సమయంలో ఆయా రాష్ట్రాలకు చెందిన అధికారులతో ఇక్కడి పశు సంవర్థక శాఖ అధికారులు మాట్లాడకుండా మధ్యవర్తు లు, దళారులతో మాట్లాడి వారిని గొర్రెల రిసైక్లింగ్‌కు ముందుగానే ఒప్పించి కొంత కమీషన్ ఇచ్చి, వారి ద్వారా తమకు నచ్చిన జీవాలను కొన్నారు. ఇందులో మేలు రకం జీవాలు ఎన్ని, సాధారణ రకం ఎన్ని అనేదానిపై లెక్కలు లేవని ఎసిబి అధికారుల విచారణలో తేలింది. దీని తరువాత వీటిని తెలంగాణలో తాము ఎంపిక చేసిన లబ్దిదారులకు ఇచ్చి ఫోటోలు దిగిన తరువాత వాటిని మరో బృందం లబ్దిదారులకు, ఆ తరువాత ఇంకో బృందం లబ్దిదారులకు ఇలా పది అంత కు ఎక్కువ సంఖ్యలో లబ్దిదారులకు ఇవ్వడం ద్వారా పశు సంవర్ధక శాఖ అధికారులు స్కాంకు పాల్పడినట్లు ఎసిబి అధికారులు తేల్చారు. ఈ క్రమంలో లబ్దిదా రులకు కొంతమేర నగదు ఇచ్చి వారు ఎవరికీ చెప్పకుండా చూసినట్లు తేలింది. గొర్రెల కోసం గట్టిగా కోరిన కొందరు లబ్దిదారులకు మాత్రమే గొర్రెలు, మేకలు ఇచ్చారని, నగదుకు సరే అన్నవారికి కొంత మేర డబ్బులు ఇచ్చేసి ఎవరు మాట్లాడకుండా చేయగలిగారని, ఈ క్రమంలోనే దళారులు, మధ్యవర్తులతో పశు సంవర్ధ క శాఖ అధికారులు కుమ్మక్కయ్యారని ఎసిబి గుర్తించింది. ఇందుకోసం సర్కారుకు ఇచ్చిన బిల్లులన్నీ నకిలీవని, వాహనాల నంబర్లు కూడా నకిలీవని ఎసిబి విచా రణలో తేలింది. ఈ పథకం కోసం సర్కారు అప్పట్లో నాలుగు వేల కోట్ల రూపాయలకు పైగా వెచ్చించగా ఇందులో 700 కోట్ల రూపాయలు దారి మళ్లినట్లు ఎ సిబి తేల్చింది. కొన్నిచోట్ల ముసలి జీవాలు, అనారోగ్యంతో వున్న జీవాలను లబ్దిదారులకు అంటగట్టారని ఎసిబి గుర్తించింది. ఈ వ్యవహారమంతా అప్పట్లో గొర్రె లు, మేకల కొనుగోలుకు సంబంధించి సర్కారు ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌కు ఛైర్మన్‌గా వున్న పశు సంవర్థక శాఖ సిఈఓ సభావత్ రాంచందర్ నాయక్‌తో పాటు ఆ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఓఎస్డీ కల్యాణ్ కుమార్‌లకు తెలిసే జరిగిందని ఎసిబి అధికారులు తేల్చారు. రైతులకు గొర్రెలు, మేకలు అందించకు ండానే సరఫరా చేసినట్లు, సర్కారుకు తప్పుడు లెక్కలు ఇచ్చి 700 కోట్ల రూపాయల సర్కారు నిధులకు దళారులు, మధ్యవర్తులు, దళారులు, కొందరు పశు స ంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఈ స్కాంలో నిధులను వీరిద్దరితో పాటు కాంట్రాక్టర్ మొయినుద్దీన్, అతని కుమారుడు ఇక్రముద్దీన్‌లు కాజేశారని ఎసిబి అధి కారులు భావిస్తున్నారు. ఈ కేసులో నిందితులుగా వున్న కల్యాణ్, రాంచందర్ సహా అప్పటి పశుసంవర్థక శాఖ అధికారులు, దళారులు మొత్తం 15 మందిని ఎ సిబి అరెస్టు చేసింది. ఈ కేసులో పలువురు నాయకులను ఎసిబి అరెస్టు చేయనుందని వార్తలు వచ్చాయి. వారిని విచారించనున్నారని ప్రచారం జరిగినా అలా జరగలేదు. ఎసిబి విచారణలో ఇప్పటి వరకు ఎలాంటి ఆస్తులను జప్తు చేయలేదు, నిందితుల బ్యాంకు ఖాతాలను కొన్నింటిని జప్తు చేసినా వాటిలో పెద్దగా నగ దు లేదని సమాచారం. ఈ కేసులో అసలు నిందితులుగా చెబుతున్న మొయినుద్దీన్, ఇక్రముద్దీన్‌లు అరెస్టయితే కానీ విచారణ ముందుకు సాగేలా లేదు. మరో వై పు ఇదే కేసులో మనీలాండరింగ్ కోణంలో ఈడీ కూడా విచారణ చేబట్టి పలువురిని విచారించి వాంగ్మూలం తీసుకుంది. మొత్తం మీద గొర్రెల పంపిణీ స్కాంపై ఏడాదిన్నరగా సాగుతున్న విచారణలో పెద్దగా పురోగతి లేదనే విమర్శలు వున్నాయి. ఈ కేసులో పెద్ద తలకాయలు వుండడం వల్లే విచారణ సవ్యంగా సాగడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

## క్షణికావేశంలో ప్రేమజంట ఆత్మహత్య

**రాజాపూర్, మే 4, ప్రభాతవార్త :** క్షణికావేశంలో ఓ ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్ నగర్ జిల్లా రాజాపూర్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నరేపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. ఎస్సై శివానంద్ వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎట్టి జంగయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుమారుడు ఎట్టి శివప్రసాద్ (17) గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. వీరిద్దరికీ వయస్సు లేకపోవడంతో తల్లిదండ్రులు నచ్చజెప్పి, వచ్చే సంవత్సరం పెళ్లి చేస్తామని బుజ్జగించారు. ఆదివారం మధ్యాహ్నం ఏమైందో తెలియదు కానీ యువతీ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఎట్టి శివప్ర సాద్ ఓ వ్యవసాయ పొలం పశువుల కొట్టంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## విరిగిపడిన టోల్‌గేట్.. నిలిచిపోయిన వాహనాలు

**కొండపాక, మే 4, ప్రభాతవార్త:** రాజీవ్ రహదారిపై దుద్దెడ శివారులోని టోల్‌గేట్ గాలివానకు విరిగిపోయి ట్రాఫిక్‌కు అంతరయం కలిగిన సంఘటన అదివారం చోటు చేసుకుంది. సిద్దిపేట జిల్లా కొండపాక మండల పరిధిలోని రాజీవ్ రహదారిపై ఉన్న టోల్‌గేట్ రాత్రి బలంగా వీచిన గాలివానకు టోల్ గేట్‌కు ఇరువైపు ఏర్పాటు చేసిన క్యాష్ కౌంటర్లపై వేసిన రేకులు, సిగ్నల్ బోర్డులు, ఈ ట్యాగ్ పరికరాలు విరిగి పడిపోయాయి. దాంతో వాహనాలు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్‌కు కొంత సేపు అంతరాయం ఏర్పడింది.



# పర్యాటక ప్రదేశాల షోకేస్‌కు ప్రభుత్వ ప్రత్యేక కార్యాచరణ

## రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను సందర్శించనున్న మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు

## ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ పర్యాటక ప్రదేశాలకు దక్కనున్న విశేష ప్రచారం

## దేశీయ పర్యాటకులతోపాటు విదేశీ టూరిస్టులను పెద్దఎత్తున ఆకర్షించనున్న రాష్ట్రం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 4:** అద్భుత చారిత్రక, సాంస్కృతిక నేపథ్యం కలిగిన తెలంగాణను దేశంలో ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా రూపదిద్దడం, పర్యాటక రంగంలో రూ.15వేల కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే తెలంగాణ తొలి టూరిజం పాలసీని రూపొందించింది. ఇందుకోసం మిస్ వరల్డ్ పోటీలను సరైన వేదికగా వినియోగించుకునేందుకు కార్యాచరణ రూపొందించింది. 120 దేశాల ప్రతినిధులు హాజరయ్యే 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ ఈవెంట్‌లో తెలంగాణకు ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం కల్పించి తెలంగాణ పర్యాటకంను ప్రముఖంగా ప్రమోట్ చేసేందుకు తద్వారా ప్రపంచ పర్యాటకంలో తెలంగాణను ప్రముఖంగా నిలిపేందుకు, పెద్ద ఎత్తున విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తోంది. 2024 సంవత్సరంలో తెలంగాణను 1,55,113 మంది విదేశీ పర్యాటకులు సందర్శించారు. వీరి సంఖ్య గణనీయంగా పెరిగేందుకు ఈ మిస్ వరల్డ్ ఈవెంట్‌ను ఉపయోగించుకుంటోంది. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా హైదరాబాద్, వరంగల్ వెయ్యి స్తంభాల గుడి, ఖిలా వరంగల్, భద్రకాళి, రామప్ప, నాగార్జున సాగర్, పోచంపల్లి, పిల్లలమర్రి వృక్షం ప్రముఖ పర్యాటక ప్రదేశాలను మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు సందర్శించనున్నారు.

ఈ నెల 12న హైదరాబాద్ సాంస్కృతిక వారసత్వం గొప్పదనం ప్రపంచానికి తెలియజేసేలా చార్మినార్, లాడ్ బజార్‌లలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు 'హెరిటేజ్ వాక్' నిర్వహిస్తారు. 13న హైదరాబాద్‌కే తలమానికంగా నిలుస్తున్న చౌమల్ల ప్యాలెస్‌ను సందర్శించి ఓల్డ్ సిటీ ఘనమైన వారసత్వాన్ని ప్రపంచానికి తెలియ చేస్తారు. 14న చారిత్రక, ఆధ్యాత్మిక నగరం వరంగల్ లోని వెయ్యి స్థంభాల గుడి, వరంగల్ పోర్ట్ ను సందర్శిస్తారు. ఇదే రోజు యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయంను సందర్శిస్తారు. కాకతీయులు యుద్ధ రంగానికి వెళ్లే ముందు ప్రదర్శించే పేరిణి నృత్యంను రామప్పలో తిలకిస్తారు. 15న మిస్ వరల్డ్ కాంటెస్టెంట్‌లు ఆధ్యాత్మిక టూరిజంలో భాగంగా యాదగిరిగుట్ట ఆలయాన్ని సందర్శిస్తారు. హ్యాండ్లూమ్ ఎక్స్పీరియన్సల్ టూర్ లో భాగంగా పోచంపల్లిలో చేనేత వస్త్రాల తయారీని, ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకిస్తారు. ఈ నెల 16న మెడికల్ టూరిజం పరిచయ కార్యక్రమంలో భాగంగా మెడికల్ టూరిజంను చేపడతారు.

మహబూబ్‌నగర్ లోని పిల్లలమర్రి వృక్షాన్ని , హైదరాబాదు నగరానికే ప్రత్యేక ఆకర్షణగా ఉన్న ఎక్స్పీరియం పార్కును సందర్శిస్తారు. ఈ నెల 17న ప్రపంచంలోనే పెద్ద ఫిలిం సిటీలలో ఒకటిగా గుర్తింపు పొందిన ప్రఖ్యాత రామోజీ ఫిలిం సిటీని మిస్ వరల్డ్ కాంటెస్టెంట్ లు సందర్శిస్తారు. 18న మిస్ వరల్డ్ కాంటెస్టెంట్ లు తెలంగాణ పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ను సందర్శించి తెలంగాణ ప్రభుత్వం పౌరుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను , ప్రభుత్వం సేఫ్టీ టూరిజం ఇనిషియేటివ్స్ ను పరిశీలిస్తారు.

ఇదే రోజు సాయంత్రం మిస్ వరల్డ్ కాంటెస్టెంట్‌లకు అధికారులు తెలంగాణ రాష్ట్ర గ్రోత్ స్టోరీ, చరిత్రను తెలియజేస్తారు. ట్యాంక్ బండ్ పైన ప్రతి ఆదివారం ఏర్పాటు చేసే సండే ఫండే కార్నివాల్ ను సందర్శిస్తారు. ఈ నెల 20 లేదా 21న ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌కు కంటెస్టెంట్లు హాజర వుతారు. 21న శిల్పారామం లో తెలంగాణ కళాకారులచే నిర్వహించే ఆర్ట్స్, క్రాఫ్ట్స్ వర్క్ షాప్ హాజరవుతారు.

స్వయంగా వాటి తయారీలో భాగమై ప్రత్యక్షంగా తయారీ గురించి తెలుసుకుంటారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణతో ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ పర్యాటక ప్రదేశాలకు విశేష ప్రచారం దక్కనుంది. తెలంగాణ సాంస్కృతిక వైభవం, చారిత్రక గాథలు, ఆధునిక అభివృద్ధి, పర్యాటక ప్రాముఖ్యత ను ప్రపంచానికి తెలుపడంతో పాటు రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో ఒక "మల్టీడైమెన్షనల్ టూరిజం హబ్"గా నిలిపే అవకాశం లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# మెరుగైన కనెక్టివిటీ కోసం రూ.5,413 కోట్ల ప్రాజెక్టులు

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రహదారి మౌలిక సదుపాయాల కల్పనకు అతిపెద్ద ముందడుగు పడిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ నెల 5 వ తేదీన రూ. 5,413 కోట్ల విలువైన వివిధ రహదారి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారని, భూమిపూజ చేయనున్నారని తెలిపారు. ఈ రహదారి ప్రాజెక్టులు తెలంగాణ రాష్ట్రంలో కనెక్టివిటీని మెరుగుపరుస్తాయని, ఆర్థిక వృద్ధిని పెంపొందిస్తాయని, ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని వివరించారు. దృఢమైన, భవిష్యత్ అవసరాలను తీర్చగలిగే మౌలిక సదుపాయాల కల్పన ద్వారా నరేంద్ర మోడీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిరంతర సహకారాన్ని అందిస్తూనే ఉంటుందని వివరించారు. సిర్పూర్‌కాగజ్‌నగర్ ప్రాజెక్టు విలువ రూ.3,862 కోట్లు ఉంటుందని తెలిపారు. రూ.3694 కోట్ల వ్యయంతో 123 కిలోమీటర్ల పొడవున నిర్మించిన రహదారుల ప్రారంభోత్సవం, రూ.168.47 కోట్ల వ్యయంతో 8.1 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న రహదారికి భూమిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ప్రాజెక్టు విలువ రూ. 1,552.91 కోట్లు అని తెలిపారు. రూ.895.64 కోట్ల వ్యయంతో 22.57 కిలోమీటర్ల పొడవున నిర్మించిన రహదారుల ప్రారంభోత్సం, రూ.657.27 కోట్ల వ్యయంతో 20.87 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న రహదారికి భూమి పూజ చేయనున్నట్లు పేర్కొన్నారు.



తల్లికి అంత్యక్రియలు నిర్వహించడానికి శ్మశానానికి వెళుతున్న కూతురు

# తల్లికి తలకొరివి పెట్టిన కూతురు

**చిన్నశంకరంపేట, మే 4, ప్రభాతవార్త:** ఓ కుమార్తె తన తల్లికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామానికి చెందిన బాలమణి, నాగయ్య దంపతులు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కూతురు ఒక కూతురు. కాగా బాలమణి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ క్రమంలో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. బాలమణి, నాగయ్య దంపతులకు కుమారులు లేకపోవడంతో కూతురు సుజాత తలకొరివి పెట్టి అంతిమ సంస్కారాలు పూర్తి చేసింది. కాగా నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

# అనుమానస్పదంగా నవవధువు ఆత్మహత్య

## పోలీసులు, పాత్రికేయులపై దాడి..

## గ్రామంలో తీవ్రఉద్రిక్త పరిస్థితులు

**చిన్నశంకరంపేట, మే 4,ప్రభాతవార్త:** పెళ్లయిన మూడు నెలలకే నవ వధువు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం అగ్రహారం గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. వెల్దుర్తి మండలం శేరిలా గ్రామానికి చెందిన సాయిలు, మంజుల కూతురు పూజ(24)తో చిన్న శంకరంపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన వట్టెం రాజయ్య కుమారుడు మహేశ్‌తో ఫిబ్రవరి 2న వివాహం జరిగింది. పెళ్లయిన మూడు నెలలకే నవవధువు పూజ శనివారం అత్తింట్లో అనుమానస్పదంగా ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో పూజ తల్లిండ్రులు, గ్రామస్తులు భర్త ఇంటిపై దాడికి పాల్పడి ఇంటిని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకొని కుటుంబసభ్యులకు నచ్చచెప్పడానికి ప్రయత్నించినప్పటికి వినకుండా పోలీసులను, వార్త సేకరణకు వచ్చిన పాత్రి కేయులపై దాడి చేయగా ఒక పాత్రికేయునికి తీవ్రగాయాలయ్యాయి. తమ కూతురిని హత్యచేసి, ఆత్మహత్యగా చిత్రికరిస్తున్నారని మృతురాలి తల్లి దండ్రులు ఆరోపించారు. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తపరిస్థితులు నెల కొనడంతో రామాయంపేట సిఐ వెంకటరాజాగౌడ్ సంఘటన స్థలానికి చేరు కొని బంధువులకు నచ్చచెప్పారు. మెదక్ నుండి వచ్చిన క్లూస్‌టీం సభ్యులు వివరాలను సేకరించారు. కుటుంబసభ్యులకు నచ్చచెప్పి తహశీల్దార్ మన్నన్ ఆధ్వర్యంలో శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల బందోబస్తు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. సంఘటన స్థలాన్ని తూప్రాన్ డిఎస్పీ వెం కటరెడ్డి పరిశీలించి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పూజ (ఫైల్)

# పంట రుణాల్లో కోత.. రైతులకు గుండెకోత

## యేటా మారని బ్యాంకుల తీరు

## ఖరీఫ్, రబీలో రూ.90,715 కోట్ల లక్ష్యం..

## ఇచ్చింది రూ.67,183 కోట్లు

## పెట్టుబడి కోసం అన్నదాతల అవస్థలు

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త :** వ్యవసాయంలో అత్యంత కీలకమైన వానాకాలం, యాసంగి సీజనుకు సంబంధించి రుణాల విషయంలో తెలంగాణ రైతుల పట్ల బ్యాంకులు ఉదాసీన వైఖరి అవలం బిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాల మేరకు ప్రధానంగా సన్న, చిన్నకారు రైతులకు రుణాలు అందించడంలో బ్యాంకులు ఘోరంగా విఫలమవుతున్నాయి. వార్షిక లక్ష్యాలను గోప్పగా ప్రకటిస్తున్నా వాటిని పూర్తి స్థాయిలో చేరుకోవడం లేదు. ఈ నేపథ్యంలో బ్యాంకుల నుండి అన్నదాతలకు సహకారం నామమాత్రంగానే ఉంటోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత యాసంగితో పాటు, వానాకాలం సీజనులో రైతులకు పంట రుణాలు ఇవ్వడంలో బ్యాంకులు మొండి చెయ్యి చూపించాయి. లక్ష్యాలు ఘనంగా ఉన్నా, వాటి ఆచరణలో మాత్రం వెనుకబడిపోతున్నాయి. ఈ సీజన్లలో కలిపి ఎస్ఎల్ బీసీ (స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ) రూ.90,795.19 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని లక్ష్యాలను నిర్ధారించింది. ఇందులో వానాకాలంలో 60 శాతం, యాసంగిలో 40 శాతం చొప్పున రైతులకు పంట పంపిణీ చేయాలని బ్యాంకర్లకు నిర్దేశించింది. అయితే గడచిన వానాకాలంలో రూ.54,480 కోట్ల లక్ష్యం పెట్టుకోగా, బ్యాంకులు 24 లక్షల 5 వేల 419 మంది రైతులకు రూ.44,438 కోట్ల రుణాలు మాత్రమే అందించాయి. దీంతో ఆ సీజన్లో లక్ష్యాల కంటే రూ.10 వేల కోట్లను కోత పెట్టింది. ఇక ప్రస్తుత యాసంగి సీజనులో రూ.36,315.19 కోట్ల లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటి వరకూ 15 లక్షల 84 వేల 772 మంది రైతులకు రూ.22,744.92 కోట్ల రుణాలు మాత్రమే ఇచ్చాయి. ఇలా 2 సీజన్లలో 39 లక్షల 90 వేల191 మంది రైతులకు రూ.67,182.92 కోట్ల రుణాలు(74 శాతం) అందించాయి. అయితే ఈ మేరకు రుణాలు ఇచ్చినట్లు బ్యాంకులు చెబుతున్నా, వ్యవసాయ పెట్టుబడికి కొత్తగా రుణాలు ఇవ్వక, వడ్డీలు కట్టించుకుని ఎక్కువగా బుక్ అడ్జిష్‌మెంట్లు చేయడం విశేషం.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పట్టాదారుల సంఖ్య సుమారు 65 లక్షలు ఉండగా, బ్యాంకులు మాత్రం 33.85 లక్షల మంది రైతులకు మాత్రమే పంట రుణాలు అందచేస్తున్నాయి. ఇంకా 31 లక్షల మంది రైతుల పంట రుణాలు దూరంగా ఉంటున్నారు. ఇక జనవరి చివరి నాటికే జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) కొత్త ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రుణ ప్రణాళికను విడుదల చేస్తోంది. అయితే బ్యాంకర్ల కమిటీ రుణ ప్రణాళికలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

అలాగే రాష్ట్ర బ్యాంకర్ల కమిటీ రాష్ట్ర రుణ ప్రణాళికను ఆలస్యంగా విడుదల చేస్తున్నా, జిల్లాల్లో లీడ్ బ్యాంకుల ఆధ్వర్యంలో జిల్లా రుణ ప్రణాళికలు నఆమోదించడంలో మరింత తీవ్ర జాప్యమవుతోంది. దీంతో పంట రుణాలు ఇవ్వడం ఆలస్యంగా ప్రారంభమవడమే కాకుండా నిర్దేశించిన లక్ష్యాలను చేరక వెనుకబడి పోతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులకు సాగు పెట్టుబడి ఖర్చుల కోసం అధిక వడ్డీలకు ప్రైవేటు అప్పులు చేయక తప్పడం లేదు. వరి, పత్తి లాంటి ఏ పంటలు సాగు చేయాలన్నా ఎకరానికి 40 వేల రూపాయలకు మించిన పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం రైతు భరోసా కింద ఎకరానికి 12 వేల రూపాయలు మాత్రమే ఇవ్వడంతో సాగు పెట్టుబడి ఖర్చుల కోసం అధిక వడ్డీలకు ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వద్ద అప్పులు చేస్తున్నారు. ఫలితంగా రైతులు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

# మురునీటి వ్యవస్థ మరింత బలోపేతానికి చర్యలు

## అధునాతన ఎస్‌టిపిల నిర్మాణాలు

## ప్రతిరోజు 1,650 మిలియల్ గ్యాలన్ల మురుగునీరు

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త:** హైదరాబాద్ మహానగరంలో మురుగు నీటి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. హైదరాబాద్ అర్బన్ ఆగ్లోమెరేషన్ పరిధిలో ప్రస్తుతం రోజూ 1950 మిలియన్ గ్యాలన్ల మురుగు నీరు వస్తుంది. ఇందులో జిహెచ్ఎంసి ప్రాంతంలో 1650 మిలియన్ గ్యాలన్లు వస్తుంది. ఇప్పటికే 25 ఎస్‌టిపిల ద్వారా 772 మిలియన్ గ్యాలన్ల మురుగు నీటిని శుద్ధి చేస్తున్నారు. ఇక మిగిలిన 878 మిలియన్ గ్యాలన్ల మురుగు నీటిని శుభ్రం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 31 నూతన మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాలు చేపట్టింది. వీటిని నిర్మించే బాధ్యతను జలమండలిపై పెట్టింది. రూ.3,866.21 కోట్ల వ్యయంతో 3 ప్యాకేజీల్లో 5 సర్కిళ్లలో నిర్మిస్తున్నారు. వీటి నిర్మాణం ద్వారా 100 శాతం మురుగును శుద్ధి చేయడమే కాకుండా పరివాహక ప్రాంతాల్లో మురుగు ప్రవాహాన్ని నిరోధించడం, శుద్ధి చేసిన నీటిని మానవేతర అవసరాలకు వినియోగించవచ్చు. అంతేకాకుండా భూగర్భ జలాలు కలుషితం కాకుండా.. పర్యావరణం, ప్రజారోగ్యం పై ఎలాంటి దుష్పలితాలు ఉండవు. ఇవి పూర్తయి అందుబాటులోకి వస్తే రోజూ ఉత్పత్తయ్యే మురుగును 100 శాతం శుద్ధి చేసే తొలి నగరంగా దక్షిణాసియాలోనే హైదరాబాద్ ఖ్యాతికెక్కుతుంది. ఈ 31 ఎస్‌టిపిలు అందుబాటులోకి వస్తే నగరంలో మురుగు సమస్యకు పరిష్కారం లభిస్తుంది. వీటి ద్వారా రోజూ 1259.50 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేయవచ్చు. అధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో కొత్త ఎస్‌టిపిల నిర్మాణం జరుగుతుంది. జలమండలి ఎస్‌టిపి ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న వాటిల్లో ఇప్పటికే 11 ఎస్‌టిపిలు(దుర్గం చెరువు 7 ఎంఎల్‌డి, కోకాపేట15 ఎంఎల్‌డి, మిరాలం 141.5 ఎంఎల్‌డి, పెద్ద చెరువు 17.5 ఎంఎల్‌డి, నల్లచెరువు 86.5 ఎంఎల్‌డి, నాగోల్ 320ఎంఎల్‌డి, మియాపూర్ పటేల్ చెరువు7ఎంఎల్‌డి, సఫిల్‌గూడ 5.5 ఎంఎల్‌డి, ఖాజాకుంట 20ఎంఎల్‌డి, ఫతేనగర్ 133ఎంఎల్‌డి, వెన్నెలగడ్డ 10ఎంఎల్‌డి,) ప్రారంభమయ్యాయి. మరో 6 ఎస్‌టిపిలు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిలో శివాలయనగర్14 ఎంఎల్‌డి, నల్లగండ్ల 7ఎంఎల్‌డి, ముల్లకతువ చెరువు 25ఎంఎల్‌డి, అత్తాపూర్ 164ఎంఎల్‌డి, అంబర్‌పేట్212.50 ఎంఎల్‌డి, పాలపిట్ట పార్క్ 7ఎంఎల్‌డి, ఎస్‌టిపిలున్నాయి. మిగిలిన 3 ఎస్‌టిపిలను రైన్బో విస్టా 43.5 ఎంఎల్‌డి, రామచెరువు 30 ఎంఎల్‌డి, అత్తాపూర్వార్ 240ఎంఎల్‌డి, ఎస్‌టిపిలను జూన్ 2025 నాటికి నిర్మాణం పూర్తి చేస్తారు. సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీ : అధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో కొత్త ఎస్‌టిపిల నిర్మాణం జరుగుతోంది. మెట్రో నగరాల్లో స్థలాభావం ఉంటుంది కాబట్టి ఎస్బీఆర్ టెక్నాలజీతో నిర్మాణం అనువుగా ఉంటుంది. వీటి వల్ల ఒకే ఛాంబర్లో ఐదు స్టేజీల మురుగునీటి శుద్ధి ప్రక్రియ జరిగి తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ నీటిని శుద్ధి చేయవచ్చు.

# విద్యుత్ డిమాండ్‌పై కార్యాచరణ

## ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త :** భవిష్యత్ విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టుగా కార్యాచరణను రూపొందించాలని ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతోందని, దీన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఈ మేరకు హైదరాబాద్ విద్యుత్ సౌధలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ అందుకు తగినట్లుగా రాబోయే ఐదు సంవత్సరాల వరకు పెరిగే డిమాండ్‌ను అంచనా వేయాలన్నారు. అంతేకాకుండా ఆమేరకు పెరిగే కరెంట్‌ను సమర్థవంతంగా సరఫరా చేసేందుకు వీలుగా నెట్వర్క్‌ను బలోపేతం చేయాలని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో అత్యధిక డిమాండ్ 16877 మెగావాట్లకు చేరుకుంటుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ అంచనా వేసిందని తెలిపారు, కానీ వాస్తవంగా గరిష్ట డిమాండ్ 17162 మెగా వాట్లుగా అంచనాలకు మించి నమోదయ్యిందని తెలిపారు. అలాగే 2026 లో గరిష్ట డిమాండ్ 18138 మెగా వాట్లకు పెరుగుతుందని అంచనా వేసిందని వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామిక, ఇతర రంగాల అభివృద్ధి నేపథ్యంలో గరిష్ట డిమాండ్ 19000 19500 మెగావాట్లకు మించే అవకాశం ఉన్నందున అధికారులు దానికి తగినవిధంగా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలకు సైతం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు సమర్థవంతమైన ఏర్పాట్లు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో దక్షిణ తెలంగాణ విద్యుత్‌పంపిణి సంస్థ సిఎండి ముషారఫ్ ఫరూఖీ, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యలను తీర్చకుంటే ఉద్యమం ఉధృతం

## కార్యాచరణ ప్రకటించిన పెన్షనర్ల జెఏసి

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మే 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి ఒకటిన్నర సంవత్సరాల కావస్తున్న కూడా తమకు సంబంధించిన పెండింగ్ సమస్యలను నేటికీ పరిష్కరించక పోవడాన్ని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల గెజిటెడ్ అధికారుల ఉపాధ్యాయుల కార్మికుల పెన్షనర్స్ ఐక్య కార్యాచరణ సమితి ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల గెజిటెడ్ అధికారుల ఉపాధ్యాయుల కార్మికుల పెన్షనర్స్ ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ మారం జగదీశ్వర్ అధ్యక్షతన సదస్సు జరిగింది. సదస్సులో అందరి అభిప్రాయాలు, సూచనలు తీసుకున్న అనంతరం ప్రభుత్వంపై ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. 15న రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాల వద్ద భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శ నలు చేయాలని, అదే విధంగా జూన్ 9న ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా చేపట్టారు నిర్ణయించారు. ప్రభుత్వం గనుక స్పందించకపోతే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యా లయాల్లో పని వేలల్లో మాత్రమే పని చేయడం, ప్రభుత్వ కార్యాలయం నుండి మానవహారాలు, సాంఘిక భోజనాలు చేయడం, పెండౌన్, సామూహిక సెలవులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కనిపిస్తుంది విస్తృత విశాల ఉద్యమాన్ని నిర్మించడానికి వెనుకాడే ప్రసక్తి లేదని, ప్రత్యక్ష కార్యచరణ ప్రకటించాల్సి వస్తుందని హెచ్చరించారు. తెలంగాణ సమాజం ఎల్లకాలం అణిచివేతను, సాచివేతను, అలచాట్లను, అవమా నాన్ని పరిచిన చరిత్ర లేదని చైర్మన్ జగదీశ్వర్ అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు సంబంధించిన అన్ని సమస్యల పరిష్కారం అవుతాయని భావించామని, కాని అవి అపరిష్కృతంగానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న ఉద్యోగసంఘాల ప్రతి నిధులు డిమాండ్లను ఆమోదించారు. యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ బిల్స్ ను క్లియర్ చేయాలని, 5 డిఎలను వెంటనే విడుదల చేయాలి, ఉద్యోగుల (ఈహెచ్ఎస్) ఆరోగ్యం రక్షణ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలుచేయాలి, సిపిఎస్ ను రద్దు చేయాలి, వేతన సవరణ కమిటీ నివేదికను వెంటనే తెప్పించుకుని 51శాతం ఫిట్‌మెంట్ తో అమలు చేయాలి, స్థానికత ప్రాతిపదికగా అదనపు పోస్టులు సృష్టించి 317 జిఓ ను అమలు చేయాలి, అన్ని ప్రభుత్వ శాఖలలో పదోన్నతుల కమిటీలను సకాలంలో ఏర్పాటు చేసి పదోన్నతులను ఇవ్వాలి, ఎన్నికల సమయంలో నిర్వహించిన బదలీ చేసిన ఉద్యోగులను తిరిగి వారి పూర్వ స్థానాలకు చేర్చాలి, 2025 సంవత్సరానికి సాధారణ బదలీలు మే, జూన్ లోనే చేయాలి అని సమావేశం డిమాండ్ చేసింది. ఈ సదస్సులో సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శి పి దామోదర్ రెడ్డి, కో చైర్మన్లు చావా రవి, రవీందర్ రెడ్డి, జి సదానందం గౌడ్, దాస్య నాయక్, తిరుపతి, మహిపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లింగారెడ్డి, వైస్ చైర్మన్లు ఎస్ఏ హుసేని (ముజీబ్), చంద్రమోహన్, అంజిరెడ్డి, శ్రీధర్, నరహరి, చంద్రశేఖర్ గౌడ్, సత్యనారాయణ రెడ్డి, తిప్పర్తి యాదయ్య, దామోదర్ రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.




తెలంగాణ ఉద్యోగుల గెజిటెడ్ అధికారుల ఉపాధ్యాయుల కార్మికుల పెన్షనర్ల జెఏసి సమావేశంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల ముఖ్యనాయకులు

# కేంద్రం నిధులిచ్చినా మొండిచేయి ఆరోపణలు..

# కెసిఆర్, రేవంత్‌లకు అలవాటుగా మారింది

## మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్

**హైదరాబాద్, మే 4, ప్రభాతవార్త :** కేంద్రానికి ఎన్నిసార్లు నిధులు కావాలని విజ్ఞప్తులు చేసినా కేంద్రం మొండిచేయి చూపుతుందని ఆరోపించడం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ మండిపడ్డారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కోసం లక్షల కోట్ల రూపాయలు తెలంగాణకు మంజూరు చేసిందన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించిన చర్లపల్లి రైల్వే టర్మినల్ కోసం గతంలో మాజీ సిఎం కెసిఆర్‌ను భూమి కేటాయించాలని నేను పలుమార్లు కోరడం జరిగింది. అయినా భూములు ఇవ్వలేదన్నారు. అదే రైల్వే భూమిలో నిర్మాణం పూర్తయి ప్రజలకు అంకితమయిన తర్వాత కూడా ఈ నాలుగు నెలల కాలంలో అదనంగా కొత్తగా ఒక్క వీధిలైట్ కూడా వేయలేదని అన్నారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం రూ.600 కోట్లు కేటాయించినా, అక్కడ స్తంభాలు మార్చడానికి, పైపులైన్లు మార్చడానికి గత బిఆర్ఎస్ సర్కారు ఆరు సంవత్సరాలు జాప్యం చేసిందన్నారు. కేంద్ర పథకాలు, ప్రాజెక్టుల అమలుకు సహకరించకుండా పనిచేయడం స్థానిక సంస్థలు నిర్వీర్యం అయ్యాయి. కేంద్రం నిధులు ఇస్తుంటే కూడా రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించడంలో విఫలమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రభుత్వ పథకాల అమలుకు, వివిధ ప్రాజెక్టులకు సహాయనిరాకరణ చేస్తూ, అభివృద్ధి అడ్డంకిగా మారుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.



# బడా కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు చెల్లిస్తారు..

# విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వరా?

## మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 4:** కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరి విద్యార్థుల పాలిట శాపంగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. బడా కాంట్రాక్టర్లకు వేల కోట్ల బిల్లులు చెల్లిస్తారు కానీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వారా అని ప్రశ్నించారు. విద్యార్థుల చదువును, వారి జీవితాలను కాంగ్రెస్ సర్కార్ ప్రశ్నార్థకం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిగ్రీ కాలేజీలకు ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో ఆరు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన పథకాన్ని ఎలాంటి మార్పు లేకుండా కేసీఆర్ అమలు చేసి గొప్ప మనసు చాటుకున్నారని తెలిపారు. బీఆర్ఎస్ హాయంలో కరోనా వంటి ఆర్థిక సంక్షోభ కాలం సహా, ఏనాడు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఆపలేదని ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. బడా కాంట్రాక్టర్లకు వేలకోట్ల బిల్లులు చెల్లిస్తారు కానీ, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించరా?. కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్య వైఖరి, విద్యార్థుల పాలిట శాపంగా మారింది. వారి చదువును, జీవితాలను ప్రశ్నార్థకం చేస్తున్నదన్నారు. డిగ్రీ కళాశాలలకు దాదాపు రూ.800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో 6 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఆగమ్యగోచడంలో పడింది. డిగ్రీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు ప్రభుత్వాన్ని వేడుకునే దుస్థితి రావడం ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమన్నారు.

సకాలంలో పరీక్ష నిర్వహించకపోవడంతో పీజీసెట్, లా సెట్, ఇతర పోటీ పరీక్షలు రాయడానికి మూడో సంవత్సరం విద్యార్థులు అర్హత కోల్పోతున్నారు. ఏప్రిల్ నెలలో జరగాల్సిన డిగ్రీ పరీక్షలను కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మా గాంధీ, పాలమూరు యూనివర్సిటీ పరిధిలో ఇప్పటికీ నిర్వహించకపోవడం ప్రభుత్వ చేతగాని తనమే. మరోవైపు ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు డిగ్రీ పరీక్షలు నిర్వహించకుండా నిరసనలు తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తున్నదని దుయ్యబట్టారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో యాజమాన్యాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. కళాశాల యాజమాన్యాలు అప్పులు తెచ్చి బోధన, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లిస్తున్న పరిస్థితి. అద్దెలు, అప్పులు పెరిగిపోవడంతో ఈ ఏడాది డిగ్రీ అడ్మిషన్లను నిలిపివేయగా, కొన్నిచోట్ల కళాశాలలకు తాళం వేసి ఇప్పటికే సెలవులు ప్రకటించారు. ఇంత జరుగుతుంటే తమకేమీ పట్టనట్లు సీఎం, మంత్రులు వ్యవహరిస్తుండడం సిగ్గుచేటు అని తప్పుపట్టారు. విద్యార్థుల భవిష్యత్తును, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని దివంగత సీఎం వైఎస్ ప్రారంభించిన పథకాన్ని ఎలాంటి మార్పు లేకుండా కేసీఆర్‌అ మలు చేశారు. గొప్ప మనసు చాటుకున్నారు.

కరోనా వంటి ఆర్థిక సంక్షోభ కాలం సహా, ఏనాడు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఆపలేదని తెలిపారు. ప్రతి ఏటా సగటున రూ. రెండు వేల కోట్లు, తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో మొత్తం రూ.19 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేశాం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం 17 నెలల్లో 17 పైసలు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద విడుదల చేయలేదు.

ఈ ప్రభుత్వ ప్రాధాన్యాల్లో విద్య అనేది మిథ్య అని స్పష్టమవుతున్నదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఇంకా మెరుగైన రీతిలో కొనసాగిస్తామని మేనిఫెస్టోలో చెప్పి, పథకాన్ని మరుగునపడేలా చేశారని ఆరోపించారు. పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లిస్తామని మొన్న నిండు అసెంబ్లీలో ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు గాలి మాటలే అయ్యాయి. రెండు నెలల్లో మొత్తం బకాయిలు క్లియర్ చేస్తామని, కళాశాల యాజమాన్యాలకు ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క ఇచ్చిన హామీ నీటి మూటలే అయ్యాయి. మాటమీద నిలబడేది లేదు, ఇచ్చిన హామీలు నెరవేర్చేది లేదు. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు అందరిదీ అదే దారిఅని దుయ్యబట్టారు.

5-5pg10exWQEH.qxd:5-5pg10exWQEH.qxd 05/05/25 12:02 AM Page 1



ఆట



## మహిళల హాకీలో.. ఆస్ట్రేలియా చేతిలో
# భారత్ చిత్తు

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత మహిళల హాకీ జట్టు వైఫల్య ప్రదర్శన కొనసాగుతున్నది. మహిళల హాకీ సిరీస్ చివరి మ్యాచ్‌లో భారత్ 2-3 తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. పెర్త్ హాకీ స్టేడియంలో జరిగిన నాల్గవ మ్యాచ్‌లో భారత మహిళల హాకీ జట్టు ఉత్సాహభరితమైన పోరాటాన్ని ప్రదర్శించినా, ఆస్ట్రేలియా చేతిలో ఓటమి తప్పలేదు. భారత్ తరపున నవనీత్ కౌర్ (35వ నిముషం), లాల్రెమ్సియామి (59వ నిముషం) గోల్స్ చేయగా, గ్రేస్ స్టీవర్ట్ (2వ నిముషం), జాడే స్మిత్ (36వ నిముషం), మరియు గ్రెటా హేస్ (42వ నిముషం) గోల్స్ చేయడంతో ఆస్ట్రేలియా ఆతిథ్య జట్టును ఓడించింది. మొదటి క్వార్టర్ ప్రారంభంలోనే ఆస్ట్రేలియా గోల్ చేసి, రెండో నిమిషంలోనే 1-0 ఆధిక్యంలోకి వెళ్ళింది. క్వార్టర్‌లో మిగిలిన సమయంలో భారత్ ఈక్వలైజర్ కోసం తీవ్రంగా ప్రయత్నించింది కానీ గోల్ చేయలేకపోయింది. ఇక రెండవ క్వార్టర్‌లో, భారత్ బాగా ఆదుకుంది. ప్రారంభంలోనే లభించిన పెనాల్టీ కార్నర్‌ను మరియు చివరిలో వచ్చిన మరో సెట్‌పీస్ ముప్పును విజయవంతంగా తిప్పికొట్టింది, హాఫ్ టైమ్‌లో లోటును ఒకే గోల్‌కు పరిమితం చేసింది. మూడో క్వార్టర్‌లో నవనీత్ 35వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి 1-1తో భారత్‌ను ముందుకు తీసుకెళ్లింది. అయితే, 36వ నిమిషంలో స్మిత్ ఫీల్డ్ గోల్ చేయడంతో ఆస్ట్రేలియా వెంటనే ఆధిక్యాన్ని పునరుద్ధరించింది. ఆస్ట్రేలియా మరో రెండు పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకున్న తర్వాత 42వ నిమిషంలో హేస్ ఆతిథ్య జట్టు ఆధిక్యాన్ని పెంచాడు. చివరి క్వార్టర్ చివరిలో లాల్రెమ్సియామి గోల్ చేయడంతో భారతదేశం ఆధిక్యాన్ని తగ్గించింది, కానీ ఆస్ట్రేలియా విజయాన్ని ఖాయం చేసుకోవడానికి దృఢంగా నిలబడి సత్తా చాటి చివరకు విజయం సాధించింది.




## కెకియావో డైమండ్ లీగ్‌లో..
# సాబ్లెకు 8వ స్థానం

**న్యూఢిల్లీ:** కెకియావో డైమండ్ లీగ్‌లో 3000 మీటర్ల స్టీపుల్ చేజ్‌లో భారత్ యువ అథ్లెట్ అవినాష్ సాబుల్ 8వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. కెకియావో వేదికగా జరిగిన పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్‌లో సాబ్లె 8 నిమిషాల 23.85 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తిచేశాడు. అయితే ఇది అతని వ్యక్తిగత ఉత్తమ సమయం మరియు జాతీయ రికార్డు 8:09.91 కంటే చాలా దూరంగా ఉంది. కాగా గత వారం జియామెన్‌లో జరిగిన ఈ సంవత్సరం తన మొదటి ఢిల్లీ మీట్‌లో సాబుల్ పాల్గొని, దాన్ని 8:22.59 సమయంతో ముగించాడు. దీనికి ముందు, 30 ఏళ్ల అతను చివరిసారిగా సెప్టెంబర్ 2024లో జరిగిన డైమండ్ లీగ్ ఫైనల్‌లో పాల్గొన్నాడు, అక్కడ అతను 8:17.09 సమయంతో తొమ్మిదో స్థానంలో నిలిచాడు. అయితే, సేబుల్ తన అర్హత ర్యాంక్ 12ని మెరుగుపరుచుకున్నాడు, అది అతనికి ఒక అర్హత పాయింట్‌ను తెచ్చిపెట్టింది. 2024 పారిస్ ఒలింపిక్ క్రీడల్లో 8:14.18 సమయంతో 11వ స్థానంలో నిలిచిన సాబుల్, తన పారిస్ 2024 ప్రదర్శన ఆధారంగా సెప్టెంబర్‌లో టోక్యోలో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లకు ఇప్పటికే అర్హత సాధించాడు. ఇక అబ్రహం సిమ్ 8:07.92 సమయంలో అందరికంటే ముందు నిలిచాడు. ఇథియోపియన్ 2000 మీటర్ల మార్కు ద్వారా ఆధిక్యాన్ని నెలకొల్పాడు. కెన్యాకు చెందిన ఎడ్మండ్ సెరెమ్ (8:08.68) మరియు సైమన్ కిప్రోప్ కోచ్ (8:09.05) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. మొరాకోకు చెందిన అబ్దేరాఫియా బౌసెల్ దీవినీగా ట్యాగ్ చేయబడటానికి ముందు కిలోమీటర్ మార్కు వరకు ఆధిక్యంలో ఉన్నాడు. స్పెయిన్‌కు చెందిన డేనియల్ ఆర్స్, కెన్యాకు చెందిన చెమియాట్ విల్బర్‌ఫోర్స్ కోన్స్ రేసును పూర్తి చేయలేకపోయారు. జియామెన్‌లో మొరాకోకు చెందిన ప్రస్తుత ఒలింపిక్ మరియు ప్రపంచ ఛాంపియన్ సౌఫియానే ఎల్ బక్కాలిని ఆశ్చర్యపరిచిన సిమ్ స్వదేశీయుడు శామ్యూల్ ఫై రేవు 8:11.18తో ఆరో స్థానంలో నిలిచాడు. గత శనివారం ఫైర్వే 8:05.61 సమయంతో ఆరో స్థానంలో నిలిచాడు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతక విజేత అబ్రహం కిబివోట్ ఏడో స్థానంలో నిలిచాడు.

# ఐపిఎల్‌లో ఖరీదైన ఓవర్
## టాప్ 5లో జడేజా.. ఒక ఓవర్ 37 రన్స్‌తో అగ్రస్థానంలో క్రిస్ గేల్



**న్యూఢిల్లీ:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), చెన్నై సూపర్ కింగ్స్‌ను వారి సొంత మైదానంలో 2 పరుగుల తేడాతో ఓడించి ఐపిఎల్ -2025లో ఎనిమిదో విజయాన్ని నమోదు చేసింది. ఈ సీజన్‌లో చెన్నైకి ఇది తొమ్మిదో ఓటమి. ఇక ఆర్‌సీబీ తరపున ఆడిన ఈ మ్యాచ్‌లో రొమారియో షెపర్డ్ 14 బంతుల్లో 53 పరుగులు చేశాడు. ఖలీల్ అహ్మద్ వేసిన ఒక ఓవర్లో అతను 33 పరుగులు చేశాడు. ఐపిఎల్ 2025లో ఇదే అత్యంత ఖరీదైన ఓవర్‌గా నిలిచింది. ఇలాగే ఐపిఎల్ చరిత్రలో టాప్5 అత్యంత ఖరీదైన ఓవర్ల గురించి తెలుసుకుంటే ఆర్‌సీబీ ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో ఖలీల్ అహ్మద్ చెన్నై తరపున బౌలింగ్ చేయడానికి వచ్చాడు. అతను 33 పరుగులు ఇచ్చాడు. ఐపిఎల్ 2025లో అత్యంత ఖరీదైన ఓవర్ బౌలింగ్ వేశాడు. అంతేకాకుండా, ఐపిఎల్ చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఒకే ఓవర్లో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్ అయ్యాడు. అతను 4 సంవత్సరాల రికార్డును బద్దలు కొట్టాడు. 2020లో రాజస్థాన్ రాయల్స్ పై లుంగీ న్గిడి, 2021లో కోల్‌కతా నైట్ రైడర్స్ పై సామ్ కుర్రాన్ తలా 30 పరుగులు ఇచ్చాడు. 2019లో, డ్వేన్ బ్రావో వేసిన ఓవర్‌లో ముంబై ఇండియన్స్ బ్యాట్స్‌మెన్ 29 పరుగులు చేశారు. ఖలీల్ 3 ఓవర్లలో 65 పరుగులు ఇచ్చాడు. ఒక మ్యాచ్‌లో అత్యధిక పరుగులు ఇచ్చిన చెన్నై బౌలర్‌గా కూడా అతను నిలిచాడు. కాగా ఐపిఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన ఓవర్ గూర్చి తెలుసుకుంటే 8 మే 2011న ఆర్‌సీబీ బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్, కొచ్చి టస్కర్స్ కేరళ బౌలర్ పి. పరమేశ్వరన్‌పై ఒక ఓవర్‌లో 37 పరుగులు చేశాడు. పరమేశ్వర్ ఒక ఓవర్లో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్ అయ్యాడు. తన ఓవర్లో గేల్ 6, 6 (నోబాల్), 4, 4, 6, 6, 4 పరుగులు చేశాడు. అలాగే ఐపిఎల్ 2021లో, చెన్నై సూపర్ కింగ్స్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ఆర్‌సీబీ ఆటగాడు హర్షల్ పటేల్ వేసిన ఓవర్‌లో 37 పరుగులు చేశాడు. హర్షల్ వేసిన ఓవర్‌లో జడేజా 6, 6, 6 (నోబాల్), 6, 2, 6, 4 పరుగులు చేశాడు. ఐపిఎల్ 2022లో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ బౌలర్ డేనియల్ సామ్స్ ఒకే ఓవర్‌లో 35 పరుగులు ఇచ్చాడు. సామ్స్ ఓవర్‌లో కోల్‌కతాకు చెందిన పాట్ కమ్మిన్స్ 6, 4, 6, 6, 2 (నోబాల్), 4, 6 పరుగులు చేశాడు. తాజాగా 2025 ఐపిఎల్‌లో ఖలీల్ అహ్మద్ వేసిన ఓవర్‌లో రొమారియో షెపర్డ్ 33 పరుగులు చేశాడు. తన ఓవర్లో రొమారియో 6, 6, 6, 4, 6, 6 (నోబాల్), 0, 4 పరుగులు చేశాడు. 2014లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ (ఇప్పుడు పంజాబ్ కింగ్స్) తరపున పర్వీందర్ అవానా ఒక ఓవర్‌లో 33 పరుగులు ఇచ్చాడు. చెన్నై సూపర్ కింగ్స్‌కు చెందిన సురేష్ రైనా అవానా ఓవర్‌లో 6, 6, 4, 4, 4 (నోబాల్), 4, 4 పరుగులు చేశాడు.



## ఉత్కంఠ పోరులో.. కోల్‌కతా నైట్ రైడర్స్ గెలుపు

**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 18వ సీజన్ ప్లే ఆఫ్స్ రేసులోకి కోల్‌కతా నైట్ రైడర్స్ దూసుకొచ్చింది. ఆదివారం ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఉత్కంఠ పోరులో రాజస్థాన్ రాయల్స్‌ను ఒక్క పరుగు తేడాతో ఓడించింది. రియాన్ పరాగ్(95) పవర్ హిట్టింగ్‌తో భయపెట్టినా, హర్షిత్ రానా(241) రెండు వికెట్లతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అయితే 20వ ఓవర్లో శుభమ్ దూబే(25) 6, 4, 6 బాదడంతో కోల్‌కతా శిబిరంలో కలవరం మొదలైంది. కానీ, రెండో పరుగు తీసే క్రమంలో జోఫ్రా ఆర్చర్(12) రనౌటయ్యాడు. ఇక ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ సమిష్టి ప్రదర్శనతో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. ఆండ్రూ రస్సెల్(57 నాటౌట్) మెరుపులతో భారీ స్కోర్ కొట్టిన కోల్‌కతా ప్రత్యర్థిని 2025 పరుగులకే కట్టడి చేసింది. ఛేదనలో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(4)మరోసారి నిరాశపరిచాడు. వైభవ్ అరోరా బౌలింగ్‌లో టైమింగ్‌కు కుదరక.. అజింక్యా రహానే చేతికి చిక్కాడు. వరుసగా వికెట్లు పడినా కెప్టెన్ రియాన్ పరాగ్(32 నాటౌట్) మాత్రం పట్టువిడవలేదు. ఒంటరి పోరాటం చేసిన అతడు సిక్సర్లతో రెచ్చిపోయాడు. మోయిన్ అలీని ఉతికేస్తూ ఏకంగా ఐదు సిక్సర్లు బాది మ్యాచ్‌ను రాజస్థాన్‌ను వైపు తిప్పాడు. ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన హర్షిత్ రానా(241) ఈ ఇద్దరిని ఔట్ చేయడంతో కోల్‌కతా పోటీలోకి వచ్చింది. ఆ తర్వాత ఇంప్యాక్ట్ ప్లేయర్ శుభమ్ దూబే(25) వైభవ్ ఆరోరా వేసిన 20వ ఓవర్లో 6, 4, 6 బాదాడు. దాంతో, ఆఖరి బంతికి 3 పరుగులు అవసరమయ్యాయి. అయితే రెండో పరుగు తీసే క్రమంలో ఆర్చర్ రనౌట్ కావడంతో కోల్‌కతా ఒక్క రన్ తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది.

# టీమిండియాకు శ్రీలంక షాక్
## ఉత్కంఠ పోరులో 3 వికెట్ల తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే వరల్డ్ కప్ సన్నాహకాల్లో ఉన్న భారత జట్టుకు శ్రీలంక ఝలక్ ఇచ్చింది. ముక్కోణపు వన్డే సిరీస్‌లో అజేయంగా దూసుకెళ్తున్న హర్మన్ ప్రీత్ సేనను ఓడించింది. తొలి పోరులో కంగుతిన్న అనూహ్యంగా పుంజుకొని ఈసారి టీమిండియాకు షాకిచ్చింది. శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో జోరుమీదున్న భారత మహిళల జట్టుకు దీంతో కోలుకోలేని దెబ్బతిన్నట్లయింది. వరుసగా రెండు విజయాలతో టేబుల్ టాపర్‌గా ఉన్న హర్మన్ ప్రీత్ కౌర్ సేన ఎట్టకేలకు శ్రీలంక చేతిలో చిత్తయింది. ఆదివారం శ్రీలంక వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారీ స్కోర్లతో ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠ నెలకొనగా, లంక 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ ప్లేయర్లు రీచా ఘోష్ (58) అర్థ శతకానికి జెమీమా రోడ్రిగ్స్ (37) మెరుపులు తోడవ్వగా, భారత్ 275 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించి ఛేదనలో నీలాక్షి డిసిల్వా (56), హర్షిత సమర విక్రమ (53)లు హాఫ్ సెంచరీలతో



చెలరేగి జట్టుకు అద్భుత విజయాన్ని అందించారు. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (24), కష్వీ గౌతమ్ (17)లు ధనాధన్ ఆడడంతో ప్రత్యర్థికి భారత్ పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. ఇక టీమిండియా నిర్దేశించిన 279 పరుగుల ఛేదనలో లంక ఓపెనర్లు హాసిని పెరీరా (22), విష్మీ గుణరత్నే (33)లు అదిరే ఆరంభం ఇచ్చారు. తొలి వికెట్‌కు 30 రన్స్ జోడించిన హాసిని దీప్తి శర్మ త్రోకు రనౌట్‌గా వెనుదిరిగింది. ఆ తర్వాత హర్షిత సమరవిక్రమ (53), కెప్టెన్ చమరి ఆటపట్టు (23) భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోర్ బోర్డును ఉరికించారు. టెయిలెండర్లు అనుష్క సంజీవని(23 నాటౌట్), సుగంధిక కుమారి(19 నాటౌట్)లు అజేయంగా నిలబడి జట్టుకు 3 వికెట్ల విజయాన్ని అందించారు. ఇక గత పోరులో దక్షిణాఫ్రికాను చిత్తు చేసిన లంకకు ఇది రెండో విక్టరీ.

# వాణిజ్యం

# పాక్ రూపీతో పోలిస్తే భారత్ కరెన్సీ మెరుగు

**న్యూఢిల్లీ, మే 4:** ట్రంప్ సుంకాల భయం ఆసియాదేశాలలో ఎక్కువగా ఉన్న ప్రస్తుత సమయంలో భారత రూపాయి డాలర్‌తో పోటీ పడే సామర్థ్యం కలిగి ఉందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా చైనా అయినా, వియత్నాం అయినా, పాకిస్తాన్ అయినా లేదా ఇతర దేశాల సుంకాలు కూడా భారతదేశం కంటే ఎక్కువగా ఉన్నాయి. గత 10 సంవత్సరాల గురించి మాట్లాడుకుంటే డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి పనితీరు పాకిస్తాన్ కంటే చాలా మెరుగ్గా ఉంది. ప్రస్తుత సంవత్సరంలో డాలర్‌తో పోలిస్తే పాకిస్తాన్ రూపాయి దాదాపు ఒక శాతం తగ్గింది. మరో వైపు, ప్రస్తుత సంవత్సరంలో భారత రూపాయి దాదాపు ఒక శాతం లాభంతో ట్రేడవుతోంది. గత 10 సంవత్సరాల్లో అంటే 2015 నుంచి ఇప్పటివరకు భారత రూపాయి డాలర్‌తో పోలిస్తే తగ్గింది. 2016 సంవ



త్సరంలో డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి 6 శాతం పెరిగింది. అదే సమయంలో ప్రస్తుత సంవత్సరంలో భారత రూపాయి డాలర్‌తో పోలిస్తే ఎక్కువగా ట్రేడవుతోంది. అయితే గత 10 సంవత్సరాల్లో డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి రెండంకెల క్షీణతను చూసిన సంవత్సరం ఒకటుంది. 2022 సంవత్సరంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి 11 శాతం క్షీ ణతతో ముగిసింది. 5శాతం కంటే ఎక్కువ క్షీణత కనిపించిన సందర్భాలు మూడు ఉన్నాయి. సాజ్ 2022 కాకుండా 2018 సంవత్సరంలో దాదాపు 9 శాతం తగ్గుదల కనిపించింది. అయితే 2015 సంవత్సరంలో దాదాపు 5 శాతం తగ్గుదల కనిపించింది. మరోవైపు భారత రూపాయితో పోలిస్తే పాకిస్తాన్ రూపాయి పరిస్థితి చాలా దారుణంగా ఉంది. గణాంకాలను పరిశీలిస్తే పాకిస్తాన్ కరెన్సీ విధ్వంస స్థితిలో ఉన్నట్లు అనిపిస్తుంది. గత దశాబ్దంలో డాలర్‌తో పోలిస్తే పాకిస్థాన్ రూపీ పెరిగిన సందర్భం ఒక్కటే ఉంది. 2024 సంవత్సరంలో పాకిస్థాన్ రూపాయి 1.22 శాతం పెరుగుదల ఉంది. 2016 సంవత్సరంలో డాలర్‌తో పోలిస్తే పాకిస్థాన్ రూపాయి స్థిరంగా కనిపించింది. ప్రత్యేకత ఏమి టంటే గత పదేళ్లలో డాలర్‌తో పోలిస్తే పాకిస్తాన్ రూపాయి రెండంకెల క్షీణతను చూసిన 5 సంవత్సరాలు ఉన్నాయి. డేటా ప్రకారం 2022 సంవత్సరంలో 28.34 శాతం అతిపెద్ద క్షీణత కనిపించింది. దీనికి ముందు 2018లో పాకి స్థాన్ రూపాయి 25.62 శాతం తగ్గింది. 2023 సంవత్సరంలో 24.54 శాతం తగ్గుదల కనిపించింది. 2019 సంవత్సరంలో 11.60 శాతం, 2021లో 10.12 శాతం తగ్గుదల కనిపించింది. ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు పాకిస్తాన్ కరెన్సీ దాదాపు ఒక శాతం తగ్గుదల కనిపించింది. భారత కరెన్సీ, పాకిస్తాన్ కరెన్సీ మధ్య చాలా తేడా ఉంది. భారత దేశం, పాకిస్తాన్ మధ్య రాకపోకలు ఆగిపోయినప్పటికీ ఎవరైనా పాకిస్తానీ భారతదేశానికి రావాల్సి వస్తే, పాకిస్తాన్‌లోని రూ.10లక్షలు భారతదేశంలో రూ. 3,03,049.50గా మారతాయి. దీని అర్థం పాకిస్తాన్ కరెన్సీ భారతదేశం కంటే 3రెట్లు ఎక్కువ బలహీనంగా ఉంది. అలాంటి పరిస్థితిలో భారత రూపాయి పాకిస్తాన్ రూపాయికి నిరం తరం నష్ట పోతోందని చెప్ప వచ్చు.

# పతంజలి సూపర్ సక్సెస్‌కు మూలం డిమాండ్

**ముంబై, మే 4:** 2024 ఆర్థిక సంవత్సరంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆహార తినదగిన నూనెల విభాగం దాదాపు 70శాతం అత్యధిక ఆదాయ వాటాను సాధించింది. ఆ తర్వాత ఆహారం, ఇతర ఎఫ్ఎంజిసి విభాగాలు వచ్చాయి. వారి ఆదాయ వాటా దాదాపు 30 శాతంగా కనిపించింది. పతంజలి ఫుడ్స్ అనేది భారతదేశంలో వినియోగదారు ఉత్పత్తులు, తినదగిన నూనె ఉత్పత్తులను తయారు చేసే ఒక భారతీయ ఎఫ్ఎంజిసి కంపెనీ. ప్రత్యేక విషయం ఏమిటంటే పతంజలి ఫుడ్స్ ఉత్పత్తులకు డిమాండ్ నిరంతరం పెరుగుతుండటం వల్ల, ఆదాయం, లాభం కూడా పెరుగు తోంది.




ముందుగా ఆదాయం గురించి మాట్లాడు కుంటే.. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆదాయం 2025 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసిక ఫలితాలను కంపెనీ ఇంకా విడుదల చేయలేదు. కానీ మూడవ త్రైమాసికంలో ఆదాయం రూ.9,103.13 కోట్లుగా కనిపించింది. గత ఏడాది ఇదే త్రైమా సికంలో కంపెనీ ఆదాయం రూ.7,910.70 కోట్లు. దీని అర్థం కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన రూ.1,192.43 కోట్లు పెరిగింది. లాభం గురించి మాట్లా డుకుంటే, గత 4 త్రైమాసికాలలో కంపెనీ లాభం నిరంతరం పెరుగుతూనే ఉంది. 2023 డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ లాభం రూ.216.54 కోట్లు. ఒక సంవ త్సరం తర్వాత, అంటే డిసెంబర్ 2024 లో కంపెనీ లాభం రూ.370.93 కోట్లకు పెరిగింది. దీని అర్థం కంపెనీ లాభం రూ.154.39 కోట్లు పెరిగింది. రాబోయే రోజుల్లో కంపెనీ ఆదాయం, లాభం మరింత పెరిగే అవకాశం ఉందని పతంజలి అధికారులు భావిస్తున్నారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ మార్కెట్ క్యాప్ గురించి మాట్లాడు కుంటే, అది చాలా ఎక్కువగా ఉంది. ప్రస్తుతం, పతంజలి ఫుడ్స్ మార్కెట్ క్యాప్ దాదాపు రూ.69 వేల కోట్లు. ఇటీవల, కంపెనీల షేర్లలో క్షీణత కనిపించింది. దీని కారణంగా కంపెనీ మార్కెట్ క్యాప్ కూడా తగ్గింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రాబోయే రోజుల్లో పతంజలి ఫుడ్స్ మార్కెట్ క్యాప్ రూ.1 లక్ష కోట్ల కు మించి ఉండవచ్చు. పతంజలి తమ ఉత్పత్తులు పూర్తిగా హానిచేయనివని, ఎటువంటి రసాయనా లను కలిగి ఉండవని పేర్కొంది. అలాగే, వారి ఉత్పత్తులన్నీ సహజమైనవి, దీని కారణంగా వారి ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది. దీని ప్రభావం స్టాక్ మార్కెట్‌పై కూడా కనిపిస్తుంది. పెట్టుబడిదారుల ఆదాయాల గురించి మాట్లాడుకుంటే, పతంజలి ఫుడ్స్ షేర్లు గత ఒక నెలలో 4 శాతానికి పైగా పెరిగాయి. కాగా, పతంజలి షేర్లు 6 నెలల్లో 6 శాతానికి పైగా పెరిగాయి. బిఎస్ఇ డేటా గురించి మాట్లాడుకుంటే, ప్రస్తుత సంవత్సరంలో కంపెనీ షేర్లు 5 శాతం పెరిగాయి.

# రియల్ ఎస్టేట్‌లోకి పెట్టుబడుల వరద..

**ముంబై, మే 4:** దేశంలోని రియల్ ఎస్టేట్ రంగంలోకి ప్రత్యామ్నాయ పెట్టుబడులు (ఎఐఎఫ్) వెల్లువెత్తుతున్నాయి. 2024 డిసెంబర్ చివరి నాటికి రూ.73,903 కోట్లకు చేరాయి. గతేడాది డిసెంబరు నాటికి అన్ని రంగాల్లో ఎఐఎఫ్‌లు కలిపి రూ.5,06,196 కోట్లు రాగా, ఇందులో 15శాతం వాటా రియల్ ఎస్టేట్ రంగాలోకి వచ్చాయని ఒక నివేదిక వెల్లడించింది. నిధుల లేమీతో ఇబ్బందులు పడుతున్న ప్రాజెక్ట్‌లకు ఎఐఎఫ్ పెట్టుబడులు జీవాన్నిస్తున్నాయని, డెవలపర్లకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయని నివేదిక వెల్లడించింది. రియల్ ఎస్టేట్ తర్వాత అత్యధికంగా ఐటి, ఐటిఇఎస్ రంగంలోకి రూ.30,279 కోట్ల ఎఐఎఫ్ పెట్టుబడులు వెళ్లాయి. ఆతర్వాత ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.26,807 కోట్లు, ఎన్‌బిఎఫ్‌సి రూ.21,929 కోట్లు, బ్యాంకులు రూ.21,273 కోట్లు, ఫార్మా రూ.18,309 కోట్లు, ఎఫ్ఎంజిసి రూ.12,743 కోట్లు, రిటైల్ రూ.11,550 కోట్లు, పునరుత్పాదక ఇంధన రంగం రూ.11,433 కోట్ల చొప్పున ఎఐఎఫ్ పెట్టుబడులు ఆకర్షించగా, ఇరత రంగాల్లోకి రూ.2,77,970 కోట్లు, ఫార్మా రూ.18,309 కోట్లు, ఎఫ్ఎంసిజి రూ.12,743 కోట్లు, రిటైల్ రూ.11,550 కోట్లు, పునరుత్పాదక ఇంధన రంగం రూ.11,433 కోట్ల చొప్పున ఎఐఎఫ్ పెట్టుబడులు ఆకర్షించగా, ఇతర రంగాల్లోకి రూ.2,77,970 కోట్ల పెట్టుబడులు వెళ్లాయి. రియల్ ఎస్టేట్ అభివృద్ధి పరంగా వివిధ దశల్లో ఉన్న నిధుల సమస్యకు ఎఐఎఫ్ రూపంలో పరిష్కారం లభించినట్లయింది. దేశంలో సంపన్నులైన పెట్టుబడిదారులు ముఖ్యంగా కనీసం రూ.కోటి పెట్టుబడి పెట్టగల హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్, సంస్థల కోసం ఉద్దేశించిన ప్రైవేట్ పెట్టుబడి సమీకరణ సాధనాలే ఈ ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్. 2012 ఎఐఎఫ్ నిబంధనల ప్రకారం సెక్యూరిటీస్ అండ్ ఎక్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) వీటిని నియంత్రిస్తుంది. స్టాక్స్, బాండ్లు, మ్యూచువల్ ఫండ్స్ వంటి సంప్రదాయ పెట్టుబడులకు భిన్నంగా ప్రైవేట్ ఈక్విటీ, వెంచర్ కేపిటల్, హెడ్జ్ ఫండ్స్, రియల్ ఎస్టేట్, కమోడిటీస్, డెరివేటివ్స్ వంటి సంప్రదాయేతర ఆస్తుల తరగతులలో ఎఐఎఫ్ పెట్టుబడులు పెడతారు.



# ఐపిఒకు అర్బన్ కంపెనీ

**ముంబై, మే 4:** అర్బన్ కంపెనీ పెట్టిన ఈ ప్రతిపాదన కారణంగా ఆక్సెల్, ఎలివేషన్ కేపిటల్, టైగర్ గ్లోబల్, వైక్యాపిటల్ వంటి కంపెనీ పెట్టుబడిదారులు తమ వాటాలను విక్రయిస్తున్నందున ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.429 కోట్ల కొత్త ఇష్యూ, రూ.1,471 కోట్ల సెకండరీ షేర్ అమ్మకం జరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అర్బన్ కంపెనీ కొత్త టెక్నాలజీ అభివృద్ధితో పాటు క్లౌడ్ మౌలిక సదుపాయాల కోసం కంపెనీ రూ.190 కోట్లు ఖర్చు చేయనుంది. మిగిలిన డబ్బును ఆఫీస్ రెంట్, మార్కెటింగ్ కార్యకలాపాలలో పెట్టుబడి పెట్టనుంది. గతంలో అర్బన్ కంపెనీ రూ.3,000 కోట్ల ఐపీఓ తీసుకురాబోతుందని వార్తలు హల్‌చల్ చేశాయి. కానీ ఇప్పుడు దానిని రూ.1,900 కోట్లకు తగ్గించారు. ఈ ఐపీఓ కోసం అర్బన్ కంపెనీ కోటక్ మహీంద్రా క్యాపిటల్, మోర్గాన్ స్టాన్లీ, గోల్డ్‌మన్ సాచ్స్, జేఎం ఫైనాన్షియల్‌లను తన బ్యాంకర్లుగా నియమించింది. ఈ కంపెనీ వ్యవస్థాపకులు అభిరాజ్ సింగ్ భాల్, వరుణ్ ఖైతాన్, రాఘవ్ చంద్ర, కంపెనీలో దాదాపు 21 శాతం వాటాను కలిగి ఉన్నారు. వారు ఈ ఐపీఓలో తమ వాటాను విక్రయించడం లేదు. 2025 ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో అర్బన్ కంపెనీ రూ. 846 కోట్ల నిర్వహణ ఆదాయాన్ని నమోదు చేసింది. ఇది గత సంవత్సరం కంటే 41 ఎక్కువగా ఉంది. ఈ కాలంలో కంపెనీ రూ.242 కోట్ల నికర లాభాన్ని నమోదు చేయగా గత ఏడాది ఇదే సమయానికి రూ.58 కోట్ల నష్టాన్ని చవిచూసింది.

# క్రికెట్‌తో యూట్యూబ్ వేల కోట్ల ఆదాయం

**ముంబై, మే 4:** యూట్యూబ్‌లో వీడియోలు చేస్తూ డబ్బులు సంపాదించవచ్చు అనే విషయం చాలా మందికి తెలుసు. అయితే భారతీయ కంటెంట్ క్రియేటర్లు, యూబ్యూబర్లు ఎన్ని వేల కోట్ల ఆదాయం పొందారో తెలిస్తే మాత్రం నోరెళ్లబెట్టడం ఖాయం. ముంబైలో జరిగిన వేవ్ 2025 సమ్మిట్‌లో యూట్యూబ్ సిఇఒ నీల్ మోహన్ ఈ విషయం వెల్లడించారు. భారతదేశంలోని కంటెంట్ క్రియేటర్లకు యూట్యూబ్ ఇప్పటివరకు రూ.21,000 కోట్లు చెల్లించిందని, స్థానిక ప్రతిభను ప్రోత్సహించడం, సమర్థించడంలో యూట్యూబ్ పాత్రను మోహన్ పేర్కొన్నారు. భారతీయ క్రియేటర్ల వృద్ధిని, ప్రపంచవ్యాప్తంగా వారి పరిధిని మరింత పెంచడానికి రాబోయే రెండు సంవత్సరాలలో అదనంగా రూ.850 కోట్ల పెట్టుబడి పెడుతున్నట్లు కూడా ఆయన ప్రకటించారు. భారతదేశంలోని తదుపరి తరం సృష్టికర్తలకు మద్దతు ఇవ్వడానికి యూట్యూబ్ ఇక్కడ ఉంది అని మోహన్ అన్నారు. కొత్త పెట్టుబడి ప్రతిభకు శిక్షణ ఇవ్వడం, సృజనాత్మకతకు మద్దతు ఇవ్వడం, భారతీయ సృష్టికర్తలు ప్రపంచ ప్రేక్షకులను చేరుకోవడంలో సహాయపడటంపై దృష్టి సారిస్తుందని ఆయన వివరించారు. ప్రపంచవ్యాప్తంగా యూట్యూబ్‌లో 25 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్‌లతో అత్యధికంగా ఫాలోవర్లు ఉన్న నాయకుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని కూడా ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో కంటెంట్ క్రియేటర్ల సంఖ్య వేగంగా అభివృద్ధి చెందుతోంది. గత సంవత్సరంలో 100 మిలియన్లకు పైగా భారతీయ యూట్యూబ్ ఛానెల్‌లు కంటెంట్‌ను ప్రచురించాయి. 1 మిలియన్ కంటే ఎక్కువ మంది సబ్‌స్క్రైబర్‌లను కలిగి ఉన్న ఛానెల్‌లు 11,000 నుండి 15,000కి పెరిగాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps